www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
మంగళవారం 31 డిసెంబర్ 2024
సంపుటి :06 సంచిక : 213 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH



### తిరుమల శ్రీవారి దర్శనానికి
## తెలంగాణ ప్రజా ప్రతినిధులు లేఖలకు అనుమతులు

- రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి లేఖ కు స్పందించిన ఏపీ సీఎం చంద్ర బాబు

(రాపర్తి భాస్కర్ గౌడ్)
వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 30:



2 లో..

### తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియకు
# మన్మోహన్ సింగ్ కారణం
## - సీఎం రేవంత్ రెడ్డి

- మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కు భారత రత్న ఇవ్వాలి
- తెలంగాణ గడ్డ పై మన్మోహన్ సింగ్ విగ్రహం ఏర్పాటు
- ఉపాధి హామీ పథకం,సమాచార హక్కు చట్టం. జాతీయ ఆరోగ్య మిషన్, ఆధార్ కార్డు లాంటి పథకాలు
- ప్రత్యేక అసెంబ్లీ ఏర్పాటు సింగ్ సంతాప తీర్మానం లో సీఎం తో సహా అన్ని పార్టీల సభ్యుల ప్రసంగం

(రాపర్తి భాస్కర్ గౌడ్)
వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 30:
తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ గందరగోళానికి దారి తీయకుండా రాజ్యాంగ సవరణలు అవసరం లేకుండా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ తనకు అత్యంత సన్నిహితుడైన జైపాల్ రెడ్డి తో మాట్లాడి వ్యూహాత్మకంగా చతురతతో వ్యవహరించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. సోమవారం నాడు ప్రత్యేకం గా ఏర్పాటు చేసిన అసెంబ్లీ సమావేశంలో మన్మోహన్ సింగ్



సంతాప తీర్మానం సందర్భంగా రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి

2 లో..



## ప్రభుత్వ కార్య క్రమాలలో భాగ్య స్వామిగా ఉండాలనే తమ నిబద్ధత
### - సత్య నాదెళ్ల

- సత్య నాదెళ్ల తో భేటీ అయిన సీఎం రేవంత్
- రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సహా జయేశ్ రంజన్, అజీజ్ రెడ్డి లు

(రాపర్తి భాస్కర్ గౌడ్)
వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 30:
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రపంచ టెక్ దిగ్గజ మైక్రోసాఫ్ట్ సంస్థ చైర్మన్ & సీఈవో సత్య నాదెళ్ల గారితో భేటీ అయ్యారు. మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి ,దుద్దిళ్ల శ్రీధర్ బాబు ల తో కలిసి సీఎం హైదరాబాద్‌లోని సత్య నాదెళ్ల నివాసంలో సోమవారం సమావేశమయ్యారు. తెలంగాణ ప్రభుత్వం 2 లో..

## రైతులతో చర్చలకు సిద్ధమైన కేంద్రం

- జనవరి 3న చర్చలకు సుప్రీం ఆదేశం




2 లో..




### అజ్మీర్ దర్గాకు చాదర్ సమర్పించిన కేటీఆర్

( రాపర్తి భాస్కర్ గౌడ్)
వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 30:
అజ్మీర్ దర్గా ఉర్సు సందర్భంగా ప్రతి ఏడాది సమర్పించే 'చాదర్'ను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్‌లో, మాజీ మంత్రి మరియు ఎమ్మెల్సీ మహమూద్ అలీ ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం మత పెద్దలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు. పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ కేరాఫ్
# కమీషన్ల సర్కార్

- 14 శాతం కమీషన్ ఇస్తేనే పెండింగ్ బిల్లులు మంజూరవుతున్నాయి
- ఈ విషయంలో మంత్రుల మధ్యే వార్ మొదలైంది
- ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు కప్పం కట్టడంపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదు..
- మాజీ సర్పంచులకు బిల్లులివ్వకుండా నిండా ముంచింది
- గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులన్నీ మాజీ సర్పంచులు చేసినవే...
- అయినా వాళ్లకు బిల్లులివ్వకుండా అప్పుల పాల్జేయడం దుర్మార్గం
- తాజా మాజీలారా.... రాబోయే స్థానిక ఎన్నికల్లో మీ సత్తా చాటండి
- మీకు అండగా మేమున్నాం...
- మీపక్షాన అతి త్వరలో ఉద్యమిస్తాం...
- కాంగ్రెస్ మెడలు వంచి బిల్లులు చెల్లించేలా చేస్తాం...
- చేతగాని కాంగ్రెస్ సర్కార్ వల్లే రాష్ట్రంలో క్రైం రేట్ పెరిగింది
- అల్లు అర్జున్ కు, రేవంత్ కు ఎక్కడో చెడింది
- పవన్ రేవంత్ ను ఏమన్నారో నాకు తెలియదు
- అసెంబ్లీలో గంటల తరబడి చర్చించాల్సిన అంశమే కాదు
- 6 గ్యారంటీలపై చర్చ జరగకుండా దారి మళ్లించేందుకు కాంగ్రెస్ డ్రామాలాడుతోంది...



*కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ బిల్లు మంజూరు కావాలన్నా 8 నుండి 14 శాతం కమీషన్లు దండుకుంటోందని ఆరోపించారు. కాంగ్రెస్ కేబినెట్ లో కొందరు నిజాయితీ మంత్రులున్నారని, వారికి ఈ విషయం ఏ మాత్రం నచ్చడం లేదన్నారు. ఈ కమీషన్లపై కాంగ్రెస్ లోనే అంతర్యుద్ధం నడుస్తోందని, ఎప్పుడైనా ఈ కమీషన్ల భాగోతం బద్దలు కావొచ్చని అన్నారు.. కమీషన్ల మోజులో పడి ఢిల్లీ కాంగ్రెస్ నేతలకు కప్పం కడుతూ తమ సీటును కాపాడుకోవడానికే కాంగ్రెస్ పాలకులు పరిమితమయ్యారే తప్ప ప్రజా సమస్యలను పూర్తిగా గాలికొదిలేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో పెండింగ్ బిల్లులు మంజూరు కాక రాష్ట్రవ్యాప్తంగా 12 వేలకు మాజీ సర్పంచులు రోడ్డున పడ్డా రేవంత్ రెడ్డి సర్కార్ కు చీమ కుట్టినట్లయినా లేదని మండిపడ్డారు. మాజీ సర్పంచులకు కిషన్ రెడ్డి నాయకత్వంలో బీజేపీ అండగా నిలుస్తోందన్నారు. మాజీ సర్పంచుల పక్షాన అతి త్వరలోనే ఉద్యమిస్తామన్నారు.*

కరీంనగర్ వెలుతురు డిసెంబర్ 30:
సోమవారం రోజున మధ్యాహ్నం తాజా మాజీ సర్పంచుల రాష్ట్ర సంఘం అధ్యక్షులు అక్కినపల్లి కరుణాకర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జేఏసీ నాయకులు కరీంనగర్ ఎంపీ కార్యాలయానికి తరలివచ్చి బండి సంజయ్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ "ఈ రాష్ట్రంలో ఎన్నో సమస్యలపై పోరాడి పరిష్కారం చూపిన నాయకుడు బండి సంజయ్. మాజీ సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ఆయన ద్రుష్టికి తీసుకొచ్చి పరిష్కరిస్తారనే నమ్మకంతో కలిసి వినతి పత్రం సమర్పించాం. మేం ప్రజల కోసం పనులు చేసి అప్పుల పాలైతే... కనీసం పెండింగ్ బిల్లులు మంజూరు చేయకపోవడంతో ఇయాళ రోడ్డున పడ్డాం. మా పక్షాన పోరాడాలని సంజయన్నను కోరాం. అండగా ఉంటానన్న భరోసానిచ్చిన బండి సంజయ్ అన్నకు రుణపడి ఉంటాం..."అని పేర్కొన్నారు. అనంతరం బండి సంజయ్ వారితో కలిసి మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.. ఏమన్నారంటే....
కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకత్వం 3 లో..

### మన్మోహన్ గొప్పతనాన్ని
## గుర్తించిన పివి

- రాజకీయాలకు అతీతంగా ఆర్థిక బాధ్యతలు అప్పగించిన పివి
- మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలన్నతీర్మానానికి ఆమోదం
- పివికి కూడా ఢిల్లీలో గుర్తింపు దక్కాలని కోరిన కెటిఆర్



హైదరాబాద్,డిసెంబర్30(వెలుతురు):
మన్మోహన్ సింగ్ గొప్పతనం, సామర్థ్యం, జ్ఞానాన్ని ముందుగా గుర్తించిన వ్యక్తి తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. గొప్ప ఆలోచనకు అరుదైన 2 లో..

## విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా సర్వ శిక్షా ఉద్యోగులు సమ్మె విరమించి విధుల్లో చేరండి
### - మంత్రులు పొన్నం, సీతక్క

- 25 రోజులుగా కేజీబీవి స్కూల్ లలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు
- సమ్మె విరమిస్తే మీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ దృష్టికి తీసుకుపోతాం
- సర్వ శిక్షా ఉద్యోగుల సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్,సీతక్క

(రాపర్తి భాస్కర్ గౌడ్)
వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 30:
గత 25 రోజులుగా సమ్మె చేస్తున్న దాదాపు 19,500 మంది సర్వ శిక్షా ఉద్యోగులు కేజీబీవి ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్ శ్రేయస్సు దృష్ట్యా తక్షణమే సమ్మె విరమించాలని మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క కోరారు. సమ్మె చేయడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని కేజీబీవీ పాఠశాలల్లో బడుగు బలహీన



వర్గాల పిల్లలు చదువుతున్నారని సమ్మె చేస్తూ వారిని అక్కడ చదువుతున్న విద్యార్థులను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేయవద్దని సర్వ శిక్షా ఉద్యోగులకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.తాము సుదీర్ఘ కాలంగా కస్తూర్బా గాంధీ పాఠశాలలో చేస్తున్నామని తమని రెగ్యులరైజ్ చేయడం లేదా ఉద్యోగ భద్రతతో కూడిన పే స్కూల్ అమలు చేయాలని సర్వ శిక్షా ఉద్యోగులు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. సర్వ శిక్షా కస్తూర్బా గాంధీ పాఠశాలు కేంద్రం పరిధిలో 60 శాతం రాష్ట్రం పరిధిలో 40 శాతం ఉంటుందని ఇప్పటికే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సర్వ శిక్షా ఉద్యోగుల సమస్య తెలంగాణలోనే లేదని దేశ వ్యాప్తంగా ఉందని కేంద్ర ప్రభుత్వం కోరితే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి కేంద్రానికి ప్రతిపాదనలు పెడతామని మంత్రి పొన్నం 2 లో..

### ఎపి నూతన సిఎస్‌గా
## విజయానంద్

- నీరబ్ స్థానంలో నియమించిన ప్రభుత్వం



అమరావతి,డిసెంబర్30( వెలుతురు):
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా కె.విజయానంద్ నియమితులయ్యారు. 1992 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన విజయానంద్‌ను సీఎస్‌గా నియమిస్తూ ఆదివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా విజయానంద్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత సీఎస్ 8 లో..

### పేర్ని నాని తప్పులే..
## వారి కుటుంబాన్ని వీధుల్లో పడేసింది

- బియ్యం మాయం నిజం.. డబ్బులు కట్టిందీ నిజమే కదా
- గత ప్రభుత్వం కన్నా కూటామి బాగా పనిచేస్తోంది
- నాగబాబును ముందుగా ఎమ్మెల్సీగా చేస్తాం
- డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ స్పష్టీకరణ



గుటూరు,డిసెంబర్30( వెలుతురు):
రేషన్ బియ్యం మాయమైంది నిజం.. డబ్బులు కట్టింది వాస్తవం.. ఇంట్లో ఆడవాళ్ల పేరుతో గిడ్డంగి పెట్టిందెవరని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు కుటుంబానికి చెందిన వారిని మీరు తిట్టలేదా.. అని 2 లో..

(మొదటి పేజీ తరువాయి..)

## తిరుమల శ్రీవారి దర్శనానికి తెలంగాణ ప్రజా ప్రతినిధులు లేఖలకు అనుమతులు

గత సంప్రదాయం ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి చెందిన పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి, శాసనసభ్యులు ఇచ్చే విజ్ఞాపన ఉత్తరాలపై తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనానికి, ఆర్జిత సేవలకు అవకాశం కల్పించాలన్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వినతికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.తిరుమల శ్రీవారి ఆలయంలో దర్శనాలకు తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రతినిధుల (ఎంపి /ఎంఎల్సీ /ఏమ్మెల్యే ) సిఫారసు లేఖలను అనుమతించాలని నిర్ణయం తీసుకున్నామని తెలియజేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కి ప్రత్యుత్తరం రాశారు.తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారితో వందల సంవత్సరాలుగా విడదీయరాని ఆధ్యాత్మిక అనుబంధం ఉందని, తెలంగాణ నుంచి ప్రతి రోజూ వేలాది భక్తులుస్వామివారినిదర్శించుకుంటున్నారని, ఈ సంఖ్య ప్రతి ఏటా పెరుగుతూనే ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి రాసిన లేఖలో గుర్తుచేశారు. సంప్రదాయం ప్రకారం తెలంగాణకుచెందినప్రజాప్రతినిధులు ఇచ్చే విజ్ఞాపనల మేరకు స్వామి వారి దర్శనానికి, ఆర్జిత సేవలకు అవకాశం కల్పించాలనిముఖ్యమంత్రి రాసిన లేఖలో కోరారు.శ్రీవారి దర్శనానికి అనేక రాష్ట్రాల నుంచి వచ్చే సామాన్య భక్తుల సౌకర్యం, రద్దీ, సులభంగా దర్శనం కలిగించడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని, తెలుగు జాతి సత్సంబంధాల నేపథ్యంలో తెలంగాణ ప్రజాప్రతినిధుల లేఖలపై అనుమతులు మంజూరు చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు రాసిన లేఖలో పేర్కొన్నారు.ప్రతి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ నుంచి ప్రతివారం ఏదైనా రెండు రోజుల్లో (సోమవారం నుంచి గురువారం వరకు) వీఐపీ బ్రేక్ దర్శనం (రూ.500/- టికెట్) కొరకు రెండు లేఖలు, స్పెషల్ ఎంట్రీ దర్శన్ (సెడ్ ) (రూ. 300/- టికెట్) కొరకు రెండు లేఖలు స్వీకరించబడతాయని పేర్కొన్నారు. ప్రతి లేఖతో ఆరుగురు భక్తుల వరకు దర్శనానికి సిఫారసు చేయొచ్చని చంద్రబాబు నాయుడు రాసిన లేఖలో పేర్కొన్నారు.ం

## రైతులతో చర్చలకు సిద్ధమైన కేంద్రం

**న్యూఢిల్లీ,డిసెంబర్30 :**

రైతులతో చర్చలు జరిపేందుకు కేంద్రం సిద్ధమైంది. ఎంఎస్‌పిపై మొదటి రౌండ్ చర్చల కోసం జనవరి 3న సుప్రీం కమిటీ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం)ని ఆహ్వానించింది. రిటైర్డ్ జస్టిస్ నవాబ్ సింగ్ అధ్యక్షతన ఏర్పడిన ఈ సుప్రీంకోర్టు కమిటీ రైతులతో చర్చలు జరపనుంది. ఎస్‌కెఎం ఈ ఆహ్వానాన్ని అంగీకరించిందని ఎస్‌కెఎం జాతీయ సమన్వయ కమిటీ సభ్యులు రమీందర్ సింగ్ పాటియాలా తెలిపారు. పంటలకు ఎంఎస్‌పి (కనీస మద్దతు ధర)కి కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధ హామీ కల్పించాలంటూ పంజాబ్, హర్యానా ప్రభుత్వాలు గత కొన్ని రోజులుగా ఆందోళన చేపడుతున్న సంగతి తెలిసిందే. మరోవైపు సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర విభాగం), కిసాన్ మజ్దూర్ మోర్చాలు డిసెంబర్ 30 బంద్‌కు పిలుపునిచ్చాయి. సోమవారం ఉదయం 7.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు బంద్ కొనసాగనుంది. బంద్‌తో వందేభారత్ సహా 150 రైళ్లు రద్దయ్యాయి. 200కి పైగా ప్రదేశాలలో చక్కాజామ్‌ల కారణంగా బస్సులు నిలిచిపోయాయి. విద్యా సంస్థలు, వాణిజ్య సముదాయాలు మూతపడ్డాయి. ఎంఎస్‌పి సహా రుణమాఫీ, విద్యుత్ చార్జీలు, రైతులకు, రైతు కూలీలకు పింఛన్ల వంటి 13 డిమాండ్లను పరిష్కరించాలంటూ రైతు నేత దల్లేవాలే గత 35 రోజులుగా నిరాహార దీక్ష చేపడుతున్నారు.

## ప్రభుత్వ కార్య క్రమాలలో భాగ్య స్వామిగా ఉండాలనే తమ నిబద్ధత

చేపట్టే అన్ని కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉండాలనే తమ నిబద్ధతను కొనసాగిస్తామని సత్య నాదెళ్ల తెలిపారు. ఈ సందర్భంగా నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ అవసరాలకు తగినట్లు మౌలిక సదుపాయాలను మెరుగుపర్చే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతను సత్య నాదెళ్ల ప్రశంసించారు. ప్రజా ప్రభుత్వం తలపెట్టిన నైపుణాభివృద్ధి, మెరుగైన మౌలిక వసతల కల్పన వంటి అంశాలు ఆర్థికాభివృద్ధికి దోహదపడటంతో పాటు హైదరాబాద్‌ను ప్రపంచంలోని టాప్ నగరాల్లో ఉంచగలవని సత్య నాదెళ్ల అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ రంగంలో హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా తీర్చిదిద్దేలా రాష్ట్ర ప్రభుత్వం ఏఐ, జెన్ ఏఐ , క్లౌడ్ ఆధారిత వ్యవస్థల అభివృద్ధిపై దృష్టి సారించిందని, ఈ ప్రయత్నాలకు మైక్రోసాఫ్ట్ సంస్థ కూడా మద్దతుగా నిలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సత్య నాదెళ్ల కు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని తొలి సాంకేతిక సంస్థల్లో మైక్రోసాఫ్ట్ ఒకటని, ప్రస్తుతం 10,000 మందికి ఉపాధి కల్పిస్తోన్న విషయాన్ని గుర్తుచేసిన ముఖ్యమంత్రి రాష్ట్రంలోని 600 మెగావాట్ల (%వీజెూ%) సామర్థ్యం కలిగిన డేటా సెంటర్ లోనూ మైక్రోసాఫ్ట్ పెట్టుబడి పెట్టిన అంశాన్ని ప్రస్తావిస్తూ హైదరాబాద్‌తో పాటు తెలంగాణవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ పెట్టుబడులను విస్తరిస్తున్నందుకు సత్య నాదెళ్ల కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, ఫ్యూచర్ సిటీ, కొత్త మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ల అభివృద్ధి, రాష్ట్రంలో మౌలిక వసతులు కల్పనకు అమలు చేస్తున్న ప్రణాళికలు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వంటి సంస్థల ద్వారా పరిశ్రమలకు అవసరమైన ప్రతిభావంతులను అందుబాటులో ఉంచేందుకు ప్రజా ప్రభుత్వం చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సత్య నాదెళ్ల కు వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ,ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా సర్వ శిక్షా ఉద్యోగులు సమ్మె విరమించి విధుల్లో చేరండి



వెల్లడించారు.25 రోజులుగా కేజీబీవీ ఉపాధ్యాయులు సమ్మె చేయడం వల్ల వారికి విద్యాబోధన జరగక తీవ్రంగా నష్టపోతున్నారని తక్షణమే సమ్మె విరమించి ఉద్యోగులు విధుల్లో చేరాలని కోరారు. సమ్మె విరమిస్తే వారి సమస్యల పై ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి డిప్యూటీ సిఎం బట్టి విక్రమార్క నేతృత్వంలో ఏర్పడిన సబ్ కమిటీ తో సమావేశానికి పిలుస్తమని సబ్ కమిటీ లో తనతో పాటు మంత్రి శ్రీధర్ బాబు ,ప్రభుత్వ సలహాదారు కేశవ రావు కూడా ఉన్నారని సబ్ కమిటీ లో సర్వ శిక్షా ఉద్యోగుల సమస్యల పై చర్చిస్తామని పేర్కొన్నారు.నాన్ ఫైనాన్సియల్ డిమాండ్స్ లో మహిళా ఉద్యోగులకు మెటర్నరి లీవ్స్ ,సీఎల్ లు తదితర వాటిపై సాధ్యమైనంత వరకు ప్రభుత్వం పరిష్కరమయ్యేలా ప్రభుత్వం చూస్తుందని , ఆర్థికపరమైన డిమాండ్స్ పై సబ్ కమిటీ లో చర్చించిన తరువాత నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి , ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సర్వ శిక్షా ప్రాజెక్టు డైరెక్టర్ నరసింహ రెడ్డి ,మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి , శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియకు మన్మోహన్ సింగ్ కారణం

(మొదటి పేజీ తరువాయి..)

మాట్లాడారు,దేశానికి ఎనలేని సేవలు చేసిన మన్మోహన్ సింగ్ కు భారతరత్న పురస్కారంతో సత్కరించాలని కేంద్రానికి సీఎం విజ్ఞప్తి చేశారు. తెలంగాణ గడ్డపై మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని సగౌరవంగా ఏర్పాటుచేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు,డాక్టర్ మన్మోహన్ సింగ్ తెలంగాణకు ఆత్మబంధువు అని, ప్రధానమంత్రి హెూదాలో తెలంగాణకు రాష్ట్ర హెూదా కల్పించిన గొప్ప మానవతావాది అని, తెలంగాణతో వారి అనుబంధం విడదీయలేనిదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు,రాష్ట్రానికి పురుడు పోసిన డాక్టర్‌గా మన్మోహన్ సింగ్ ని తెలంగాణ సమాజం ఎప్పటికీ గుండెల్లో పెట్టుకుంటుందని సీఎం చెప్పారు.ఆర్థిక సంస్కరణలతో భారతదేశాన్ని ప్రపంచంలో మేటిగా నిలబెట్టడమే కాకుండా, ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టం, జాతీయ ఆరోగ్య మిషన్, అందరికీ ఆధార్ కార్డు వంటి విప్లవాత్మక కార్యక్రమాలను ప్రవేశపెట్టిన ఘనత డాక్టర్ మన్మోహన్ సింగ్ దే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భారతదేశాన్ని ప్రపంచంలో మేటిగా నిలబెట్టేందుకు కృషి చేసిన దార్శనికుడు డాక్టర్ మన్మోహన్ సింగ్ కి అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న ప్రదానం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ, సభా నాయకుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అలాగే, తెలంగాణ ప్రజల 60 ఏండ్ల ఆకాంక్షలను నెరవేర్చిన గొప్ప నాయకుడిగా, భావి తరాలు స్మరించుకునేలా డాక్టర్ మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను సభ ఆమోదించింది.మాజీ ప్రధానమంత్రి, ఆర్థిక వేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ దేశ పురోగతికి డాక్టర్ మన్మోహన్ సింగ్ అందించిన సేవలు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పురుడుపోసి ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయే గొప్ప నాయకుడిగా వారి కృషిని స్మరిస్తూ ముఖ్యమంత్రి తీర్మానం ప్రవేశపెట్టారు. శాసనసభలో ముఖ్యమంత్రి ప్రవేశపెట్టి తీర్మానం."భారత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ గారి మృతి పట్ల ఈ శాసనసభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తోంది. శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తుంది. అంతర్జాతీయ ప్రఖ్యాతి పొందిన ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ దేశానికి విశిష్టమైన సేవలను అందించారు. కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారుగా, భారత రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్‌గా, ప్రణాళిక సంఘం డిప్యూటీ చైర్‌పర్సన్‌గా, కేంద్ర ఆర్థిక మంత్రిగా, భారత ప్రధానమంత్రిగా వివిధ హెూదాలలో వారు ఈ దేశానికి ఎన్నో సేవలను అందించారు.డాక్టర్ మన్మోహన్ సింగ్ దేశంలో ఆర్థిక సంస్కరణల రూపశిల్పి. 1991 మరియు 1996 మధ్య కేంద్ర ఆర్థిక మంత్రిగా దేశ ఆర్థిక వ్యవస్థను సరళీకరించి ఆర్థిక స్థితిగతుల దశ దిశను మార్చే నిర్మాణాత్మక సంస్కరణలు అమలు చేయడంలో కీలక పాత్ర పోషించారు. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలతో అంతర్జాతీయ స్థాయిలో భారత ఆర్థిక వ్యవస్థను సుస్థిరంగా నిలబడేలా చేయగలిగారు. 2004 మరియు 2014 మధ్య భారత ప్రధానమంత్రిగా ఉన్న మన్మోహన్ సింగ్ తన పదవీకాలంలో ఎన్నో చారిత్రాత్మకమైన సామాజిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఆర్థిక మంత్రిగా వారు వేసిన పునాదులు ఈరోజు భారతదేశం ప్రపంచ దేశాలతో మనం పోటీ పడుతున్నాం. ప్రపంచమే గర్వించదగ్గ ఆర్థికవేత్త. వారిని కోల్పోవడం దేశానికి తీరని లోటు.ప్రజలకు ఉపాధి కల్పించే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, పరిపాలనలో పారదర్శకతను చాటి చెప్పే సమాచార హక్కు చట్టం, ప్రజారోగ్యానికి ప్రాధాన్యతను ఇచ్చిన జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ ప్రారంభించారు. ప్రతి పౌరుడికి ఆధార్ కార్డు లాంటి సామాజిక విప్లవాత్మక కార్యక్రమాలను వారి హయాంలోనే మొదలయ్యాయి. ఉపాధి హామీ పథకంతో ఏడాదికి కనీసం వంద రోజుల పని కల్పించడం ద్వారా పేదలకు ఆహార భద్రత కల్పించవచ్చన్న గొప్ప లక్ష్యంతో ఉమ్మడి రాష్ట్రంలో అనంతపూర్‌లో, తెలంగాణలోని మహబూబ్‌నగర్‌లో ఆ కార్యక్రమాన్ని దేశానికి అంకితం చేయడం జరిగింది. భూ సేకరణ సందర్భాల్లో నిరాశ్రయులవుతున్న వారికి అండగా నిలవాలని, వారికి నష్టం జరక్కుండా ఉండాలని ఆనాడు డాక్టర్ మన్మోహన్ సింగ్ భూసేకరణ చట్టంలో గణనీయమైన మార్పులు తీసుకొచ్చారు. అటవీ ప్రాంతాల్లో ఉన్న ఆదివాసీలు, గిరిజనులను ఆదుకోవడానికి 2006 లో అటవీ హక్కుల చట్టాన్ని సవరించడం ఆదివాసీల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. 4 కోట్ల తెలంగాణ రాష్ట్ర ప్రజలు డాక్టర్ మన్మోహన్ సింగ్ కి ఎంతో రుణపడి ఉన్నారు. వారు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మార్గం సుగమమైంది. 2014 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని పార్లమెంట్ ఆమోదించింది. ఎన్నో ఏండ్ల పోరాటం ఫలించి తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. మన్మోహన్ సింగ్ దేశానికి ముఖ్యంగా తెలంగాణకు చేసిన సేవలకు ఈ సభ అపారమైన కృతజ్ఞతలను తెలియజేస్తుంది.మన్మోహన్ సింగ్ తెలంగాణకు ఆత్మబంధువు. 60 ఏళ్ల తెలంగాణ కలను సాకారం చేసిన నాయకుడు. తెలంగాణ ప్రజలకు శ్రీమతి సోనియాగాంధీ ఇచ్చిన మాటను పార్లమెంటరీ ప్రక్రియలో నెరవేర్చే బాధ్యతతో ప్రధానమంత్రి హెూదాలో తెలంగాణకు రాష్ట్ర హెూదా కల్పించిన గొప్ప మానవతావాది. తెలంగాణతో ఆయన అనుబంధం విడదీయలేనిది. రాష్ట్రం ఉన్నంత వరకు మర్చిపోలేనిది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో... రాజ్యసభలో ఒక దశలో రాజ్యాంగ సవరణల కోసం వచ్చిన చర్చలు తెలంగాణ రాష్ట్రం వెనక్కి పోతుందేమో అన్నంత గందరగోళ పరిస్థితులు ఏర్పడిన సందర్భంలో మన్మోహన్ సింగ్ గారికి అత్యంత సన్నిహితుడిగా అత్యంత నమ్మకమైన సహచరుడుగా జైపాల్ రెడ్డి తో మాట్లాడి వ్యూహాత్మక చతురతతో సమన్వయ పరిచి ఆ సవరణలకు ప్రధానమంత్రి వెళ్లి రాజ్యసభలో ప్రకటన ఇప్పించిన సందర్భం మనం ఎప్పటికీ మర్చిపోలేని సందర్భం. ఈ రాష్ట్రానికి పురుడు పోసిన డాక్టర్‌గా మన్మోహన్ సింగ్ ని తెలంగాణ సమాజం ఎప్పటికీ గుండెల్లో పెట్టుకుంటుంది. అటువంటి మహనీయుడికి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల తరఫున ఈ శాసనసభ ద్వారా రాజకీయాలు పార్టీలకు అతీతంగా కృతజ్ఞతలు తెలపడమే కాక ఘన నివాళి అర్పించాల్సిన అవసరం ఉంది. దేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిన సందర్భంగా ఈరోజు తెలంగాణ శాసనసభ ఒకరోజు ప్రత్యేకంగా సమావేశాలను ఏర్పాటు చేసి రాజకీయాలకు అతీతంగా వారికి భారతరత్న ఇవ్వాలని ఈ సభలో సభ్యులందరి ఆమోదం కోరుతూ ఈ తీర్మానాన్నిప్రవేశపెట్టాం.భారతదేశాన్ని ప్రపంచ స్థాయిలో మేటి దేశంగా నిలబెట్టేందుకు వారు చూపిన దార్శనికత ఆయన చేసిన కృషిని అందరూ గుర్తుంచుకోవాలి, భావితరాలు స్మరించుకోవాలి. డాక్టర్ మన్మోహన్ సింగ్ కు అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రధానం ప్రధానం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఈ సభ తీర్మానం చేస్తుంది.తెలంగాణ ఏర్పాటుకు విడదీయలేని అనుబంధం ఉన్న డాక్టర్ మన్మోహన్ సింగ్ విగ్రహావిష్కరణ చేసుకోవడం ద్వారా శాశ్వతంగా మనం వారి వర్ధంతులు, జయంతులు, వారి జ్ఞాపకాలు శాశ్వతంగా తెలంగాణ ప్రజల గుండెల్లో పదిలమై ఉండే విధంగా ఒక మంచి ప్రాంతంలో వారి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సముచితమైన నిర్ణయం".ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన ఈ తీర్మానంపై సమగ్ర చర్చ అనంతరం శాసనసభ దాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సంతాప తీర్మానంపై అన్ని పార్టీల సభ్యులు మన్మోహన్ సింగ్ తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు,

# మన్మోహన్ గొప్పతనాన్ని గుర్తించిన పివి


(మొదటి పేజీ తరువాయి..)

సందర్భం వచ్చినప్పుడు ప్రపంచంలో ఏ శక్తీ ఆపలేదని చెప్పారు. మన్మోహన్ సింగ్ హాయాంలోనే తెలంగాణ ఏర్పడిందని తెలిపారు. కేంద్రంలో ఓబీసీ శాఖను ఏర్పాటు చేయాలని మన్మోహన్ సింగ్‌ను కేసీఆర్ కోరారని గుర్తుచేశారు. మన్మోహన్‌కు నివాళి కోసం అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం అయింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సభ సంతాపం తెలిపింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించే సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి బీఆర్‌ఎస్ తరఫున పూర్తిగా మద్దతిస్తున్నట్లు ప్రకటించారు. మన్మోహన్ సింగ్‌కు భారత రత్న ఇవ్వాలనే ప్రతిపాదనతో సంపూర్ణంగా ఏకీభవిస్తున్నామని అన్నారు. మన్మోహన్ సింగ్ గొప్పదనాన్ని, సామర్థ్యాన్ని మొదటిసారిగా గుర్తించింది మన తెలంగాణ బిడ్డ పీవీ నరసింహా రావు అనేది నిర్వివాదాంశం. పీవీ నరసింహా రావు దేశ ప్రధానిగా ఎన్నికైన తర్వాత రాజకీయాలతో సంబంధ లేని ఒక ఆర్థిక వేత్తను ఫైనాన్స్ మినిస్టర్‌గా నియమించారు. 1991లో బడ్జెట్ ప్రవేశపెడుతూ 'ప్రపంచం మొత్తం వినాల్సిన సమయం వచ్చింది. నా దేశం మేల్కొని ఉంది..' అంటూ ఆర్థిక వేత్తగా సంస్కరణలను ప్రవేశపెట్టే సందర్భంగా మాట్లాడారు. ఆ మాటలు.. ఆయన సిద్ధాంతం, పీవీ నరసింహారావు నాయకత్వం నేడు దేశంలో సమూల మార్పులు తీసుకొచ్చింది. కేవలం 15 రోజులు ఫారెక్స్ నిల్వలు ఉన్న నాటి రోజు నుంచి ప్రపంచమంతా ఆశ్యపడే స్థాయికి దేశాన్ని పరుగెత్తించిన ఆర్థిక సంస్కరణల శీలి డాక్టర్ మన్మోహన్ సింగ్. అనవసరపు డాంభికాలు, ఆర్భాటాలు, హడావుడి లేకుండా సింపుల్ లివింగ్.. హై థింకింగ్ అనే మాటకు పర్యాయపదంగా మన్మోహన్ సింగ్‌ను మనం చెప్పుకోవచ్చు. విశ్వాసం అనే నేటి రాజకీయాల్లో అరుదైన పదం. తనకు అండగా నిలబడిన కాంగ్రెస్ పార్టీకి జీవితాంతం సేవలందించిన మహానుభావుడు. ఆర్థికమంత్రిగా, తర్వాత ప్రధానిగా పనిచేసి, ఆ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత కూడా పూర్తి స్థాయిలో పార్టీ కోసం పనిచేసిన అభ్యుదయ వాది, నిరాడంబర మనిషి మన్మోహన్ సింగ్ అని అన్నారు. ఆయన ప్రధానిగా ఉన్న కాలంలోనే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్.. ఏడాదిన్నరపాటు కేంద్ర మంత్రిగా పనిచేశారు. నాటి కాంగ్రెస్ పార్టీతో పొత్తుపెట్టుకుని గెలుపొందిన తర్వాత భాగస్వామ్య పక్షాలను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. కేసీఆర్‌కు షిప్పింగ్ మంత్రి పదవి ఇస్తే.. డీఎంకేతో చిక్కుముడి ఏర్పడింది. దీంతో మన్మోహన్ సింగ్ వద్దకు వెళ్లి తాను వచ్చింది పదవుల కోసమో, పోర్టుఫోలియోల కోసమో కాదు.. తెలంగాణ కోసమని చెప్పిన కేసీఆర్.. ఆ మంత్రిత్వ శాఖను డీఎంకేకి ఇచ్చారు. ఈ సందర్భంగా ఏ నిబద్ధతతో వచ్చారో అది ఫలించాలని కోరుకుంటున్నానని కేసీఆర్‌తో మన్మోహన్ అన్నారు. మీరు తీసుకున్న నిర్ణయంతో గుర్తింపు వస్తుందని, కర్మయోగిగా గుర్తించబడతారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తర్వాత.. ఒక గొప్ప ఆలోచనకు అరుదైన సందర్భం వచ్చినప్పుడు ప్రపంచంలో ఏ శక్తీ ఆపలేదు. అలాగే మన్మోహన్ సింగ్ నమ్మారు కాబట్టే.. తెలంగాణ ఉద్యమంలో ఉన్న నిబద్ధత, ఉద్యమానికి ఉన్న బలం, తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తి.. అన్నీ ఆయనకు అర్థమయ్యాయి కాబట్టే అనివార్య పరిస్థితుల్లో మన్మోహన్ సింగ్ నాయకత్వంలో తెలంగాణ ఏర్పడింది. దానిని తాము మర్చిపోం అని అన్నారు. మన్మోహన్ సింగ్ నిబద్ధతను గుర్తుచేసే సందర్భంలో సరిగ్గా ప్రధానిగా వారు ఎన్నికైన తర్వాత ఆరు నెలలకు కేసీఆర్.. క్యాబినెట్ సహచరుడిగా డిసెంబర్ ముఖ్యమైన డెలిగేషన్ తీసుకొస్తున్నానని, తమకు సమయం ఇవ్వాలని కోరారు. బలహీన వర్గాలకు చెందిన నాయకులను తీసుకొస్తున్నానని, తమకు ఐదు నిమిషాలు సరిపోదని 30 నిమిషాలకు కావాలని కోరారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న నాటి ప్రధాని 45 నిమిషాలు సమయమిచ్చారు. ఆయన గొప్పతనమేంటంటే.. కేంద్రంలో ఓబీసీలకు ఒక మంత్రిత్వ శాఖ ఉండాలని ప్రధాని వద్దకు 2004, డిసెంబర్ 18న ఒక బృందాన్ని తీసుకెళ్తే, 45 నిమిషాలు సమయమిచ్చిన మన్మోహన్ సింగ్ గంటన్నరపాటు వారితో గడిపారు. ఎన్నో అడ్డంకులు, ఎన్నో అభ్యంతరాలున్నా మన్మోహన్ సింగ్ ప్రజా ఉద్యమాలకు అండగా నిలబడ్డారు. ఎన్నడూ కూడా, ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా సంస్కరణల బాట నుంచి వెనక్కి తగ్గలేదు. ఆయన్ని మనం సైలెంట్ ఆర్కిటెక్ట్ ఆఫ్ మోడ్రన్ ఇండియా అని పిలువవచ్చు. మన్మోహన్ కాదు ఈయన మౌన మోహన్ సింగ్ అని, మౌన ముని అని పేర్లు పెట్టారు. అయితే అవేవీ పట్టించుకోకుండా ఆయన పని ఆయన చేసుకుంటూ పోయారు. విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకొచ్చారు. అవమానం చేస్తే ఆకాశం స్థాయి తగ్గదు. ఎన్ని నిందలు వేసిన మహోన్నతులు వణకరు, బెనకరు. అలాంటి స్థితప్రజ్ఞతను మనం మన్మోహన్ సింగ్‌లో చూశాం అన్నారు. మన్మోహన్ సింగ్ గురించి మాట్లాడుకునేటప్పుడు మన తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు గురించి కూడా గుర్తుచేసుకోవాలి. కేసీఆర్ ఆదేశాల మేరకు ఢిల్లీకి వెళ్లి మన్మోహన్ సింగ్‌కు నివాళులు అర్పించాం. అంత్యక్రియల్లో పాల్గొన్నాం. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించాం. అక్కడికి వెళ్లినప్పుడు మన్మోహన్ సింగ్‌కు జరిగిన గౌరవ ప్రదమైన వీడ్కోలు మన పీవీకి జరుగలేదనే బాధ అనిపించింది. మనవాడైన పీవీ నరసింహా రావుకు కూడా ఢిల్లీలో స్మారకం ఏర్పాటు చేయాలని తెలంగాణ శాసన సభ తీర్మానం చేయాలని, తెలంగాణ బిడ్డకు సముచిత గౌరవం కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలనే ప్రతిపాదన సభ నుంచి వెళ్తే బాగుంటుంది. ఢిల్లీలో అందరు ప్రధానులకు స్మారకం ఉంది. మన పీవీ నరసింహా రావుకు లేదు. అది మనకు అవమానం, తీరని లోటు. ఈ తీర్మానంతోపాటు దానిని కూడా జతపరిచి పంపించనట్లయితే మన గౌరవం కూడా పెరుగుతుంది. సీఎం ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానానికి సంపూర్ణ తెలుపుతున్నాం. ఆ కుటుంబానికి ప్రగాఢమైన సానుభూతిని తెలుపుతున్నాం' అని కేటీఆర్ అన్నారు.

# పేర్ని నాని తప్పులే.. వారి కుటుంబాన్ని వీధుల్లో పడేసింది

(మొదటి పేజీ తరువాయి..)

నిలదీశారు. మంగళగిరిలో పవన్ మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'వైకాపా నేత పేర్ని నాని చేసిన తప్పులే ఆయన ఇంట్లో వాళ్లను వీధిలోకి తెచ్చాయి. అప్పుడు బూతులు తిట్టి, ఇప్పుడు నీతులు వల్లిస్తే ఎలా? అని అన్నారు. గత ప్రభుత్వం కన్నా కూటమి ప్రభుత్వం చాలా గొప్పగా పనిచేస్తోంది. అడ్డగోలు నిర్ణయాలపై అధికారులు కూడా చెప్పలేకపోతున్నారు. అన్ని వ్యవస్థలను నాశనం చేశారు, పనిచేసే సంస్కృతిని చంపేశారు. గత ప్రభుత్వం తొలి 6 నెలలు, ఈ ప్రభుత్వం 6 నెలల పాలన బేరీజు వేసుకోండి. ఆకాశానికి, భూమికి ఉన్నంత తేడా ఉంటుందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల కోసం పనిచేయాలని చెబుతున్నాం. పాలన తీరు, ప్రజా సమస్యల పరిష్కారంపైనే ఇప్పటివరకు దృష్టి పెట్టాం. ఇప్పుడు నేరుగా ప్రజల్లోకి వెళ్లి క్షేత్రస్థాయిలో ప్రతి సమస్యను పరిష్కరిస్తాం. ఎన్డీఏ ఆధ్వర్యంలో చాలా బాధ్యతతో పనిచేస్తున్నాం. పదవులు అనుభవించడం కాదు.. బాధ్యతతో పనిచేస్తాం. ప్రతి గ్రామానికి తాగునీరు ఇవ్వాలనేది ప్రధాని మోదీ కల. తాగునీరు, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాం' అని పవన్ కల్యాణ్ చెప్పారు. రాజకీయాల్లో పని తీరే ప్రామాణికమని, కలిసి పనిచేసిన వారిని గుర్తించాల్సిన బాధ్యత తనకు ఉందని పవన్‌కల్యాణ్ అన్నారు. సోదరుడు, జనసేన నాయకుడు అయిన నాగబాబుకు మంత్రి పదవి ఇచ్చే విషయమై స్పందించారు. 'మాకు బ్యాక్‌గ్రౌండ్ లేకున్నా అన్నయ్య సొంతంగా ఎదిగారు. ఇప్పుడు మా తర్వాత తరం పిల్లలకు ఒక బ్యాక్‌గ్రౌండ్ ఉంది. మనతో ప్రయాణం చేసి, పనిచేసిన వారిని నేను గుర్తించాలి. నాగబాబు నాతో పాటు సమానంగా పనిచేశారు. వైసీపీ నేతలతో తిట్లు తిన్నారు. పార్టీ కోసం నాగబాబు నిలబడ్డారు. ఇక్కడ కులం, బంధుప్రీతి కాదు.. పనిమంతుడా కాదా? అన్నది చూడాలి. ఎంపీగా ప్రకటించి, మళ్లీ నాగబాబును తప్పించాం"మనోహర్, హరిప్రసాద్ మొదటి నుంచి పార్టీ కోసం పనిచేశారు. ఎవరికి ప్రతిభ ఉందో చూసి, వాళ్లకు పదవులు ఇస్తాం. ఈ విషయంలో మీరెందుకు జగన్‌ను అగడలేదు? కేవలం పవన్‌కల్యాణ్‌ను మాత్రమే ఎందుకు అడుగుతున్నారు? నాగబాబు ఎమ్మెల్సీగా ఎంపికవుతారు. మంత్రి పదవి విషయంలో తర్వాత చర్చ చేస్తాం. నాగబాబు త్యాగం గుర్తించి రాజ్యసభకు అనుకున్నాం. కుదరలేదు కాబట్టి, ఎమ్మెల్సీ అనుకున్నాం. కందుల దుర్గేష్ ఏ



కులమో నాకు తెలియదు. ఆయన పనితీరు నచ్చి మంత్రి పదవి ఇచ్చా. రాజకీయాల్లో కులం కాదు.. పని తీరే ప్రామాణికం' అని పవన్‌కల్యాణ్ అన్నారు. 'మనతో ప్రయాణం చేసి, పని చేసిన వారిని నేను గుర్తించాలి నాగబాబు నాతో పాటు సమానంగా పని చేశారు. వైసీపీ నేతలతో తిట్లు తిన్నారు, పార్టీ కొసం నిలబడ్డారు. ఇక్కడ కులం, బంధు ప్రీతి కాదు.. పనిమంతుడా కాదా అనేదే ముఖ్యం. నాగబాబు ఎమ్మెల్సీగా ఎంపిక అవుతారు. మంత్రి అనేది తరువాత చర్చ చేస్తాం. నాగబాబు త్యాగం గుర్తించి రాజ్యసభ అనుకున్నాం. అక్కడ కుదరలేదు కాబట్టి.. ఎమ్మెల్సీ అనుకున్నాం. ముందు నాగబాబు ఎమ్మెల్సీ అయ్యాకనే మంత్రి పదవి గురించి ఆలోచిస్తానని అన్నారు. ఎక్కడో ప్రత్యేక పరిస్థితులు ఉంటేనే ఎమ్మెల్సీ కాకముందు మంత్రి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇక్కడ ఇప్పుడు అంత ప్రత్యేక పరిస్థితులు ఏమి లేవన్నారు. అందువలన నాగబాబు ముందు ఎమ్మెల్సీ అవ్వాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వెల్లడించారు.

## తెలంగాణలో పది మంది ఐపీఎస్‌ల బదిలీ

( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 30:**
తెలంగాణ రాష్ట్రంలో సోమ వారం నాడు పది మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేశారు, ఈ మేరకు డీజీపీ జితేందర్ కు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీచేశారు, బదిలీ అయిన ఐపీఎస్ అధికారుల వివరాలు ఇలా ఉన్నాయి,ఉట్నూరు అదనపు ఎస్పీగా కాజల్.దేవరకొండ అదనపు ఎస్పీగా మౌనిక.భువనగిరి అడిషనల్ ఎస్పీగా రాహుల్‌రెడ్డి. ఆసిఫాబాద్ అడిషనల్ ఎస్పీగా చిత్తరంజన్.కామారెడ్డి అడిషనల్ ఎస్పీగా బొక్కా చైతన్య.జనగామ అడిషనల్ ఎస్పీగా చేతన్ నితిన్. భద్రాచలం అడిషనల్ ఎస్పీగా విక్రాంత్‌కుమార్.కరీంనగర్ రూరల్ అడిషనల్ ఎస్పీగా శుభమ్ ప్రకాష్. నిర్మల్ అడిషనల్ ఎస్పీగా రాజేష్ మీనా.డీజీపీ కార్యాలయానికి అంకిత్‌కుమార్ అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు,



**సోమవారం రోజున చిలుకూరు బాలాజీ టెంపుల్ కి మహేష్ గాగడ చత్తీస్గడ్ మాజీ మంత్రి విచ్చేశారు ఈ కార్యక్రమంలో బొక్క బాల్ రెడ్డి బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకులు, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.**

రంగారెడ్డి జిల్లా వెలుతురు డిసెంబర్ 30:

## సమస్థాన్ లో కలెక్టర్ ఆకస్మిక పర్యటన

- పాఠశాలలో తనిఖీ చేసిన కలెక్టర్



**వెలుతురు, యాదాద్రి భువనగిరి జిల్లా, డిసెంబర్ 30:**
యాదాద్రి భువనగిరి జిల్లాలోని సమస్థాన్ నారాయణ పూర్ మండలం లో జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఆకస్మికంగా పర్యటించి పాఠశాలలో తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు పలువురు రెవిన్యూ అధికారులు. విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు, మండలం లోని సర్వేల్, మండల కేంద్రంలో ఉన్న హాస్టల్ లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు . విద్యార్థులకు అవసరమైన సూచనలు ఇవ్వాలని అధికారులను కలెక్టర్ సూచించారు, అలాగే పరీక్షల సమయం రానున్న నేపథ్యంలో విద్యార్థులకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు, విద్యార్థులకు నాణ్యమైన భోజనం తోపాటు విద్యా బోధన అందించాలని అధికారులను ఆదేశించారు, ప్రతి పాఠశాలలో విద్యార్థులు తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించేలా చూడాలని కలెక్టర్ సూచించారు,

# నిమ్స్ ఆస్పత్రిలో మందా జగన్నాథం ను పరామర్శించిన మంత్రులు

( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 30:**
నిమ్స్ హాస్పిటల్ లో నాగర్ కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథం ను రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్,సీతక్క ,ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తదితరులు సోమవారం నాడు పరామర్శించారు. ఈ సందర్భంగా మందా జగన్నాథం ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్న మంత్రులు.మందా జగన్నాథం కు మెరుగైన వైద్య చికిత్స అందించాలని మంత్రులు ప్రభాకర్, సీతక్క లు వైద్యులకు సూచించారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ మీడియా సెల్ కన్వీనర్ సామ రామ్మోహన్ రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు,





## మందా జగన్నాథం ను పరామర్శించిన కేటీఆర్

అలాగే బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగర్‌కర్నూలు మాజీ ఎంపీ మందా జగన్నాథం పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు,కేటీఆర్ వెంట బిఆర్ఎస్ పార్టీ నాయకులు దాసోజు శ్రావణ్ కుమార్ తదితరులు ఉన్నారు

# మాజీ ప్రధానమంత్రి, డాక్టర్ మన్మోహన్ సింగ్ గొప్ప మానవతావాది, దార్శనికులు, ఆర్థిక రూపశిల్పి

**వారి మరణం దేశానికి తీరని లోటు అని శాసనసభలో వెల్లడించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ**



**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 30:**
రాష్ట్ర శాసనసభలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు భారత మాజీ ప్రధాని డా. మన్మోహన్ సింగ్ గారి మృతి పట్ల ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానాన్ని మంత్రి దామోదర్ రాజనర్సింహ బలపరిచారు. భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ గారికి భారతరత్న అవార్డు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన తీర్మానానికి పూర్తి మద్దతు తెలియజేశారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ గారు ఆర్థికవేత్తగా, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ గా, ఆర్బిఐ గవర్నర్ గా , కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా, దేశ ప్రధానిగా భారతదేశంలో చెరగని ముద్ర వేశారని మంత్రి వెల్లడించారు. 1990 చివరి నాటికి భారత ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఇబ్బందుల్లో ఉందన్నారు. పూర్వ ప్రధాని దివంగత నేత పివి నరసింహారావు గారు మన్మోహన్ సింగ్ గారి ఆర్థిక మేదస్సు, Intigrity ని గుర్తించి వారిని క్యాబినెట్లో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు అప్పగించారన్నారు.
దేశంలో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి సరళీకృత ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టి దేశ ఆర్థిక రంగాన్ని గాడిన పెట్టారన్నారు. అందులో ప్రధానంగా liberalization, privatization, globalization విధానాల ను ప్రవేశపెట్టి దేశంలో బ్యాంకింగ్ సెక్టర్ను, ఇన్సూరెన్స్ సెక్టర్ను, కమ్యూనికేషన్ సెక్టార్ తో పాటు ఇతర రంగాల్లో ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్మెంట్ (FDI) లను ప్రోత్సహించారన్నారు మంత్రి దామోదర్ రాజనర్సింహ. డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రవేశపెట్టిన ఆర్థిక విధానాల ప్రభావం తో దేశంలో ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. దేశ జిడిపి గణనీయంగా పెరిగటం తో పాటు ఎకనామిక్ స్టెబిలిటీ సాధించి అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా ఆవిర్భవించిందన్నారు.
యూపీఏ చైర్ పర్సన్ శ్రీమతి సోనియా గాంధీ గారు డా . మన్మోహన్ సింగ్ గారి దార్శనికత్వాన్ని గుర్తించి ప్రధానమంత్రిగా అవకాశం ఇచ్చారన్నారు. దేశ ప్రధానిగా మన్మోహన్ సింగ్ ఆర్థిక స్థిరత్వం తో పాటు విద్య, వైద్య, ఉపాధి రంగాలకు సంబంధించి చారిత్రక చట్టాలను రూపొందించారన్నారు. ఉపాధి హామీ పథకం ను ప్రవేశపెట్టి గ్రామీణ ప్రాంత ప్రజలు వలస పోకుండా 100 రోజుల ఉపాధి గ్యారెంటీని ఈ చట్టం ద్వారా కల్పించారన్నారు మంత్రి దామోదర్ రాజనర్సింహ. సమాచార హక్కు చట్టం ప్రవేశపెట్టి ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా చట్టాన్ని రూపొందించారన్నారు. ప్రజలకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై సమాచారం అందించేలా ఈ చట్టాన్ని డాక్టర్ మన్మోహన్ సింగ్ రూపొందించారన్నారు. ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ (FSA) (ఆహార భద్రత) ను ప్రవేశపెట్టి ప్రజల యొక్క ఆహార భద్రత ప్రభుత్వం బాధ్యత అని చాటి చెప్పేలా ఈ చట్టాన్ని రూపొందించారన్నారు. వైద్య రంగంలో పేద ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు NRHM స్కీంను ప్రవేశపెట్టారన్నారు. అమెరికాతో చారిత్రాత్మక న్యూక్లియర్ ఒప్పందాన్ని చేసుకున్న ఘనత మన్మోహన్ సింగ్ గారికి దక్కిందన్నారు. వీటితోపాటు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లో భాగంగా ఆనాటి యూపీఏ కోర్ కమిటీ సమావేశంలో నాటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ గారితో చర్చించే అవకాశం నాకు దక్కిందన్నారు మంత్రి దామోదర్ రాజనర్సింహ. డాక్టర్ మన్మోహన్ సింగ్ గారు మానవతావాది, గొప్ప ఆర్థికవేత్త, దార్శనికులు, మితభాషి గా దేశానికి ఎన్నో గొప్ప సేవలు అందించారని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేసుకున్నారు.
రాజకీయాల్లో, ప్రజా జీవితంలో హంగామా, ఆర్భాటం , ఆడంబరాలే కాదు మానవత్వం, దార్శనీయకత్వం, పారదర్శకతతో కూడిన సేవలు అందించవచ్చని నిరూపించిన మహా నాయకుడు డాక్టర్ మన్మోహన్ సింగ్ అని మంత్రి దామోదర్ రాజనర్సింహ కొనియాడారు. ఈ తరానికి, రాబోయే తరాలకు స్ఫూర్తి ప్రదాత గా నిలిచారన్నారు. అలాంటి గొప్ప నాయకున్ని కోల్పోవడం యావత్ దేశానికి తీరని లోటు అన్నారు. దేశానికి విశిష్ట సేవలు అందించిన ఆ దార్శనికునికి మనస్ఫూర్తిగా నివాళులర్పిస్తున్నట్లు వెల్లడించారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ గారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు మంత్రి దామోదర్ రాజనర్సింహ.

# కాంగ్రెస్ కేరాఫ్ కమీషన్ల సర్కార్

(మొదటి పేజీ తరువాయి..)



ఎప్పుడు సమావేశమైనా తాజా మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లుల అంశం చర్చకు వస్తుంది. మాజీ సర్పంచుల ప్రజల కోసమే పనులు చేశారు. సొంత డబ్బు ఖర్చు పెట్టి అభివృద్ధి పనులు చేసిన మాజీ సర్పంచులకు అండగా ఉండాలని నిర్ణయించాం. వాస్తవానికి రాష్ట్రవ్యాప్తంగా 12వేల 769 మంది తాజా మాజీ సర్పంచులున్నరు. వీళ్లందరికీ దాదాపు 13 వందల కోట్ల రూపాయలు బిల్లులు రావాలి. గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకుగాను ఒక్కో సర్పంచుకు 3 లక్షల నుండి కోటి రూపాయల వరకు బిల్లులు పెండింగ్ లో ఉన్నాయి. ఇయాళ ఏ గ్రామానికి వెళ్లినా 1.పల్లె ప్రగతి 2.రైతు వేదిక 3. వైకుంఠ ధామం 4.డంపింగ్ యార్డ్ 5.పల్లె ప్రకృతి వనం 6.హరిత వనం 7.రెవిన్యూ ప్లాంటేషన్ 8.కమ్యూనిటీ హాల్ 9.హైమాస్ లైట్స్ 10.అంతర్గత సీసీ రోడ్లు 11.సీసీ డ్రైనేజీలు 12.మిషన్ భగీరథ 13.ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్ మెంట్ 14.మన ఊరు..మన బడి వంటి అభివృద్ధి కార్యక్రమాలు కళ్ల ముందే కన్పిస్తున్నాయి. ఇవన్నీ జరిగాయంటే అది తాజా మాజీ సర్పంచులవల్లేనని ప్రజలకు తెలుసు. ఇయాళ సర్పంచులు లేకపోవడంతో గ్రామాల్లో తట్టెడు మట్టి పోయించేటోళ్లు కూడా లేరని చర్చించుకుంటున్నరు.
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ బిల్లులన్నీ చెల్లిస్తామని హామీ ఇచ్చి ఓట్లు దండుకున్న రేవంత్ ప్రభుత్వం ఏడాదైనా నయా పైసా బిల్లు చెల్లించకపాయే. పాపం బిల్లుల కోసం ఈ తాజా మాజీ సర్పంచులు ఎక్కని గడప లేదు... దిగని గడప లేదు... ఎంపీడీఓ నుండి కలెక్టర్, చీఫ్ సెక్రటరీ వరకు.... ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రుల మొదలు ముఖ్యమంత్రి వరకు అందరినీ కలిసి మొర పెట్టుకున్నరు. అయినా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదు... మాజీ సర్పంచులను రోడ్డున పడేశారు. ఇంకా చెప్పాలంటే... మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులు ఎందుకు ఇవ్వాలనే భావనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. మాజీ సర్పంచులవైపు ప్రజలున్నారనే సంగతిని మర్చిపోతున్నరు. ప్రభుత్వాన్ని నమ్మి అభివృద్ధి పనులు చేస్తే వాళ్ల బతుకులను బర్ బాద్ చేయడం కరెక్ట్ కాదు... వాళ్లు ప్రజల్లోకి వెళితే... ఈ ప్రభుత్వాన్ని కాపాడటం ఎవరి తరమూ కాదనే సంగతి గుర్తుంచుకోవాలి.
తాజీ మాజీ సర్పంచులారా... కాంగ్రెస్ ను నమ్మి మీరు నిండా మోసపోయారు. ఇకనైనా కళ్లు తెరవండి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీలు, జెండాలను పక్కనపెట్టి కాంగ్రెస్ ను ఓడించడమే ధ్యేయంగా పనిచేయండి. మీరు చేసే ఉద్యమానికి బీజేపీ పూర్తి అండగా ఉంటుంది. కిషన్ రెడ్డి గారితో ఫోన్ లో మాట్లాడాను. మద్దతు ప్రకటించాలని చెప్పారు...ఈ విషయంలో బీజేపీ ముందుండి మీ తరపున పోరాడతాం. రాష్ట్ర ప్రజల మెడలు వంచుతాం...
కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల సర్కార్. 8 నుండి 14 శాతం కమీషన్లతో నడుస్తోంది. పెండింగ్ బిల్లులు మంజూరు కావాలంటే వాళ్లకు 8 నుండి 14 శాతం కమీషన్లు ఇస్తే మీ నిధులన్నీ విడుదలవుతాయి. కమీషన్లు దండుకునేందుకు ప్రత్యేకంగా ముగ్గురు మంత్రులను పెట్టుకున్నరు. 14 శాతం కమీషన్లు ఎవరైతే ఇస్తారో... వాళ్లకే బిల్లులు మంజూరవుతున్నాయి. ఈ కమీషన్ల సొమ్మును ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ పెద్దలకు కప్పం కడుతూ తమ సీటును కాపాడుకుంటున్నరు. కప్పం కట్టకపోతే ఎన్నడూ ఆ సీట్లు ఎగిరిపోయేయి. రేవంత్ కేబినెట్ లో కొందరు నిజాయితీపరులైన మంత్రులు కూడా ఉన్నారు. కమీషన్ల గోల భరించలేక వాళ్లు లొల్లి పెడుతున్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ లో అంతర్యుద్ధం జరుగుతోంది. అది ఎప్పుడైనా బహిరంగం కావొచ్చు.
అసలు ఈ ప్రభుత్వంపట్ల ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదు. ఫీజు రీయంబర్స్ మెంట్ చెల్లించకపోవడంతో లక్షల మంది విద్యార్థులు అల్లాడుతున్నరు.వాళ్లకు సర్టిఫికేట్లు ఇవ్వడం లేదు. కాలేజీ యాజమాన్యాలు జీతాలు చెల్లించలేక కాలేజీలను మూసి వేస్తున్నారు. ఆరోగ్యశ్రీ బకాయిలను విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్సకు వచ్చే రోగులను చేర్చుకోవడం లేదు...ఇకనైనా ప్రభుత్వం దిగిరావాలి. లేనిపక్షంలో కాంగ్రెస్ కు గుణపాఠం చెప్పేందుకు సర్పంచులతో కలిసి ఉద్యమిస్తాం...రాష్ట్ర ప్రభుత్వ మెడలు వంచి బిల్లులు చెల్లించేలా చేస్తాం...
రాష్ట్రంలో క్రైం రేటు పెరిగిందనే అంశంపై అడిగిన ప్రశ్నకు.....
22శాతం క్రైం రేటు పెరిగింది. మహిళలపై అత్యాచారాలు 28 శాతం పెరిగింది. శాంతి భద్రతలను కాపాడాలేని చేతగాని సర్కార్ నడుస్తోంది. వీళ్లకు ప్రజల బాధలు పట్టవు. ఢిల్లీకి పోయి కప్పం కట్టి పదవులను కాపాడుకోవడంపై ఉన్న శ్రద్ధ ప్రజలను ఆదుకోవాలని లేదు... 6 గ్యారంటీలను అమలు చేయాలనే ధ్యాస లేదు..
రేవంత్ రెడ్డి గొప్పనాయకుడని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ వ్యాఖ్యానించారంటూ మీడియా అడిగిన ప్రశ్నకు....
పవన్ కళ్యాణ్ ఏమన్నారో నాకు తెలియదు. నేను వినలేదు. నిజంగా గొప్ప నాయకుడని అని ఉంటే... ఆయనలో మరి ఏం కన్పించిందో.. 6 గ్యారంటీలను అమలు చేయలేదు. ఇచ్చిన హామీలను ఏవీ అమలు చేయలేదు? క్రైం రేటు పెరిగింది. మరి ఆయనలో గొప్ప నాయకుడు ఎట్లా కన్పించారో వారికే తెలియాలి.
అల్లు అర్జున్ ఘటనపై...
అల్లు సంధ్య థియేటర్ ఘటనలో అల్లు అర్జున్ అరెస్టై జైలుకు పోయి బెయిల్ వచ్చాడు. ఆ అంశం ముగిసింది. కానీ మళ్లీ అసెంబ్లీలో మరే సమస్య లేనట్లు ఈ అంశంపై గంటల తరబడి చర్చ జరపాల్సిన అవసరం ఏముంది? 6 గ్యారంటీలపై చర్చ జరగకుండా దారి మళ్లించాలనే కుట్రలో భాగమే. నాకు తెలిసి రేవంత్ రెడ్డికి, అల్లు అర్జున్ కు మధ్య ఏదో చెడింది. పుష్ప 2 సినిమాకు 1700 కోట్ల రూపాయల వచ్చినయ్. పుష్ప 2 సినిమా ఇంకా స్టార్ట్ కాలేదు.. కానీ పుష్ప 3 సినిమా చూపించారు. నేనడుగుతున్నా... అల్లు అర్జున్ పై కేసును మ్రుతురాలి భర్త వాపస్ తీసుకుంటున్నట్లు ప్రకటించాడు కదా... ఇంకా దీనిపై ఎందుకు రాద్దాంతం చేస్తున్నారు...
మన్మోహన్ సింగ్, అంబేద్కర్ లను బీజేపీ అవమానించిందంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలపై...
అంబేద్కర్ ను అడుగడుగునా అవమానించిందే కాంగ్రెస్ పార్టీ. ఆయనకు భారతరత్న ఎందుకు ఇవ్వలేదు? పంచ్ తీర్థ్ లను ఎందుకు ఏర్పాటు చేయలేదు? ఆయన లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేస్తే ఓడించేందుకు ఎందుకు ప్రయత్నించింది? మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు చనిపోతే ఢిల్లీలో అంత్యక్రియలు జరపకుండా ఎందుకు అవమానించారు? నాటి ప్రధాని వీపీ సింగ్ విషయంలో ఇట్లనే అవమానించింది నిజం కాదా? మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్ననాళ్లూ... సోనియాగాంధీ సూపర్ పీఎంగా ఉంటూ రబ్బర్ స్టాంప్ గా తయారు చేసింది నిజం కాదా? కాంగ్రెస్ తీరును చూసి మన్మోహన్ సింగ్ ఆత్మ క్షోభిస్తోంది...

## శాసనసభలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ గారి సంతాప తీర్మానం సందర్బంగా అయన తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న గౌరవ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

### రాజ్ గోపాల్ రెడ్డి గారి స్పీచ్ పాయింట్స్......

మన్మోహన్ సింగ్ గారితో మాకున్న అనుబంధం, ఆ అవకాశం జీవితంలో ఎవరికి రాదేమో...

ప్రధానిగా ఉన్న కాలంలో పార్లమెంటులో తెలంగాణ గొంతు వినిపించే అవకాశం మాకు దొరకడం జీవితంలో అదృష్టంగా భావిస్తున్నాం...

మన్మోహన్ సింగ్ గారు మన మధ్య లేకపోయినా చరిత్రలో నిలిచిపోతారు

ఐదేళ్లపాటు తెలంగాణ కోసం మా గొంతు వినిపిస్తుంటే ఏ రోజు కూడా అడ్డు చెప్పలేదు...

ప్రధానిగా మన్మోహన్ సింగ్ గారి అపాయింట్మెంట్ ఎప్పుడు అడిగినా కూడా ఇచ్చేవారు


మా సమస్యను ఎంత సమయం కేటాయించి చెప్పిన సావధానంగా వినేవారు

మూడు లక్షల మంది ప్రజలతో తెలంగాణ రాష్ట్ర ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ గా 2014లో భువనగిరి బహిరంగ సభలో ఆయన పాల్గొనడం మా అదృష్టం

ఐదు సంవత్సరాలు తెలంగాణ రాష్ట్రం కోసం నా సహచర ఎంపీలందరం ఎన్ని గొడవలు చేసినా కూడా మౌనంగా వినేవారు

తెలంగాణ ప్రజలు మన్మోహన్ సింగ్ సేవలు మరిచిపోరు...

హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 30:



# సంపాదకీయం..

## రుణాల యెగవేతదారులపై చర్యలేవీ !

మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత దేశాన్ని దాటిన పలువురు బ్యాంక్ రుణాల ఎగవేతదారులను ఇప్పటికీ పట్టుకోలేక పోయారు. విజయమ్ మాల్యా,నీరవ్ మోడీ వంటివారు విదేశాల్లో తలదాచుకుని బాగా ఎంజాయ్ చేస్తున్నారు. రుణాలను ఎగవేసి నింపాదిగా దేశం దాటినా వారిని వెనక్కి రప్పించలేక పోయారు. అప్పులు చేసి ఎగవేసి, దేశం విడిచిన వారి బతుకులే హాయిగా ఉన్నాయి. దేశంకోసం కష్టపడి పనిచేస్తూ ఉన్న ప్రజలు మాత్రం పన్నుల ఊబిలో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. పన్నులు, ధరల భారతంతో దేశం అతలాకుతలం అవుతోంది. దివంతగత ప్రధాని మన్మోహన్ పదేళ్ల కాలం నాటి పరిస్థితితులకు మోడీ పదేళ్ల పాలను తేడాను గమనిస్తే ..ధరలు, పన్నులు ఎంతగా పెరగాయో గమనించవచ్చు. ఆర్‌బిఐ అందించిన లెక్కల ప్రకారమే **2020**లో **2,154** గా ఉన్న ఉద్దేశపూర్వక ఎగవేతదారులు **2024**కి వచ్చేసరికి **2,664**కు పెరిగిపోయారు. బ్యాంకులకు లక్షల కోట్ల రూపాయలు ఎగవేసే కార్పొరేట్ల నుంచి వాటిని రికవరీ చేయడానికి బదులు, ఈ కంపెనీలకు ప్రతి యేటా లక్షల కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేస్తోంది. అదే సమయంలో దేశానికి అన్నం పెట్టే రైతులు సంక్షోభంలో ఉన్నారు, వారి రుణాలను మాఫీ చేయమంటే కుదరదు పొమ్మంటోంది. క్రోనీ కేపిటలిస్టులు, కార్పొరేట్లకు ప్రజల సొమ్ము దోచిపెట్టడం వల్ల బ్యాంకులకు కలిగే నష్టాలను భర్తీ చేసేందుకు డిపాజిట్లపై వడ్డీ రేట్ల తగ్గింపు, మినిమమ్ బ్యాలెన్స్ లేకుంటే పెనాల్టీలు, ప్రభుత్వ రంగ సంస్థలకు ఇచ్చే రుణాలపై అధిక వడ్డీ వసూలు వంటి పద్ధతులు అవలంభిస్తున్నాయి. బ్యాంకులను ముంచేస్తున్న వారిపై మాత్రం ఎలాంటి క్రిమినల్ ప్రొసీజర్స్ ఉండడం లేదు. బ్యాంకులకు వీరు ఎగ్గొట్టిన మొత్తం ఈ కాలంలో లక్షా **52** వేల **860** కోట్ల రూపాయల నుంచి లక్షా **96** వేల కోట్ల **441** కోట్ల రూపాయలకు చేరింది. ఇదంతా సామాన్యులు బ్యాంకుల్లో చేసుకున్న డిపాజిట్ల సొమ్మే. ఇప్పటికీ బ్యాంకు మొత్తం డిపాజిట్లలో **75** శాతం దాకా సామాన్యుల నుంచి సేకరించినవేనని ఆర్‌బిఐ నివేదికలే చెబుతున్నాయి. సామాన్యులు దాచుకున్న సొమ్మును లూటీ చేస్తున్న ఆర్థిక నేరగాళ్లలో చాలా వరకు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి సన్నిహితులైన వ్యక్తులు, కార్పొరేట్ సంస్థలే. ఈ రుణ ఎగవేతదారుల్లో చాలా మంది నేరపూరిత కార్యకలాపాలకు పాల్పడినవారున్నారు. ఇటువంటి వారిని శిక్షించాల్సిన ప్రభుత్వం, ఆర్‌బిఐలే వారికి రక్షణగా ఉంటున్నాయి. సామాన్యులు, మధ్యతరగతి డిపాజిటర్లు పొదుపు చేసిన సొమ్ము ఉద్దేశపూర్వక ఎగవేతదారుల పాలవుతోంది. బ్యాంకులకు రుణబకాయిలు చెల్లించే అవకాశం ఉన్నప్పటికీ, ఉద్దేశపూర్వకంగా ఎగవేసే క్రోనీ కేపిటలిస్టులు, కార్పొరేట్లు మోడీ ఏలుబడిలో రోజురోజుకూ పెరిగిపోతున్నారు. **2023** జూన్ **3**న ఆర్‌బిఐ జారీ చేసిన సర్క్యులర్‌లో ఉద్దేశపూర్వక ఎగవేతదారులు, ఆర్థిక మోసాలకు పాల్పడినవారితో రాజీ ఒప్పందాలు కుదుర్చుకోవాలని బ్యాంకులకు సూచించింది. **2016**లో తీసుకొచ్చిన దివాలా కోడ్ బ్యాడ్ లోన్స్‌ను థర్డ్ పార్టీకి విక్రయించాలని బ్యాంకులను ఆదేశిస్తోంది. మాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) ద్వారా దాఖలు చేసిన అర్జీకి ప్రతిస్పందనగా టాప్ **100** మంది ఉద్దేశపూర్వక ఎగవేతదారుల వివరాలను ఆర్‌బిఐ వెల్లడించి చేతులు దులిపేసుకుంది. **2018**లో దేశం విడిచి పారిపోయిన నీరవ్‌మోడీకి చెందిన గీతాంజలి జెమ్స్ బ్యాంకులకు రూ.**8,516** కోట్లు బకాయి పడింది. ఇదే అత్యధిక మొత్తం ఎగవేతదారుగా ఉంది. ఇప్పుడే కాదు, ఇంతకుముందు కూడా అది భారీగా రుణాన్ని ఎగవేసింది. ఎన్ని సార్లు ఎగవేసినా ఏమీ కాదు అన్న వాతావరణాన్ని ప్రభుత్వమే కల్పించాక ఎగవేత దారులు పెరగకుండా ఎలా ఉంటారు. గత పదేళ్లలో మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు మాఫీ చేసిన రుణాలు అక్షరాలా **16.11** లక్షల కోట్ల రూపాయలు. అంతకుముందు మన్మోహన్ సింగ్ ప్రభుత్వం పదేళ్లలో మాఫీ చేసినదాంతో పోల్చితే ఇది ఎనిమిది రెట్లు ఎక్కువ. వామపక్షాల ఒత్తిడి ఫలితంగా యుపిఏ-**1** ప్రభుత్వం అప్పట్లో రూ. **60** వేల కోట్ల మేర వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తే ఇది దండగమారిన చర్యగా గగ్గోలు పెట్టిన 'ప్రధాన స్రవంతి మీడియా' ఈ రుణ ఎగవేతలపై ఒక్క ముక్క కూడా ప్రస్తావించడం లేదు. అమెరికా లాంటి దేశాల్లో పారుబకాయిలు ఒక శాతం కంటే తక్కువగా ఉంటే భారత్‌లో ఇది **7.85** శాతంగా ఉన్నాయి. ఆర్‌బిఐ మార్గదర్శకాల ప్రకారం బ్యాంకులు ఇచ్చే మొత్తం రుణాల్లో వ్యవసాయ రంగానికి **40** శాతం ఇవ్వాలి. కానీ, **12** శాతానికి మించి ఇవ్వడం లేదు. క్రోనీ కేపిటలిస్టులు, కార్పొరేట్ల పట్ల వున్న ప్రేమ వ్యవసాయంపై మోడీ ప్రభుత్వానికి లేదనడానికి ఇదొక నిదర్శనం. ప్రభుత్వ రంగ బ్యాంకులను ఒక వైపు ప్రైవేటీకరిస్తూ, ఇంకో వైపు ఉన్న బ్యాంకులను కూడా దివాలా తీయించే చర్యలు ప్రభుత్వం చేపడుతోంది. దీనికి వ్యతిరేకంగా బ్యాంకు సిబ్బంది పలుమార్లు సమ్మె చేసినా ప్రభుత్వం లెక్కచేయడం లేదు. ఈ స్థితిలో బ్యాంకులకు పెద్ద యెత్తున రుణాలను ఉద్దేశపూర్వకంగా ఎగవేసిన వారి నుంచి తిరిగి రాబట్టేలా చూసేందుకు బ్యాంకు ఉద్యోగులతోబాటు ప్రజలు పెద్దయెత్తున ఉద్యమించాలి. ఆర్థిక నేరగాళ్లను బోనులో నిలబెట్టాలి. అప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థపై భారం తప్పుతుంది. ఇకపోతే పన్నుల విధానం సవరించకుండా ముందుకు సాగలేం. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. రూపాయి విలువ రోజురోజుకూ దిగజారుతోంది. ఈ పరిస్థితిలో పివి అనుసరించిన మార్గం మేరకు మరో ఆర్థికవేత్త రావాల్సి ఉంది. అప్పుడే భారత్ ఆర్థికరంగం పురోగమించగలదు.

# రైతుభరోసాపై కొలిక్కిరాని కసరత్తు

- **ఏడాదవుతున్నా విధివిధానాలపై అస్పష్టత**
- **వరుసభేటీలు తప్ప నిర్ణయంలో ఆలస్యం**

**హైదరాబాద్,డిసెంబర్30( వెలుతురు):**

రైతుభరోసాపై ఇప్పటికీ ప్రభుత్వం వద్ద స్పష్టత కానరావడం లేదు. అసలుసిసలు రైతులకే భరోసా అని ప్రచారం చేస్తున్నా..అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వడం లేదు. ఏడాదైనా విధివిధానాలు రూపందించలేదు. భూమి ఉన్నంత మాత్రాన భరోసా ఇవ్వకుండా సన్నచిన్నకారు రైతులను గుర్తించి ఇవ్వడం ద్వారా ప్రభుత్వ ఖజానాపై భారం లేకుండా చేయాలి. సంక్రాంతి పండుగ తర్వాతే అన్నదాతల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించగా.. దీని అమలు చేసే దిశగా ప్రభుత్వం కసరత్తు ప్రారంభించినా విధివిధానాలపై స్పష్టత లేదు.సాగుభూమికే రైతు భరోసా ఇవ్వాలనే యోచనలో ఉన్న ప్రభుత్వం ఎన్ని ఎకరాల వరకూ అమలు చేయాలనే దానిపై ఓ స్పష్టతకు ఇంకా రానట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మరోసారి భేటీ అయ్యి చర్చించనుంది. అటు.. ట్యాక్స్ పేయర్స్, ప్రభుత్వ ఉద్యోగులను రైతు భరోసాకు అనర్హులుగా ప్రకటించాలని నిర్ణయించినట్లు సమాచారం. దీనిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. గూగుల్ డేటా, శాటిలైట్ ఆధారంగా సాగు విస్తీర్ణం లెక్కించేందుకు పలు కంపెనీల నుంచి సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. సచివాలయంలో రైతు భరోసాపై ఆదివారం సబ్ కమిటీ భేటీ అయ్యింది. కమిటీ ఛైర్మన్ భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, కమిటీ సభ్యులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. రైతు భరోసా ఇచ్చేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. రానున్న యాసంగి పంటకు రైతు భరోసా అందించేందుకు ఖరారు చేయాల్సిన విధి విధానాలపై మంత్రులు కసరత్తు చేశారు. పథకం ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకూ రైతు భరోసా అందించిన తీరు.. క్యాబినెట్ సబ్ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించిన క్రమంలో రైతులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు, అధికారులు సేకరించిన సమాచారంపై సుదీర్ఘంగా చర్చించారు. అయితే, రైతు భరోసా విధి విధానాలపై మరోసారి భేటీ కావాలని సబ్ కమిటీ నిర్ణయించింది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన మాట ప్రకారమే ముందుకు వెళ్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.




'ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా ఇచ్చి తీరుతాం. రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రభుత్వం రూ.72,659 కోట్లు కేటాయించింది. రైతు రుణ మాఫీ కింద 2 నెలల వ్యవధిలోనే రూ.21 వేల కోట్ల నగదును రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేలా రైతుల సంక్షేమానికి కృషి చేసేందుకు వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేశాం. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన రైతువేదికలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకు రావాలని నిర్ణయించారు.110 రైతు వేదికల్లో రూ.4 కోట్లకు పైగా నిధులు వెచ్చించి వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లు ఏర్పాటు చేశారు. పంటల బీమా పథకం కింద ప్రీమియం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే రైతుల పక్షాన చెల్లిస్తుంది. ఈ ఏడాది లక్ష ఎకరాల ఆయిల్ ఫామ్ సాగు చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2023 - 24 ఏడాదికి ఆయిల్ సాగు పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.80.10 కోట్లు విడుదల చేయగా.. రాష్ట్ర వాటా కలుపుకొని మొత్తంగా రూ.133.5 కోట్లు విడుదల చేశాం. రైతుల నుంచి కొనుగోలు చేసే సన్నధాన్యానికి 500 బోనస్ ప్రకటించారు. అయితే రైతులకు ఇకముందు రుణమాఫీలు లేకుండా స్పష్టమైన వ్యవసాయ విధానలతో ముందుకు సాగాల్సి ఉంది. ఇకపోతే ఖరీఫ్ రైతులకు తెలంగాణ ప్రభుత్వం చేదు వార్త వినిపించింది. ఈ ఖరీఫ్ సీజన్ కు రైతు భరోసా ఇవ్వబోమని తెలిపింది.


ఈ మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. రైతు భరోసాకు బదులుగా ప్రతీ సన్న ధాన్యం పండించిన రైతుకు 500 రూపాయల బోనస్ ఇస్తామని తుమ్మల ప్రకటించారు. పంట వేసిన రైతుకే రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్టుగా ఆయన తెలిపారు. వ్యవసాయం చేయని వారికి రైతు భరోసా ఇవ్వబోమని తేల్చి చెప్పారు. ఈ ఖరీఫ్ సీజన్ కు రైతు భరోసా ఇవ్వలేము. మార్పులకు అనుగుణంగా రైతులను మారుస్తాం. ఆర్థిక వెసులుబాటు లేకపోయినా ముఖ్యమంత్రి రుణమాఫీ అంశాన్ని తన భుజాన వేసుకున్నారు. గతంలో వైఎస్సార్ హయాంలో 70 వేల కోట్ల రుణమాఫీ చేశారు. పంటల బీమా గతంలో లేకపోయినప్పటికీ ఇప్పుడు రాష్ట్రంలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రతీ రైతు పంటకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుందని, రాష్ట్రంలో పండే అన్ని పంటలను ఎంఎస్పీ ప్రకారమే కొనుగోలు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన అన్ని పంటలను కేంద్రం కూడా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అయితే వ్యవసాయ రంగం, రైతుల విషయంలో కాంగ్రెస్ చేసిన వాగ్దానాలు అమలు చేసితీరుతామన్నారు.

# ఊరిస్తున్న మంత్రివర్గ విస్తరణ

- **ఏడాదైనా కనికరించని కాంగ్రెస్ అధిష్టానం**
- **నిరాశలో ఆశావహులు**

**హైదరాబాద్,డిసెంబర్30( వెలుతురు):**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నది. తర్వాత మంత్రి వర్గ విస్తరణ రేపుమాపు ఉంటుందంటూ ఏడాదికాలంగా వినిపిస్తున్నా..ఇప్పటివరకూ ఎలాంటి ప్రకటనా లేదు. ఢిల్లీకి ఎన్ని చక్కర్లు కొట్టినా సిఎం రేవంత్‌కు మోక్షం కలగడం లేదు. ఆయన అభ్యర్థనలను అధినేతలు పట్టించుకోవడం లేదు. మంత్రి పదవిపై ఎమ్మెల్యేలు ఎన్నో ఆశలు పెట్టుకోగా.. సాగదీత పరిస్థితిలో రోజుకొకరు తెర మీదకు వస్తున్నారు. రేసులో నేనున్నానంటూ ముందుకు వచ్చి ఆందోళనలు చేస్తున్నారు.త్వరలో మంత్రివర్గ విస్తరణ అంటూ వార్తలు వస్తుండడం..టీవీ సీరియల్‌ను తలపిస్తున్నాయని ఆ పార్టీ నేతలే గుసగుసలాడుకోవడం గమనార్హం.మంత్రి పదవిని ఆశిస్తున్న వారంతా కళ్లలో వత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత తొలిసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతలు తీవ్రంగా ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏడాదిగా ఇదే విషయమై ఢిల్లీ దాకా పైరవీలు చేస్తున్నారు. రోజుకొకరు తెర మీదికి వచ్చి మంత్రి పదవిని ఆశిస్తున్న నేపథ్యంలో పోటీ రోజురోజుకూ పెరుగుతున్నది. ఆశావహుల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఆశించడం తప్పేం కాదన్నట్లుగా ఏఐసీసీ దాకా మంత్రి పదవి కోసం ఎమ్మెల్యేలు కాని వారు కూడా దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. దీంతో మొదటి జాబితాలోనే పేరున్న వారిలో ఈ కొత్త పరిణామాలు ఒకింత ఇబ్బందికి గురి చేస్తున్నాయి. చూస్తుండగానే ఏడాది కాలం కరిగి పోయింది. మంత్రి పదవిని ఆశిస్తున్న వారంతా కళ్లలో వత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత తొలిసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతలు తీవ్రంగా ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏడాదిగా ఇదే విషయమై ఢిల్లీ దాకా పైరవీలు చేస్తున్నారు. రోజుకొకరు తెర మీదికి వచ్చి మంత్రి పదవిని ఆశిస్తున్న నేపథ్యంలో పోటీ రోజురోజుకూ పెరుగుతున్నది. ఆశావహుల సంఖ్య భారీగా పెరుగుతోంది.ఆశించడం తప్పేం కాదన్నట్లుగా ఏఐసీసీ దాకా మంత్రి పదవి కోసం ఎమ్మెల్యేలు కాని వారు కూడా దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. దీంతో మొదటి



జాబితాలోనే పేరున్న వారిలో ఈ కొత్త పరిణామాలు ఒకింత ఇబ్బందికి గురి చేస్తున్నాయి. చూస్తుండగానే ఏడాది కాలం కరిగి పోయింది. ప్రభుత్వం వస్తే పదవి గ్యారంటీ అని కొందరు మొదట్నుంచి ఆశిస్తూ వస్తున్నారు. కానీ అందుకు విరుద్ధమైన పరిస్థితి ఇప్పుడు ఎదురవుతోంది. ఏకంగా దళిత సామాజిక వర్గం కోటాలో మంత్రి పదవిని ఆశిస్తున్నట్లు కొందరు చెప్పుకుంటున్నాయి. ఇలా ఎవరికి వారు మంత్రి పదవి కోసం తలబడుతుండడంతో రాజకీయం రసవత్తరం గా మారింది. 2024 సంక్రాంతి నుంచి మొదలైన ఈ పోటీ 2025 సంక్రాంతి వస్తున్నా ముగింపు కార్డు మాత్రం పడలేదు. 2023, డిసెంబర్ 7న పది మంది మంత్రులతో కలిసి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. తదనంతరం రేపు మాపు అంటూ వాయిదాలు మినహా ఆశావహులకు భరోసా దక్కడం లేదు. ఇకపోతే మంత్రివర్గంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ఎవరికీ అమాత్యయోగం కలుగలేదు. దీంతో ఉమ్మడి జిల్లాకు పెద్ద దిక్కులేకుండా పోయింది. నలుగురు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ ఎవరికీ మంత్రివర్గంలో స్థానం లభించలేదు. అసలు మంత్రి వర్గ విస్తరణ ఉంటుందా అనేది జవాబు లేని ప్రశ్నగా మిగిలింది. సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సుదర్శన్ రెడ్డికే మంత్రి యోగం తథ్యమన్న సంకేతాలు కాంగ్రెస్ పార్టీలో ఉన్నాయి. పెద్దాయనకే అమాత్య యోగం దక్కుతుందని అంతా అనుకుంటున్నారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమేనంటూ సుదర్శన్ రెడ్డి కూడా అనేక సందర్భాల్లో చెప్పుకుంటున్నప్పటికీ ఎప్పుడన్నది తెలియడంలేదు. ఏ పదవీ లేకుండానే ఎమ్మెల్యేగానే కొనసాగుతుండడంతో జిల్లాకు చెందిన సీనియర్ ఎమ్మెల్యేకు సైతం మింగుడు పడటం లేదు. శాసనసభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సమయంలోనే ఇదే తనకు చివరి ఎన్నికలుగా సుదర్శన్ రెడ్డి ప్రకటించుకున్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో వాస్తవానికి సుదర్శన్ రెడ్డికి ఎవ్వరూ పోటీలేరు. గెలిచిన నలుగురు ఎమ్మెల్యేల్లో సీనియారిటీ, కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా ఆయనకే అర్హతలు ఉన్నాయి. అయినప్పటికీ మంత్రి పదవి విషయంలో మాజీమంత్రికి అవకాశం దక్కడం లేదు. కొద్ది కాలం క్రితం వరకు మంత్రి పదవి వచ్చేస్తుందనుకుని ఆయన కొంత దూకుడు ప్రదర్శించారు. ఉమ్మడి జిల్లా ప్రభుత్వ యంత్రాంగంతో సమీక్షలు, సమావేశాలు నిర్వహించి హల్‌చల్ చేశారు. తీరా మంత్రి వర్గ విస్తరణలో జాప్యంతో కినుక వహించి అంటి ముట్టనట్లుగానే ఉంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. సుదర్శన్ రెడ్డి అనుచరవర్గం సైతం ఈ విషయంలో ఒకింత అసహనంతో ఉన్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్ జిల్లాలో బోధన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. వీరిలో భూపతి రెడ్డి తొలిసారి చట్ట సభకు ఎన్నికయ్యారు. గతంలో ఎమ్మెల్సీగా పని చేసిన అనుభవం ఉన్నప్పటికీ ఇప్పుడు నేరుగా శాసనసభలో అడుగు పెట్టారు. ఇక బోధన్ నుంచి సీనియర్ నేత సుదర్శన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిలో ఇద్దరు నేతలు మంత్రి పదవి కోసం విన్నపాలు చేసుకున్నట్లుగా తెలుస్తోంది. కామారెడ్డి జిల్లా నుంచి ఎల్లారెడ్డి, జుక్కల్ శాసనసభ్యులు ఇరువురు తొలిసారి అసెంబ్లీకి ఎన్నుకోబడ్డారు. పీసీసీ చీఫ్‌గా పార్టీ పదవిని దక్కించుకున్న మహేశ్‌కుమార్ గౌడ్ సైతం బీసీ కోటాలో మంత్రి పదవి అడిగినట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. షబ్బీర్ అలీ సైతం తన చివరి రాజకీయ మజిలీలో మంత్రి యోగం కోసం మైనార్టీ కోటాలో పట్టుబడుతున్నాడు. మొత్తానికి ఉమ్మడి జిల్లా రాజకీయాలను ప్రభావితం చేసే మంత్రి పదవి కోసం కాంగ్రెస్‌లో భారీగా పోటీ నెలకొంది.

## జమిలి ఎన్నికల కోసం వైకాపాలో తొందర

- **త్వరగా అధికారం దక్కుతుందనే ఆశ**
- **కూటమి ప్రభుత్వం విఫలమైందన్న ప్రచారం**

**అమరావతి,డిసెంబర్30( వెలుతురు):**

సమిలి ఎన్నికలు త్వరగా రావాలని మోడీకన్నా..జగనే ఎక్కువగా కోరుకుంటున్నారు. ఎంత త్వరరగా ఎన్నికలు వస్తే తాను అంత త్వరగా సిఎం అయిపోతానని కలలు కంటున్నారు. అందుకే విద్యుత్ ఉద్యమంతో అడుగులు వేశారు. ఈప్రభుత్వంలో శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని, విద్యుత్ ఛార్జీలు పెంచుతున్నారని విమర్శలకు పదును పెట్టారు. సమిలి ఎన్నికలు వస్తే కూటామి ప్రభుత్వం కూలి పోవడం ఖాయమని పార్టీ నేతలు బహిరంగంగానే ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి కేవలం ఆరు నెలలు మాత్రమే అయ్యింది. చేసిన అప్పులను,తప్పులను వెలికి తీసే ప్రయత్నంలో గత వైకాపా అవినీతి భారీగా బయటపడుతోంది. ఈ క్రమంలో వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి సార్వత్రిక ఎన్నికల యుద్ధంలో ఘోర పరాజయం తర్వాత మరో యుద్ధానికి సిద్ధం కావాలంటూ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మళ్లీ శాసనసభ ఎన్నికలకు నాలుగున్నరేళ్ల సమయం ఉంది. స్థానిక సంస్థల ఎన్నికలకు సైతం దాదాపు మరో ఏడాది సమయం ఉంది. ప్రస్తుతం ఎన్నికల సమయం కాకపోయినా ప్రభుత్వంపై యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వైసిపి కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకు.. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జగన్ అడుగులు వేస్తున్నారు. అదే సమయంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తి చేసుకున్న క్రమంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రజల విశ్వాసం కోల్పోయిందని విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వంపై ప్రజలు సంతృప్తిగా ఉన్నట్లు చర్చ జరుగుతున్న వేళ వైసీపీ నేతలు మాత్రం ప్రభుత్వంపై విమర్శలతో ముందుకు సాగుతున్నారు. ఓ వైపు విద్యుత్ రంగం దివాళా, బియ్యం కుంభకోణం వంటివన్నీ బయటపడుతున్నాయి. ఆనాటి మంత్రుల అవనితి తన్నుకు వస్తోంది. ఈ క్రమంలో వైసీపీ సీనియర్లు ఒక్కొక్కరు వైసీపీకి గుడ్‌బై చెబుతున్నారు. వలసలను నివారించడంలో జగన్ విఫలమయ్యారనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకు.. వారిని చురుకుగా ఉంచేసేదుకు జగన్ తన వంతు ప్రయత్నాలు ప్రారంభించారు. లడ్డూ వివాదంతో జగన్‌పై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిన తరవాత ఇప్పుడు విద్యుత్ కొనుగోళ్లు, బియ్యం దాటించడం వంటి కుంభకోణాలు వెన్నాడుతున్నాయి. దీని నుంచి బయటకు వచ్చేందుకు, ప్రజల దృష్టిని మరల్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. త్రలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయి. ఈ ఎన్నికలకు కేడర్‌ను సిద్ధం చేసేందుకు జగన్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు. వరదల సమయంలో ప్రభుత్వం వ్యవహారించిన తీరును, సహాయక చర్యలను రాష్ట్రం మొత్తం ప్రశంసిస్తే జగన్ మాత్రం ఇప్పటికీ విమర్శిస్తూనే ఉన్నారు. అసత్య ఆరోపణలు చేయడం ద్వారా జగన్ తన ఇమేజ్‌ను మరింత దిగజార్చు కుంటున్నారు. ఆరు నెలలు కాకుండానే ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేయడం ద్వారా జగన్ తొందరపడుతున్నారు.ప్రభుత్వ పాలన నచ్చకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన తీర్పునిస్తారు. విపక్షాలు రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేస్తుందనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. అందుకేనేమో జమిలితో కూటమి మతాష్ అన్న రీతిలో నేతలు ప్రచారం చేసుకుంటున్నారు.

## ప్రభుత్వ సంస్థల కాంట్రాక్టు పనులన్నింటిలో బీసీలకు రిజర్వేషన్ లు కేటాయించాలి

- బీసీ నేత లింగంగౌడ్ డిమాండ్



**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 30:**
ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన కాంట్రాక్టులన్నింటిలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో చిన్న కాంట్రాక్ట్ పనుల నుండి పెద్ద పెద్ద కాంట్రాక్ట్ పనులన్ని కేవలం రెండు మూడు సామాజిక వర్గాలకు చెందిన వారికే కేటాయిస్తున్నారని 50% ఉన్న బీసీలకు ఎలాంటి న్యాయం జరగడం లేదన్నారు. మంత్రులు,ఎంఎల్ఏ లు కూడా బీసీలను ప్రోత్సహించడం లేదన్నారు.వచ్చే నూతన సంవత్సరం లోనైనా బీసీలకు అవకాశం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం ద్వారా సిఎం రేవంత్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేస్తున్నం. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్ యాదవ్ పాలకూరి కిరణ్ చందు అనంతుల సాయి తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ స్కూల్ లో ఈ కిడ్స్ పోటీలు

- **ఘనంగా నిర్వహించిన నారాయణ స్కూల్ యాజమాన్యం**



**హయత్ నగర్, వెలుతురు డిసెంబర్ 30:**
సూర్యనగర్ కాలనీ నారాయణ స్కూల్లో ఈ కిడ్స్ రైమ్స్ పోటీలు సామవారం ఘనంగా నిర్వహించారు. స్కూల్లో జరిగిన ఈ-కిడ్స్ రైమ్స్ పోటీలలో భాగంగా చిన్నారులు పాటలు, కథలతో స్కూల్ ఉపాధ్యాయులను వారి తల్లిదండ్రులను అలరించాడు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లావణ్య , ఈకిడ్స్ కొఆర్డినేటర్ ప్రియాంక , మరియు ఈ కిడ్స్ వైస్ ప్రిన్సిపల్ లావణ్య' మరియు ఇతర ఉపాధ్యాయులు, విధ్యార్థులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా ప్రజావాణికి 50 ఫిర్యాదులు

- **కలెక్టర్ నారాయణ రెడ్డి**



**వెలుతురు, రంగారెడ్డి జిల్లా, డిసెంబర్ 30:**
సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 50 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారంకోసంనిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలనజరుపుతూపరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ-31, పిడి హౌసింగ్ - 10, డీపీఓ-02, మున్సిపల్-02, ల్యాండ్ ప్రొటెక్షన్ -02, విద్యుత్తు -01, ఎండోమెంట్ - 02, మొత్తం 50 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# మా టీచర్లు మాకు కావాలి

## కెజిబివి ల్లో నిలిచిన పాఠాలు, సమీపిస్తున్న వార్షిక పరీక్షలు

## ఇంకా పూర్తికాని సిలబస్.. ఆందోళనలో టెన్త్ ఇంటర్ విద్యార్థులు



మా టీచర్ల మాకు కావాలని సిద్దిపేట జిల్లా చేర్యాల కెజిబివి ముందు విధ్యార్థుల ధర్నా

- **కెజిబివి సమగ్రశిక్ష ఉద్యోగులు, సీఆర్ టీ ల న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలి.**
- **రాష్ట్ర కెజిబివి విధ్యార్థులు డిప్యూటేషన్ టీచర్లు వద్దు...**
- **మా టీచర్లు మాకు కావాలి అని ధర్నాలకు దిగుతున్నారు.**
- **బాలల హక్కుల సంక్షేమ సంఘం(బిహెచ్ఎస్ఎస్) విజ్ఞప్తి**

**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 30:**
**గత 24 రోజులుగా కెజిబివి, యుఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులు, గిరిజన సంక్షేమ శాఖలోని ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లు(సీఆర్ టీ) తమ సమస్యల పరిష్కారానికై చేస్తున్న ఉద్యమానికి బాలల హక్కుల సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతును తెలుపుతుంది.**

రాష్ట్రంలో సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఎ) లో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగులు తేది 10-12-2024 నుండి సమ్మె బాట పట్టారు. ఎస్ఎస్ఏలో పనిచేస్తున్న పది విభాగాలకు చెందిన ఉద్యోగులు తమకు న్యాయంగా రావాల్సిన సౌకర్యాల కోసం అనేక సంవత్సరాలుగా ఉద్యమాలు చేస్తూనే ఉన్నారు. ఉద్యోగ భద్రత లేకపోవడంతో గిరిజన సంక్షేమ శాఖలోని సీఆర్టీలు తేది 16-12-2024 నుండి రిలే



ఖమ్మం జిల్లాలో.....

నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. గిరిజన పేద వర్గాల నుండి వచ్చిన సిఆర్జీల సంక్షేమం కోసం ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి, వారి డిమాండ్ల పై సానుకూలంగా స్పందించి వెంటనే పరిష్కరించాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం కోరుతుంది.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం స్పందించకుండా కాలయాపన చేస్తోంది. ఎన్నికల ముందు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉద్యోగుల ధర్నా టెంట్లకు వద్దకు వచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మీ సమస్యలన్నీ పరిష్కరిస్తామని పీసీసీ అధ్యక్షుడి హోదాలో గతంలో రేవంత్ రెడ్డి గారు హామీ ఇచ్చారు. వివిధ వేదికల్లో భట్టి విక్రమార్క గారు సహా అనేకమంది కాంగ్రెస్ నాయకులు కూడా ఉద్యోగులకు హామీ ఇచ్చారు.

దారిద్రరేఖకు దిగువన ఉన్న, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ఆడపిల్లలకు మంచి విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 2004 లో దేశవ్యాప్తంగా 4,982 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలను(కెజిబివి) ఏర్పాటు చేసింది. అందులో భాగంగా తెలంగాణలో 479 కెజిబివిలు నడుస్తున్నాయి. వాటిల్లో 316 చోట్ల ఇంటర్ విద్యను బోధిస్తున్నారు. ఇందులో ఒక లక్షా 25వేల మందికి పైగా విద్యార్థినులు చదువుచుండగా వీటిలో సుమారు 20వేల మంది బోధన, బోధనేతర సిబ్బంది పనిచేయుచున్నారు. గురుకుల పాఠశాలల మాదిరిగా నడుపబడుతున్న ఈ పాఠశాలల్లోని ఉపాధ్యాయినులు వెట్టిచాకిరి చేస్తున్నారు. స్పెషల్ ఆఫీసర్లు (ఎస్.ఓ), కాంట్రాక్టు రెసిడెంట్ టీచర్లు (సిఆర్టి), పి.జి.సి.ఆర్.టి.లు, బోధనేతర సిబ్బంది, అకౌంటెంట్, ఎ.ఎన్.ఎం.లు, పి.ఇ.టి.లు, కంప్యూటర్ ఇన్ స్ట్రక్టర్లు మొదలగు వారికి కనీస వేతనం కూడా చెల్లించడం లేదు. ఇదే స్కీంలో మండల స్థాయిలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు, ఎం.ఐ.ఎస్ కోఆర్డినేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఐ.ఈ.ఆర్.పి.లు, జిల్లా స్థాయిలో ఏ.పి.ఓ.లు, సిస్టమ్



మా టీచర్ల మాకు కావాలని గాంధారీ కెజిబివి ముందు విధ్యార్థుల ధర్నా

ఎనలిస్టులు, టెక్నికల్ పర్సన్లు, డిఎల్ఎంటి మెసెంజర్లు ఎంతోకాలంగా వారి హెరిదాలతో నిమిత్తం లేకుండా అన్ని పనులు చేసుకుంటూ వస్తున్నారు. ఆయా పోస్టులకు తగిన అర్హతలు కలిగియుండి, అర్హతా పరీక్షల ద్వారా ఎంపిక చేయబడినవారే వీరందరూ. వాస్తవానికి వీరందరినీ రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలి. కానీ 1991 లో వచ్చిన నూతన ఆర్థిక సరళీకరణ విధానాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వాలు రెగ్యులర్ అపాయింట్ మెంట్లు చేయకుండా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించుచున్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించకుండా నామ మాత్రపు వేతనాలు చెల్లిస్తూ వెట్టిచాకిరి చేయించుకుంటున్నాయి కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలు. వీరంతా ఉద్యోగ భద్రత లేకుండా పనిచేయాల్సి వస్తుంది. రెగ్యులర్ ఉద్యోగులకుండే సౌలభ్యాలు వీరు పొందలేక పోతున్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్న సుప్రీంకోర్టు తీర్పు ఇలాంటి వారికి వర్తింపజేయడం లేదు. తెలంగాణ ప్రభుత్వ మొదటి పిఆర్సీ కమిషన్ ఇచ్చిన సిఫారసు మేరకు కనీస వేతనం కూడా చెల్లించడం లేదు. ఉద్యోగ భద్రత లేదు, వైద్య సదుపాయం లేదు. కనీసం ఉన్న సెలవులు వినియోగించుకోవాలన్నా ఎన్నో ఆంక్షలు. అన్నింటినీ తట్టుకొని పనిచేస్తున్నప్పటికీ ప్రోత్సాహం కరువైంది. పంజాబ్, మణిపూర్, త్రిపుర, హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలలలో సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించారు. ఆంధ్ర ప్రదేశ్ లో పే స్కేలులో బేసిక్ పే చెల్లిస్తున్నారు. మన రాష్ట్రంలో కూడా కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి రెగ్యులర్ చేయాలని ఈ ఉద్యోగులు డిమాండ్ చేస్తూ గత24 రోజులుగా నిరవధిక నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఎన్ని ఉద్యమాలు చేసినప్పటికీ గత ప్రభుత్వ పాలకులు పట్టించుకోలేదు. కొత్త ప్రభుత్వం వచ్చి సంవత్సరము గడిచినప్పటికి వీరి సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేయడం లేదు. ఇటీవల రాష్ట్ర అసెంబ్లీలో కూడా ప్రతిపక్ష శాసన సభ్యులు ప్రభుత్వము దృష్టికి తీసుకువచ్చి వెంటనే సమస్యలు పరిష్కారము చేసి న్యాయం చేయాలనీ కోరడం జరిగింది. ఐనా ప్రభుత్వము తరపున ఎలాంటి ప్రకటన కూడా చేయకపోవడం విచారకరమైన విషయము. ముఖ్యమంత్రి గారు ఇంకెంత మాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే సంఘ నాయకులను పిలిచి మాట్లాడాలని రాష్ట్ర వ్యాప్తంగా మహిళా ఉద్యోగులు మా రేవంత్ అన్న మా సమస్యలు తప్పకుండా పరిష్కరిస్తారని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. వీరితో పాటుగా విద్యార్థినులు కూడా ముఖ్యమంత్రి గారు మా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారము చేసి వారు పాఠాలు బోదించేలా చూడాలని కోరుకుంటున్నారు. ఎందుకంటే కెజిబివి విద్యాలయాల్లో పిల్లల చదువు అటకెక్కింది. ఇన్ని రోజులుగా మాకు పాఠాలు బోధించే ఉపాధ్యాయులు సమ్మెలో ఉండటంతో సిలబస్ పూర్తి కాకపోవడంతో మార్చిలో పదవ తరగతి పరీక్షలు మేం ఎలా రాయగలం అని ఆందోళన చెందుతున్నారు. మా టీచర్లను పంపి మాకు పాఠాలు బోధించేలా చూడండని కెజిబివి ల్లో చదివే విద్యార్థినులు ఆందోళన చేస్తున్నారు. ఆ పిల్లల తల్లిదండ్రులు కూడా మా పిల్లల చదువులు ఎలా అని ఆవేదనతో ఉన్నారు.

కెజిబివి జూనియర్ కాలేజి విద్యార్థులకి త్వరలో ప్రాక్టికల్ ఎగ్జామ్స్ ఉన్నవి. ఇటు పిల్లలు అటు వాళ్ళ తల్లిదండ్రులను సంతృప్తి పరచడానికి వీళ్ళ సమ్మెను నీరుగార్చడానికి ప్రభుత్వ ఉపాధ్యాయులను డీప్యూటేషన్ పై కెజిబివి లకు పంపించి పాఠాలు బోధించే చేస్తున్న ప్రయత్నం బెడిసి కొడుతుంది. ఉమ్మడి నిజామాబాద్ లో గాంధారీ, బిచ్కుంద మండలాల్లో, ఉమ్మడి మహబూబ్ నగర్ లోని ఆలంపూర్, నవాబ్ పేట, ఉమ్మడి ఆదిలాబాద్ లోని దిలావర్ పూర్, సారంగాపూర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా లోని ఇబ్రాహీంపట్నం, మల్యాల, కల్లూరు కెజిబివి ల్లో మా టీచర్లే మాకు కావాలి డీప్యూటేషన్ టీచర్లు మాకొద్దు అని విద్యార్థులు కూడా ఆందోళన తీవ్రతరం చేస్తున్నారు. ప్రభుత్వము నిర్లక్ష్యం వీడి వెంటనే సమ్మె చేస్తున్న వారి డిమాండ్ల పట్ల సానుకూల వైఖరితో వారితో చర్చించి విద్యార్థులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం(బిహెచ్ఎస్ఎస్) కోరుతుందని రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డా గుండు కిష్టయ్య, ఇంజమూరి రఘునందన్ తెలిపారు.



**ఇంజమూరి రఘునందన్,**
సెల్: 9866102962
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బాలల హక్కుల సంక్షేమ సంఘం(బిహెచ్ఎస్ఎస్)

## కెసిఆర్, కేటీఆర్ లపై ఈడికి ఫిర్యాధు చేసిన రాచాల యుగంధర్ గౌడ్

- **లోపాయికారి ఒప్పందాలతో ప్రజాధనం లూటీ..!**
- **క్విడ్ ప్రోకో పద్ధతిలో ఎలోక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసిన కంపెనీలు**
- **టెండర్ లేదా లీజు అయిన వెంటనే బాండ్ల కొనుగోలు, ఆ వెంటనే ఎన్ క్యాష్మెంటు చేసుకున్న బీఆర్ఎస్**
- **అప్పటి పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ కు ఈ క్విడ్ ప్రోకో తతంగంతో నేరుగా ఒప్పందం**
- **ఔటర్ రింగ్ రోడ్డు టోల్ లీజు ఐఆర్ బీకి ఇవ్వడం, వరంగల్, రంగారెడ్డి కీటెక్స్ యూనిట్ల స్థాపనలోనూ తేటతెల్లం**
- **క్విడ్ ప్రోకో చేయడం వల్లనే జాతీయ పార్టీ బీజేపీ తర్వాత అత్యధికంగా ఎలక్టోరల్ బాండ్లు బీఆర్ఎస్ కే..**
- **గత బీఆర్ఎస్ ఒప్పందాలు, కాంట్రాక్టులు, లీజులపై విచారణ చేయండి**
- **బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్**

**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 30:**
లోపాయికారి ఒప్పందాలతో ప్రజాధనం లూటీ చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ లపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ఈడిని కోరారు. ఈమేరకు సోమవారం హైదరాబాద్ లోని ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ గారికి ఫిర్యాధు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఔటర్ రింగ్ రోడ్డు టోల్ లీజును ఐఆర్బీ సంస్థకు ఇవ్వడంలో మరియు వరంగల్, రంగారెడ్డి కైటెక్స్ యూనిట్ల స్థాపనలోనూ






అక్రమాలు జరిగాయన్నారు క్విడ్ ప్రోకో పద్ధతిలో ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసిన కంపెనీలు టెండర్ లేదా లీజు అగ్రిమెంట్ అయిన వెంటనే బిఆర్ఎస్ పార్టీకి ఇచ్చాయని ,ఆ వెంటనే బిఆర్ఎస్ ఆ బాండ్లను ఎన్ క్యాష్మెంటు చేసుకున్నదని ఆరోపించారు. అప్పటి పరిశ్రమలు మరియు మున్సిపల్ శాఖ మంత్రి మంత్రి కేటీఆర్ కు ఈ క్విడ్ ప్రోకో తతంగంతో నేరుగా ఒప్పందం ఉందన్నారు.. క్విడ్ ప్రోకో చేయడం వల్లనే జాతీయ పార్టీ బీజేపీ తర్వాత అత్యధికంగా ఎలక్టోరల్ బాండ్లు బీఆర్ఎస్ పార్టీకే వచ్చాయన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన ఒప్పందాలు, కాంట్రాక్టులు, లీజులపై విచారణ వేగవంతం చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని కోట్ల రూపాయలను గోల్ మాల్ చేసిన కేసీఆర్ కేటీఆర్ లను అరెస్ట్ చేసి విచారిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ అధ్యక్షులు గాలిగల్ల సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ మల్కాజ్ గిరి ప్రజావాణిలో 123 ఫిర్యాదులు : అదనపు కలెక్టర్

**వెలుతురు, మేడ్చల్ మల్కాజిగిరి,డిసెంబర్ 30:** జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను ఇంఛార్జి డిఆర్ఓ శంకర్ కుమార్ తో కలిసి మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్వీకరించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 123 ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టరు సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట





వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

# ఆరోగ్య శాఖలో ఓంకార్ సేవలు అభినందనీయం

## - డీఎంహెచ్ఓ డాక్టర్ టీ. రఘునాథ్ స్వామి

**వెలుతురు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా డిసెంబర్ 30:** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి (డీఎంఅండ్హెచ్ఓ) డాక్టర్ టీ. రఘునాథ్ స్వామి, శ్రీ జి. ఓంకార్, ఫార్మసిస్ట్ గ్రేడ్-%××% పదవీ విరమణ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం కుత్బుల్లాపూర్ (దుండిగల్) ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ స్వర్ణలత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంలో డాక్టర్ రఘునాథ్ స్వామి మాట్లాడుతూ....., జి. ఓంకార్ సుదీర్ఘకాలిక సేవలకుగాను అభినందించారు , ఆయన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆరోగ్య వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖకు చూపిన నిబద్ధత, శ్రమ, రోగుల పట్ల దృక్పథాన్ని ప్రశంసిస్తూ, పదవీ విరమణ అనంతరం ప్రశాంతమైన మరియు సంతోషకరమైన జీవితం గడపాలన్న శుభాకాంక్షలు తెలిపి శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ



కార్యక్రమానికి డాక్టర్ సత్యవతి, కీసర డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారిబీ డాక్టర్ మల్లీశ్వరి, జిల్లా



కార్యక్రమాధికారి (నాన్ కమ్యూనికబుల్ డిసీసెస్)బీ మరియు డాక్టర్ సరస్వతి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, హాజరయ్యారు.

# అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షా ను బర్తరఫ్ చేయాలి

- **మతోన్మాదుల నుండి దేశాన్ని రక్షించుకోవాలి**
- **వామపక్ష పార్టీలు డిమాండ్.**

**వెలుతురు న్యూస్ సూర్యాపేట డిసెంబర్ 30**
రాజ్యాంగ నిర్మా త అంబేద్కర్ పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన అవమానకరవ్యాఖ్యల బాధాకరమని, తక్షణమే ఆయనను మంత్రివర్గంలో నుండి బర్తరఫ్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి , న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్ , సిపిఐ జిల్లా నాయకులు దంతాల రాంబాబు, ఎం సిపిఐ కేంద్ర కమిటీ సభ్యులు వరికుప్పల వెంకన్నడిమాండ్ చేశారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూడాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పై అమిత్ షా అహంకారపూరితమైన ,తిరస్కార స్వరంతో అమిత్ షా మాట్లాడడం తన అహంకారాన్ని రుజువు చేసిందన్నారు. భారతదేశ లౌకిక , ప్రగతిశీల రాజ్యాంగ రూపశిల్పి పైన చూపిన అగౌరవాన్ని, అపహాస్యం చేయడానికి ప్రయత్నించారని విమర్శించారు. ఈ అవమానకరమైన వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలనిడిమాండ్ చేశారు. ఈ వ్యాఖ్యలు కేవలం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పైన చేసినవి మాత్రమే కాదని,సామాజిక న్యాయం కోసం పోరాటాన్ని కొనసాగిస్తున్న లక్షలాది మంది అణగారిన వ్యక్తులకు జరిగిన అవమానమన్నారు .తక్షణమే అతన్ని బర్తరఫ్ చేయాలన్నారు. భారత రాజ్యాంగంపై బీజేపీ చేస్తున్న దాడికి వ్యతిరేకంగా భారత ప్రజల నుంచి పెరుగుతున్న ప్రతిఘటన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారన్నారు .డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ హిందూత్వ



శక్తులచే నిరంతరం దాడికి గురవుతున్న భారత రాజ్యాంగంలో పొందుపరచబడిన నిశ్చయాత్మక చర్యల నిబంధనల పరిరక్షణ కోసం పోరాడటానికి లక్షలాది మందిని ప్రేరేపించారని చెప్పారు. భారత ప్రజలపై మనువాద భావజాలాన్ని రుద్దేందుకు ఈ శక్తులు అవిశ్రాంతంగా పనిచేస్తున్నాయని చెప్పారు. అమిత్ షా , బిజెపి పార్టీ వారి ఆలోచనలు కులతత్వంతో ఉన్నాయని, రాజ్యాంగం పట్ల నిజమైన గౌరవం లేదని ,ఇది మరోసారి రుజువయిందన్నారు. ఎన్నికల సమయంలోనే కాకుండా ఆర్ఎస్ఎస్ ,బిజెపి తరచుగా వ్యక్తం చేసే అసహనం, భారతదేశంలో సామాజిక న్యాయం , సమానత్వం కోసం డాక్టర్ అంబేద్కర్ పోరాడి నడిపిన ఉద్యమాలు , ఆదర్శాల పట్ల వారి లోతైన ద్వేషాన్ని వెల్లడిస్తుందన్నారు. మతోన్మాదుల నుండి దేశానికి ప్రమాదం పొంచి ఉందని అమిత్ షా విద్వేషాలకు కారకుడని విమర్శించారు. తక్షణమే అమిత్ షా ను బర్తరఫ్ చేయాలని చేసే వరకు వామపక్ష పార్టీలుఉద్యమాలను కొనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలోసిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మది వెంకటేశ్వర్లు , కో లిశెట్టి యాదగిరిరావు, ములకలపల్లి రాములు, మట్టి పెల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి గంట నాగయ్యఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షులు కునుకుంట్ల సైదులు పిడిఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలే బోయిన కిరణ్ ,జిల్లా అధ్యక్షుడు సింహాద్రి ,పి వై ఎల్ జిల్లా కోశాధికారి బండి రవి, పి డి ఎస్ యు డివిజన్ కార్యదర్శి పిడమర్తి భరత్ ,ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు పోరండ్ల దశరథ ,దండి ప్రవీణ్, మందడి శ్రీధర్, ఓంకార్, మల్లారెడ్డి, దూదిపాల ప్రవీణ్ వేణు, సిపిఐ పట్టణ నాయకులు గాలి కృష్ణ, ఎం సిపిఐ యూ జిల్లా నాయకులు ఏపూరి సోమన్న, సిపిఎం నాయకులు వీరబోయిన రవి, ఎం రాంబాబు, చిన్న పంగ నరసయ్యతదితరులు పాల్గొన్నారు.

# యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డి ని కలిసిన భువనగిరి జిల్లా యూత్ నాయకులు

**వెలుతురు, యాదాద్రి భువనగిరి జిల్లా, డిసెంబర్ 30:** తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎన్నికైన జక్కిడి శివ చరణ్ రెడ్డి ని నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తోర్పునూరి శ్రీకాంత్ గౌడ్ తో పాటు పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు సోమ వారం కలిసి శు భాకాంక్షలు తెలిపారు,ఆయన ను స్వగృహం లో కలిసిననల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తోర్పునూరి శ్రీకాంత్ గౌడ్ ఆయన ను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ గౌడ్ తో పాటు నారాయణపూర్ మండల



ఉపాధ్యక్షులు గుజ్జరి శ్రవణ్ కుమార్, చౌటుప్పల్ మండల ఉపాధ్యక్షులు గట్టు సాయి సుందర్ , ప్రధాన కార్యదర్శి ఆవుల రాజు యాదవ్ , కార్యదర్శి చింతల శివ ప్రసాద్, రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ వర్కింగ్ చైర్మన్ గంట శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డి మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ నాయకులుగా ఎన్నిక ఐన అందరినీ అభినందించారు. రానున్న రోజుల్లో యువజన కాంగ్రెస్ ను బలోపేతం చేసి, యువతను యువజన కాంగ్రెస్ లో భాగం చేయాలని శివ చరణ్ రెడ్డి పిలుపునిచ్చారు,

# విజయ్ కుమార్ గౌడ్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన మాజీ ఎంపీ బుర్రా



**వెలుతురు, యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 30:** సమస్థాన్ నారాయణ పూర్ మండలం లోని మల్లారెడ్డి గూడెం గ్రామ బిజెపి మాజీ బూత్ అధ్యక్షులు పందుల విజయ్ కుమార్ గౌడ్ ఇటీవల అకాల మరణం చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించి పది వేల రూపాయల ఆర్థిక సహాయంను భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యులు డా. బూర నర్సయ్య గౌడ్ అందజేశారు,ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బచ్చునబోయిన దేవేందర్ యాదవ్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు భాస్కర్ నరసింహ ,మండల కిసాన్ మోర్చా ప్రదాన కార్యదర్శి నర్రి నర్సింహా కురుమ ,జిల్లా కార్యవర్గ సభ్యులు నందగిరి జగత్ కుమార్ ,మండల కార్యదర్శి బూస శీను ,నాయకులు కట్కూరి వెంకటేశ్ గౌడ్ ,మల్లారెడ్డి గూడెం గ్రామ బూత్ అధ్యక్షులు కొండూరు నవీన్ గౌడ్ ,బాతరాజు రాజు గారు,పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# విశ్వబ్రాహ్మణ సంఘం సమావేశం



**రామన్నపేట వెలుతురు న్యూస్ డిసెంబర్ 30**
మండల విశ్వబ్రాహ్మణ సంఘం సమావేశం పాత బస్టాండ్ బ్రహ్మంగారి గుడిలో ఆవరణలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కన్నెకంటి వెంకటేశ్వరాచారి మండల విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం అధ్యక్షులు మారోజు అనంతచారి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ఇనుప (వెల్డింగ్ ),కర్ర పని,పనులు స్థానిక తయారీదారులకి అవకాశాలు కల్పించాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం ఇనుముతో లేదా కర్రతో తయారు చేయబడిన తలుపులు,దర్వాజలు, కిటికీలు,మొదలగు వాటికి సంబంధించిన పనులు స్థానిక తయారు చేయుచున్నటువంటి వారికి అప్పగించి ప్రభుత్వం నిర్ణయించిన ధర తయారీదారుల ఖాతాలో జమ చేసేలా ప్రయత్నం చేయాలని ప్రభుత్వాన్ని కోరుచున్నాము. స్థానికంగా చేతివృత్తులైన కమ్మర, వడ్రంగి,తయారీదారులకు కాకుండా కార్పొరేట్ సంస్థలకు ఈ తయారీని అప్పగించడం వల్ల స్థానికంగా చేతివృత్తుల పైన జీవిస్తున్నటువంటి కుటుంబాలకు ఆర్థికపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నది. కావున ప్రభుత్వపరంగా పూర్తి సహాయ సహకారాలు అందించి ఆదుకోవాలని కోరుచున్నాము.ఈ సమావేశంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కాంజోజు శ్రీనివాసాచారి, గంధమల్ల దశరథచారి, ఆకవరం శ్రీనివాసచారి, మారోజు రాఘవాచారి, శానగొండ శ్రవణ్ చారి, కన్నెకంటి ప్రభాకరాచారి, మారోజు వెంకన్న,ఆకవరపు ఉదయ్ కుమార్, చారి,చోల్లేటి నరేష్ చారి,గిన్నెల సాయికుమార్ చారి, పడకంటి నరసింహ చారి దేవరకొండ లక్ష్మీపతి,శానగొండ నాగరాజు,కూరెళ్ళ రామకృష్ణ,అక్కినపల్లి ఉపేంద్ర చారి, కాంకోజు వెంకటాచారి,తరులు పాల్గొన్నారు.

# అన్ని దానాలలో కంటే రక్తదానం ప్రాణ దానంతో సమానం

- **అన్నదానం చేస్తే ఆకలి తీర్చుతుంది.
అదే రక్తదానం చేస్తే ఒకరికి ప్రాణం నిలబెడుతుంది.**
- **పి.మల్లయ్య రామన్నపేట ఎస్ఐ**



**రామన్నపేట వెలుతురు న్యూస్ డిసెంబర్ 30**
మండల కేంద్రంలో మాతృదేవోభవ పితృదేవోభవ సంస్థ ఆధ్వర్యంలో గురు హాస్పటల్ సహకారంతో నిర్వహించిన, రక్తదాన శిబిర కార్యక్రమాన్ని స్థానిక రామన్నపేట ఎస్సై పి మల్లయ్య ప్రారంభించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ భారతదేశంలో దాదాపు 10 శాతం రక్త కొరతతో ఉన్నదని దానిని అధిగమించడానికి యువకులు రక్తదానం చేయుటకు ముందుకు రావాలని కోరారు దేశంలో ప్రతిరోజు 1200 కంటే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రాణాపాయ స్థితిలో వారికి రక్తం చేరే వేసే విధంగా ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని అన్నదానం చేస్తే ఆకలి తీర్చుతుందని, అలాగే రక్తదానం చేస్తే ఒకరికి ప్రాణం నిలబడుతుందని. రక్తదానం చేయడం వల్ల అనేక రోగాలు దూరం అవుతాయి అని ముఖ్యంగా గుండెపోటు , క్యాన్సర్ , రక్తపోటును తగ్గిస్తుందని మానసిక ఒత్తిడి తగ్గిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 40మంది రక్తదాతలుగా గురు హాస్పటల్ నందు డొనేట్ చేయడం జరిగింది గురు హాస్పిటల్ నిర్వాహకులు కళ్లెం సైదులు , వినయ్ , రాంప్రసాద్ , మాతృదేవోభవ పితృదేవోభవ వ్యవస్థాప అద్యక్షులు కుర్మేటి నవీన్ కుమార్ , సామాజిక కార్యకర్తలు నోముల యాదగిరి , వేముల సైదులు , మేడి రాజు , ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# వరి నారు లో కేసీఆర్ పేరు తయారుచేసిన రైతులు

**వెలుతురు నారాయణఖేడ్ డిసెంబర్ 30 :**



నారాయణఖేడ్ మండలంలోని వెంకటాపూర్లో వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్ పేరిట ఆంగ్ల అక్షరాలలో వరి నారుమళ్లను రైతులు రూపొందించారు. నియోజక వర్గ కురుమ సంఘం ఉపాధ్యక్షుడు మల్గొండ వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేరిట వరి నారుమళ్లను రైతులు పోచయ్య రమేష్, భూమయ్యలు రూపొందించారు.

# రంగారెడ్డి జిల్లా సీపీఎం ప్రధాన కార్యదర్శిగా యాదయ్య ఎన్నిక

**వెలుతురు, రంగారెడ్డి జిల్లా, డిసెంబర్ 30:**



రంగారెడ్డి జిల్లా సిపిఎం పార్టీ ప్రధాన కార్యదర్శిగా పగడాల యాదయ్య మరోసారి నియమితులయ్యారు, ఆయన జిల్లా లోని మంచాల మండలం లోని చిన్నారెడ్డి గూడెం కు చెందిన రైతు కుంటుంబం, యాదయ్య గతంలోనూ జిల్లా సీపీఎం పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు, ఆయన పార్టీ కోసం తోపాటు ప్రజల సమస్యలపై పోరాడారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పార్టీ నేతలు ఆయనను మళ్లీ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించారు, కాగా యాదయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ కోసం, ప్రజల సమస్యల కోసం పోరాటం చేస్తానని తెలిపారు, ఆయన ఎన్నిక పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

# పట్టణంలోని పార్కులను పునరుద్ధరించాలి

- జహీరాబాద్ బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు అప్పం శ్రావణ్ కుమార్



**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 30:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని పార్కుల నిర్వహణ గాలికి వదిలేశారని.. దీంతో అవి అధ్వాన్నంగా తయారయ్యాయని జహీరాబాద్ పట్టణ బీజేపీ ఉపాధ్యక్షుడు అప్పం శ్రావణ్ కుమార్ ఆరోపించారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఉన్న



హౌసింగ్ బోర్డు కాలని, ఎన్జీఓస్ కాలని పార్కులను మునిసిపల్ అధికారులు ఒకసారి స్వయంగా సందర్శించాలని అన్నారు. నిర్వహణ లేక చెత్తాచెదారం నిండి దుర్వాసన వస్తుందని పేర్కొన్నారు. అసంపూర్తి నిర్మాణాలు చూడటానికే ఏదో విధంగా కనిపిస్తున్నాయని చెప్పారు. పచ్చదనం కూడా కనుమరుగు అయ్యిందని పేర్కొన్నారు. పట్టణవాసులు వ్యాహ్యాళికి వచ్చే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికే ఉన్న పార్కులను పునరుద్ధరించడంతోపాటు నూతన పార్కులను ఏర్పాటు చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# బిఆర్ఎస్ నాయకులవి చిల్లర మాటలు

**వెలుతురు నారాయణఖేడ్ డిసెంబర్ 30 :**

నారాయణఖేడ్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు చిల్లర మాటలు మాట్లాడుతూ నారాయణఖేడ్ లో అభివృద్ధి పనులు అడ్డుకునే ప్రయత్నం



చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులన్నారు. సోమవారం ఎమ్మెల్యే ఇంట్లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సహకారంతో ఎమ్మెల్యే సంజీవరెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులను చూసి ఓర్వేలేక మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ప్రజలను మభ్యపెట్టేందుకే అసత్య ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. పదేళ్లు ఎమ్మెల్యేగా,నాలుగేళ్లు బీఆర్ఎస్ వారే మున్సిపల్ పాలకవర్గంగా ఉన్నా మున్సిపాలిటీ అభివృద్ధిని పట్టించుకోకపోగా నిధులను దుర్వినియోగం చేశారన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అత్యధిక పనులకు కాగితాలపైనే నిధులు సాంక్షన్ అయ్యాయని ఎద్దేవా చేశారు. కాగా పట్టణంలోని షాదీఖానాకు ఎలాంటి నిధులు మంజూరు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న బైపాస్ రోడ్డుతో రైతులతోపాటు పలు మండలాల ప్రజలకి దూరభారం తగ్గుతుందన్నారు. ఎవరి ప్రభుత్వ హయాంలో నిధులు దుర్వినియోగమయ్యాయో బహిరంగ చర్చకు తాము సిద్ధమన్నారు. అభివృద్ధి అడ్డుకొని చరిత్ర హీనులుగా నిలిచిపోవద్దని,చేస్తున్న అభివృద్ధికి సహకరిస్తే ప్రజలు హర్షిస్తారని సూచించారు. ప్రెస్ మీట్ లో కాంగ్రెస్ మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు రాజేష్ చౌహాన్,నర్సింహులు, మూధ రామకృష్ణ, హన్మాండ్లు, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు ముంతాజ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తాహెర్అలీ,నాయకులుపండరిరెడ్డి,ఈశ్వరప్ప,శంకర్ ముదిరాజ్, మాణిక్యం, దిలారాఖాన్,గౌస్చిష్తి తదితరులు పాల్గొన్నారు.

# కొమ్మాయిగూడెం-చిట్యాల దారిని ప్రజలకు అందుబాటులోకి తేవాలి

- వ్యర్థ మురుగు నీటితో భూగర్భ జలాలను, పరిసరాలను కలుషితం చేస్తున్న వారిపై చర్య తీసుకోవాలి.
- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జల్లెల పెంటయ్య




**రామన్నపేట వెలుతురు న్యూస్ డిసెంబర్ 30**

కొమ్మాయిగూడెం నుండి చిట్యాల వెళ్లే మార్గంను కబ్జా చేసి,మురుగు వ్యర్థ నీటితో పరిసర ప్రాంతాలను కలుషితం చేసిన వారిపై రెవెన్యూ అధికారులు చర్య తీసుకొని బాటను కొమ్మాయిగూడెం గ్రామ ప్రజలకు అందుబాటులోకి తేవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జిల్లాల పెంటయ్య డిమాండ్ చేశారు. సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో హరిహరపుత్ర రైస్ మిల్ వెనకాల మూసుకుపోయిన కొమ్మాయిగూడెం-చిట్యాల రహదారిని గ్రామ నాయకత్వంతో కలిసి పరిశీలన చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ ఏర్పాటు నుండి తరాతరాలుగా కొమ్మాయిగూడెం గ్రామం నుండి చిట్యాల,నల్లగొండ జిల్లా కేంద్రం వెళ్లే ప్రజలకు ప్రధాన రహదారిగా ఉండి సేవలందిస్తున్న బాటను అర్ధాంతరంగా మూసివేయడంతో పరిసర గ్రామాల ప్రజలు రామన్నపేట నుండి తిరిగి రావాల్సి వస్తుందని అన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ఈ ప్రాంతంలో సుమారుగా గ్రామ రెవెన్యూ వ్యవసాయ భూములు 200 ఎకరాల రైతులకు సేవలందిస్తున్నది. ఈ బాటను హరిహరపుత్ర రైస్ మిల్లు యాజమాన్యం భూమిని కొనుగోలు చేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని బాటను బంద్ చేసి రైతులను, గ్రామస్తులను పోలీవ్వకుండా ఇబ్బందులకు గురి జరుగుతుందన్నారు. రైస్ మిల్లు నుండి వచ్చే వ్యర్థ మురికి నీటిని అలాగే వదిలేయడంతో పెద్ద మురికి కోపంగా మారి చుట్టూరా ఉన్న బావులు, భూగర్భ జలాలు కలుషితంగా మారి తీవ్రంగా రైతులపై, పశువులపై, గొర్రెలు,మేకలపై ప్రభావం చూపుతుందన్నారు. వెంటనే రెవిన్యూ అధికారులు పరిశీలన చేసి ఇట్టి విషయంపై తగు విచారణ జరిపి గ్రామ ప్రజలకు బాటను అందుబాటులోకి తీసుకువచ్చి కాలుష్యం నుండి కాపాడాలని అన్నారు. లేని పక్షంలో కలెక్టరేట్ ముందు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి శానగొండ వెంకటేశ్వర్లు,నాయకులు ఎర్ర కాటమయ్య బెల్లి మల్లయ్య,అంతటి సత్తయ్య, పొట్లచెరువు నాగయ్య, ఎర్ర రవీందర్,తీర్పాల మల్లయ్య, శానగొండ రాము,గుణగంటి మల్లేశం,తండా సోమేశ్,జల్లెల మల్లేశం, మచ్చ నరేష్, ఆకిటి మల్లేశం మన్యం శీను రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భారీ మొత్తంలో గోవా మద్యం పట్టివేత..

- 64 మద్యం బాటిళ్ళు, ఒక కారు స్వాధీనం, నలుగురు వ్యక్తులు అరెస్ట్..
- మద్యం విలువ రూ.1.60 లక్షలు ఉంటుందని అంచనా..
- వివరాలు వెల్లడించిన డిటిఎఫ్ సీఐ దుబ్బాక శంకర్...






**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 30:**

నూతన సంవత్సర వేడుకల కోసం కొంతమంది అక్రమార్కులు గోవాకు వెళ్లి కారులో తరలిస్తున్న 64 మద్యం బాటిలను జహీరాబాద్ డిటిఎఫ్ టీం, ఎక్సైజ్ పోలీసులు ఎక్సైజ్ అంతరాష్ట్ర చెక్ పోస్ట్ చిరాగ్ పల్లి వద్ద తనఖీలు నిర్వహిస్తున్న క్రమంలో పట్టుకున్నట్లు డిటిఎఫ్ సీఐ దుబ్బాక శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు వివరాలు వెల్లడించారు. పట్టుకున్న మద్యం విలువ రూ.1.60 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. మద్యంతో పాటు ఒక కారును కూడా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు వారు తెలిపారు. అదేవిదంగా మరోచోట 34 బాటిల్ తీసుకొని వస్తున్న వ్యక్తి ఎక్సైజ్ పోలీసులను చూసి బాటిళ్ళను అక్కడ పడేసి వదిలి వెళ్లాడని తెలిపారు. ఈ బాటిళ్ళను కూడా స్వాధీనం చేసుకున్నామని డిటిఎఫ్ సీఐ దుబ్బాక శంకర్ తెలిపారు. మొత్తంగా 64 మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సీఐ దుబ్బాక శంకర్ తో పాటు హనుమంత్ అనుదీప్ ఇతర సిబ్బంది కేసులు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న మొత్తం బాటిళ్లను, నిందితులను జహీరాబాద్ ఎక్సైజ్ సిఐ శ్రీనివాస్ రెడ్డికి అప్పగించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కేసులో సిరిసిల్ల జగిత్యాల కోరుట్ల ప్రాంతాలకు చెందినటువంటి కృష్ణ, రామ్,మారుతి అజయ్ లు నిందితులుగా ఉన్నారని వారు తెలిపారు. మద్యం బాటిల్ పట్టుకున్నటువంటి ఎక్సైజ్ టీం లను ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ విబి కమలహాసన్ రెడ్డి, మెదక్ డిసి హరికిషన్, ఏసీజీ శ్రీనివాసరెడ్డి, ఎస్ నవీన్ చంద్ర లు అభినందించారు.

# శాదిఖానా పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మాణిక్ రావు

- నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి..
- గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిడిపి 20 లక్షల రూపాయల నిధులు మంజూరు చేశాం...
- అవసరమైతే మరిన్ని నిధులు కూడా మంజూరు చేస్తా...





**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 30:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం ఝరసంఘం మండలం కేంద్రంలో నిర్మిస్తున్న శాదిఖానా పనులను స్థానిక ఎమ్మెల్యే మాణిక్ రావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు అధికారులను మరియు కాంట్రాక్టర్ తో మాట్లాడి జరుగుతున్న పనుల గురించి అడిగి తెలుసుకొన్నారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం వారు మాట్లాడుతూ....గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిడిపి 20 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందని, భవిష్యత్తులో అవసరమైతే మరిన్ని నిధులు కూడా మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, మాజీ మండల పార్టీ అధ్యక్షులు బొగ్గుల సంగమేశ్వర్, మాజీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయ చైర్మన్ నర్సింహ గౌడ్, మాజీ సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు జగదీశ్వర్, పట్టణ అధ్యక్షులు ఏజాస్ బాబా, మాజీ సర్పంచ్ లు శ్రీనివాస్ రెడ్డి, ప్రభు పటేల్, పరమేశ్, నాయకులు వెంకట్ రెడ్డి, శశి, సోహైల్, నాగేందర్ పటేల్,గ్రామస్థులు బషీర్ సాహబ్, ఫయాజ్, అతిక్, అజీమ్ ఉద్దీన్, సద్దాం,సామెల్, విలాస్, బల్ రాజ్, సంగాన్న, రాజ్ కుమార్, ఆమిర్, జమిర్, ఇమ్రాన్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



# నూతన సంవత్సర వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలి

## - నాగల్గిద్ద ఎస్సై బి సాయిలు

**వెలుతురు నారాయణఖేడ్ డిసెంబర్ 30 :**

నారాయణఖేడ్ నియోజకవర్గం నాగల్గిద్ద నూతన సంవత్సర వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని నాగల్గిద్ద ఎస్సై బి సాయిలు అన్నారు. సోమవారం ఆయన నాగల్గిద్దలో విలేకరులతో సమావేశంలో మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపరాదన్నారు దీంతోపాటు మద్యం సేవించి వాహనాలపై రోడ్లమీద తిరగరావద్దని హెచ్చరించారు. ఏ విధమైన అల్లర్లు సృష్టించిన చర్యలు తప్పవని సూచించారు, అదేవిధంగా దాబా హోటల్లు బెల్టు షాపులలో మద్యం అమ్మ రాదని ఎస్ఐ సాయిలు హెచ్చరించారు. డీజే లకు పరిమిషన్ లేదని , పర్మిషన్ లేకుండా డీ జె లు పెట్టి సామాన్య ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, డిజె సామాన్లు సిజ్ చేస్తామని అదేవిధంగా రోడ్లపై రాత్రి 11 తర్వాత కనిపిస్తే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకొని వారి పైన కేసు నమోదు చేస్తామని సూచించారు, రాత్రి వేళలలో డాబాలలో బెల్ట్ షాపులలో సెట్టింగులు నిర్వహించరాదని వారు సూచించారు ఈ కార్యక్రమంలో పి ఎస్ ఐ హన్మతు, పి ఎస్ ఐ హన్మతు, ఏ ఎస్ ఐ తులసిరం, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ మంత్రి స్వర్గీయ ఫరీదుద్దీన్ 3వ వర్ధంతి..

- నివాళులు అర్పించిన బీజేపీ మహిళా నాయకురాలు జ్యోతి పండాల్...



**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 30:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని మాజీ టిజిఐడిసీ చైర్మన్ మొహ్మద్ తన్వీర్ స్వగృహంలో ఏర్పాటు చేసిన వారి తండ్రి అయిన మాజీ మంత్రి వర్యులు కీ.శే మహ్మద్ ఫరీదుద్దీన్ మూడవ వర్ధంతి కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకురాలు, జేపీ చారిటబుల్ అండ్ వెల్ఫేర్ ట్రస్ట్ ఫౌండర్ జ్యోతి పండాల్ పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ లీడర్ అఫ్సర్ దిల్దార్, పెన్ గన్ న్యూస్ ఎడిటర్ రైకోటి నర్సింలు, సంగమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి స్వర్గీయ ఫరిదోద్దీన్ మూడవ వర్ధంతి

- నివాళులు అర్పించిన సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి....



**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 30:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని మాజీ టిజిఐడిసి చైర్మన్ మొహ్మద్ తన్వీర్ స్వగృహంలో ఏర్పాటు చేసిన మాజీ మంత్రి స్వర్గీయ మహ్మద్ ఫరీదుద్దీన్ మూడవ వర్ధంతి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు ప్రజాప్రతినిధులు, మాజీ జెడ్పీటీసీలు,మాజీ యంపిపి లు,మాజీ యంపిటిసి లు తాజా మాజీ సర్పంచ్ లు,మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ యూత్ కాంగ్రెస్, ఎన్.యస్.యూ.ఐ. నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# నల్గొండ బహిరంగ సభకి బయలుదేరిన సిపిఐ నాయకులు



**సంగారెడ్డి వెలుతురు డిసెంబర్ 30:**
నారాయణఖేడ్ నియోజకవర్గం లో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పార్టీ శత వార్షికోత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం నారాయణఖేడ్ నుండి సిపిఐ పార్టీ నాయకులు భారీ ఎత్తున నల్గొండ బహిరంగ సభకి బయలుదేరారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి ఆనంద్ మాట్లాడుతూ సిపిఐ పార్టీ పేదల పార్టీ అని వంద సంవత్సరాల నుండి బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యల పైన నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తూ అధికారం కోసం కాకుండా ప్రజల కోసం పాటుపడిన పార్టీ సిపిఐ పార్టీ అని కొనియాడారు. ఈ రోజుల్లో అధికారం లేకపోతే భూస్థాపితం అయ్యే పార్టీలు ఎన్ని ఉన్నా ఈరోజు అధికారం లేకున్నా బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం అండగా ఉండే ఏకైక పార్టీ సిపిఐ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దత్తు రెడ్డి కౌన్సిల్ సభ్యులు చిరంజీవి,పుప్పాల అశోక్, సిహెచ్ అశోక్, రాము,సంజీవ్, ప్రశాంత్ తదితరులు బహిరంగ సభకి బయలుదేరారు.

# వైభవంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




**బొల్లారం వెలుతురు డిసెంబర్ 30:**
బొల్లారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. 2005 2006 బ్యాచ్ కి సంబంధించిన విద్యార్థినీ విద్యార్థులు అందరూ కలిసి ఉపాధ్యాయిని ఉపాధ్యాయులను అందరినీ సాదరంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. వారు చెప్పినటువంటి నీతి వాక్యాలను మరొక్కసారి గుర్తు చేస్తూనే అప్పటి పాత రోజులను స్మరించుకున్నారు. అధ్యాపకులు ఏవిధంగా దిశా నిర్దేశం చేశారో వాటి గురించి అందరూ కూడా తమ తమ జ్ఞాపకాలను ఈ సందర్భంగా పంచుకోవడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఒక అత్యద్భుతమైన ఘట్టంగా విద్యార్థులందరూ మలచుకున్నారు. పూర్వ విద్యార్థులందరూ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులను దుశ్శాలువాలు, మెమెంటో లతో సత్కరించడం జరిగింది. అలాగే వారి యొక్క జ్ఞాపకాలను మళ్లీమళ్లీ నెమరు వేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మరిన్ని ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా జరగాలని , అందరూ సేవాగుణం అనేది కలిగి ఉండాలని ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. తమను పూర్వ విద్యార్థులందరూ అత్యంత ప్రేమతో సత్కరించడం పట్ల వారు సంతోషాన్ని వెలిబుచ్చారు.

# మాజీ మంత్రి స్వర్గీయ ఫరిదోద్దీన్ 3 వ వర్ధంతి

- నిరంతరం ప్రజా సేవకే తన జీవితాన్ని అంకింతం చేసిన గొప్ప వ్యక్తి...
- వారి సేవలు చిరస్మరణీయం...
- నివాళులు అర్పించిన ఎమ్మెల్యే మాణిక్ రావు..





**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 30:**
దివంగతనేత మాజీ మంత్రివర్యులు కీ.శే. మహమ్మద్ ఫరీదుద్దీన్ 3వ వర్ధంతి సందర్భంగా జహీరాబాద్ శాసనసభ్యులు కోనింటి మాణిక్ రావు, బి అర్ ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి వారి ఫరీద్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ వారి సేవలు చిరస్మరణీయమని, ఆయన లేని లోటు ఎప్పటికీ పూడ్చలేనిదని పేర్కొన్నారు. రాజకీయ నేతగా ఆయన నిరంతరం ప్రజా సేవకే తన జీవితాన్ని అంకింతం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఎందరికో ఆదర్శవంతులుగా నిలిచే అలాంటి వారితో కలసి పనిచేయడం మా అందరి అదృష్టమని తెలిపారు. ఆయన 3వ వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకొని వారిని మననం చేసుకుందాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప,మాజీ ఆత్మ చైర్మన్ విజయ్ కుమార్, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, ఝరసంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, కోహీర్ మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు, పాక్స్ చైర్మన్ మాచెందర్, సీనియర్ నాయకులు గంగ్వార్ వీరారెడ్డి, మాజీ ఆలయ చైర్మన్ లు నీల వెంకటేశం, నర్సింహ గౌడ్, నియోజకవర్గ ఎస్సి సెల్ అధ్యక్షులు బండి మోహన్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ లో ఈస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయండి

**కేంద్ర హోమ్ శాఖ సహాయమంత్రి బండి సంజయ్ కి బీఎంఎస్ నాయకుల విజ్ఞప్తి**



**కరీంనగర్ వెలుతురు డిసెంబర్ 30:**
కరీంనగర్ లో ఈఏస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని భారతీయ మజ్దూర్ సంఘ్ నాయకులు కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కి విజ్ఞప్తి చేశారు . ఈ మేరకు సోమవారం రోజున కరీంనగర్ పార్లమెంటు కార్యాలయంలో బిఎంఎస్ నేతలు మంత్రి బండి సంజయ్ ని కలిసి వినతిపత్రం సమర్పించారు. కరీంనగర్ లో వేల మంది కార్మికులు, ఈఎస్ఐ కార్డుదారులు ఉన్నారని, ఆసుపత్రి ఏర్పాటు తో కార్మికులకు ఆధునిక వైద్య సేవలు అందుబాటులో కి వస్తాయని, ఇది కార్మికులకు ఎంతో ప్రయోజనకారంగా ఉంటుందని వివరించారు. తక్షణం కరీంనగర్లో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా బి ఎం ఎస్ నేతలు మంత్రిని కోరారు. ఈ కార్యక్రమం లో బీఎంస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పప్పుల సురేష్, జిల్లా అధ్యక్షులు పసుల శ్రవణ్, జిల్లా కార్యదర్శి తొర్తి శ్రీనివాస్, నక్క అరుణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కాశ్మీర్‌ను కప్పేసిన మంచు దుప్పటి

- యూనివర్శిటీ పరీక్షలన్నీ వాయిదా



**శ్రీనగర్,డిసెంబర్30( వెలుతురు):**
కాశ్మీర్‌లో హిమపాతం కారణంగా భారీగా మంచు కురుస్తోంది. దీంతో అక్కడి ప్రభుత్వం పరీక్షలను రద్దు చేసింది. డిసెంబర్ 30న జరగాల్సిన కాశ్మీర్ యూనివర్సిటీ పరీక్షలన్నీ వాయిదా పడ్డాయి. కాశ్మీర్‌లోని చాలా ప్రాంతాల్లో ముఖ్యంగా ఉత్తర, దక్షిణ ప్రాంతాలలో విపరీతమైన మంచు కురుస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ మజిద్ జమాన్ తెలిపారు. పరీక్షలను సకాలంలో నిర్వహిస్తామన్నారు. వాయిదా పడిన పరీక్షలకు కొత్త తేదీలు విడిగా జారీ చేయబడతాయన్నారు. కొత్త సంవత్సరానికి ముందు జమ్మూ కశ్మీర్‌లో మంచు భారీగా కురుస్తోంది. ఈ ప్రభావం జనవరి 1, 2 తేదీల్లో కూడా ఉంటుందని, కొన్ని కొండ ప్రాంతాలు, మైదాన ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశాలు కూడా ఉన్నాయని వెదర్ రిపోర్ట్ అధికారులు ప్రకటించారు. ఆ తర్వాత జనవరి 3, 6 తేదీల మధ్య కశ్మీర్ డివిజన్‌లోని కొన్ని ప్రాంతాలలో భారీ హిమపాతం ఉండవచ్చని వెల్లడించారు. దీంతో జమ్మూ డివిజన్‌లోని అనేక ప్రాంతాలు కూడా ప్రభావితం కానున్నాయి. వాతావరణం అధ్వాన్నంగా ఉన్న నేపథ్యంలో ఆదివారం అనేక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున హిమపాతం కురిసింది. ఆ క్రమంలో మంచు తొలగింపు తర్వాత రెండో రోజు జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు పునరుద్ధరించబడ్డాయి. దీంతోపాటు దారిలో నిలిచిన వాహనాలను గమ్యస్థానం వైపు పంపించారు. బనిహాల్, ఖాజిగుండ్ మధ్య రోడ్లు జారడం కారణంగా, డ్రైవర్లు నెమ్మదిగా నడపాలని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇదే సమయంలో సింథాన్ రోడ్, సోన్‌మార్గ్-కార్గిల్ రోడ్, భదేర్వా-చంబా రోడ్‌తో పాటు జిల్లా రాజోరి, పూంచ్ నుంచి షోపియాన్ (కశ్మీర్) వరకు కలిపే మొఘల్ రోడ్‌లు ఇంకా మంచుతోనే ఉన్నాయి. వీటిని ఇంకా తెరువలేదు. వాతావరణం మెరుగుపడిన తరువాత శ్రీనగర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన కార్యకలాపాలు పునఃప్రారంభించబడ్డాయి. పర్యాటకులు, ప్రయాణికులు ట్రాఫిక్ విభాగం సలహా ప్రకారం ప్రయాణించాలని సూచించారు. అలాగే నేటి నుంచి రైలు సర్వీసులను కూడా పునరుద్ధరించారు. అయితే ఈ రోజు విస్టాడోమ్ సేవలు రద్దు చేయబడ్డాయి. ఈ క్రమంలో లోయలోని చాలా జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రత సాధారణం కంటే 2 నుంచి 6 డిగ్రీలు తక్కువగా ఉంది. ఆదివారం రాజధాని శ్రీనగర్‌లో గరిష్ట ఉష్ణోగ్రత 4.7 డిగ్రీల నుంచి 4.2 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. పహల్గామ్‌లో 5.8 డిగ్రీలు, గుల్‌మార్గ్‌లో 5.3 డిగ్రీల నుంచి మైనస్ 2.0 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. జమ్మూలో గరిష్ట ఉష్ణోగ్రత 20.5 కాగా, కనిష్ట ఉష్ణోగ్రత 6.1 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. బనిహాల్‌లో 6.1 డిగ్రీల సెల్సియస్, బాటోట్‌లో 7.9, కత్రాలో 18.0, భదర్వాలో 10.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. లేహ్‌లో గరిష్ట ఉష్ణోగ్రత 0.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. గుల్మార్గ్‌లో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సున్నా కంటే తక్కువగా ఉండటం విశేషం.

# ఎట్టకేలకు తెలంగాణ ప్రతినిధులకు గౌరవం

- పాక్షికంగా లేఖలకు అనుమతి: చైర్మన్

**అమరావతి,డిసెంబర్30( వెలుతురు):**
తిరుమలలో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను అనుమతించడంపై ఏపీ సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల సిఫార్సు లేఖలను అనుమతించేందుకు సీఎం చంద్రబాబు అంగీకరించారని తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. సోమవారం సీఎంతో బీఆర్ నాయుడు సమావేశమయ్యారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై చంద్రబాబుతో చర్చించారు. వారానికి నాలుగు సిఫార్సు లేఖలు అనుమతించేందుకు చంద్రబాబు అంగీకరించినట్లు బీఆర్ నాయుడు తెలిపారు. వారానికి రెండు బ్రేక్ దర్శనాలు, రెండు రూ.300 దర్శనానికి సంబంధించిన లేఖలు అనుమతించేందుకు సీఎం అనుమతి ఇచ్చారని బీఆర్ నాయుడు వెల్లడించారు.

## ఎపి నూతన సిఎస్‌గా విజయానంద్

(మొదటి పేజీ తరువాయి..)
నీరబ్‌కుమార్ ప్రసాద్ డిసెంబర్ 31తో పదవీవిరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో కొత్త సీఎస్‌గా విజయానంద్ బాధ్యతలు చేపడతారు. బీసీ అధికారి విజయానంద్‌కు సీఎస్‌గా అవకాశం ఇవ్వడంతో టీడీపీ నేతలతో పాటు ప్రభుత్వ వర్గాల్లో పెద్ద చర్చ నడుస్తోంది. 1992 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన బీసీ అధికారికి సీఎం చంద్రబాబు టాప్ పోస్ట్ ఇచ్చారని పలువురు టీడీపీ నేతలు, ప్రభుత్వ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. చంద్రబాబు నాయకత్వంలో బీసీ నేతలకు, అధికారులకు ఎప్పుడూ సమున్నత గౌరవం దక్కుతుందని అధికారులు అంటున్నారు. ఉమ్మడి ఏపీలో గానీ, నవ్యాంధ్రలో గానీ ఇప్పటి వరకు బీసీలకు సీఎస్ పోస్టు దక్కలేదని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. తొలిసారి బీసీ అధికారికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించిన సీఎంపై ప్రశంసలు కురిపిస్తున్నారు. బీసీలకు నారా చంద్రబాబు ఎప్పుడూ పెద్దపీట వేస్తారని నేతలు, అధికారులు అంటున్నారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన టీటీడీ ఈవోగా బీసీ అధికారిగా శ్యామల రావు నియామకం జరిగిందంటున్నారు. అటు ప్రభుత్వంలోను, పార్టీలోనూ బీసీలకు చంద్రబాబు సముచిత స్థానం ఇచ్చారని నేతలు చర్చించుకుంటున్నారు. తెలుగు దేశం రాష్ట్ర పార్టీ అధ్యక్షునిగా బీసీ నేత పల్లా శ్రీనివాస్‌కు అవకాశం ఇచ్చారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. శాసన సభ స్పీకర్‌గా మరో సీనియర్ నేత చింతకాలయ అయ్యన్న పాత్రుడుకు అవకాశం వచ్చిందంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో సీఎస్, డీజీపీ సహా అన్ని కీలక స్థానాల్లో తన సామాజిక వర్గానికి చెందిన వాళ్లనే వైఎస్ జగన్ నియమించారని టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు.



# తిరుమలలో భక్తుల రద్దీ సాధారణం

**తిరుపతి,డిసెంబర్30( వెలుతురు):**
తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తుల రద్దీ సాదారణంగా ఉంది. సోమవారం వెంకన్న స్వామిని దర్శించుకునేందుకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని ఒక కంపార్టుమెంట్ లోనే భక్తులతో వేచి ఉన్నారు. ఈ క్రమంలో టోకెన్ లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనానికి కేవలం 6 గంటల సమయం మాత్రమే పడుతుంది. కాగా, ఆదివారం వెంకన్న స్వామిని దర్శించుకునేందుకు తిరుమలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. దీంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్టుమెంట్లు భక్తులతో నిండిపోయాయి. నిన్న శ్రీవారిని 84,950 మంది భక్తులు దర్శించుకుని ముక్కులు తీర్చుకున్నారు. 21,098 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. టిటిడి హుండీ ఆదాయం రూ.3.8 కోట్లుగా ఉందని అధికారులు వెల్లడించారు.

# మల్లన్న సేవలో గవర్నర్ సతీమణి



**నంద్యాల,డిసెంబర్30( వెలుతురు):**
శ్రీశైలం శ్రీ మల్లికార్జున స్వామి అమ్మవార్లను తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సతీమణి సుధాదేవ్ వర్మ సోమవారం దర్శించు కున్నారు. ముందుగా గవర్నర్ భార్యకి శ్రీశైలం ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎం.శ్రీనివాసరావు ఆలయ ప్రధాన ద్వారం వద్ద ఆలయ మర్యాదలతో వేద పండితులు, అర్చక స్వాములతో ఘన స్వాగతం పలికారు. అలాగే ఆలయ ప్రాంగణంలో సందర్శించిన అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో ఆశీర్వచనము చేయగా ఆలయ ఈవో స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలను, స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని గవర్నర్ సతీమణి కి అందజేశారు.

# దేశం శోకసంద్రంలో ఉంటే రాహుల్ ఎక్కడ

- న్యూ ఇయర్ వేడుకల కోసం వియత్నాం వెళ్లారు
- బిజెపి నేత ఎక్స్ వేదికగా విమర్శలు



**న్యూఢిల్లీ,డిసెంబర్30( వెలుతురు):**
మన్మోహన్ సింగ్ మరణానంతరం పలు అంశాల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య వివాదం ఆగడం లేదు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీపై బీజేపీ విరుచుకుపడింది. మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఒకవైపు దేశం మొత్తం సంతాపం వ్యక్తం చేస్తోందని బీజేపీ పేర్కొంది. మరోవైపు రాహుల్ గాంధీ నూతన సంవత్సర వేడుకల కోసం వియత్నాం వెళ్లారని ఆరోపించింది. మన్మోహన్ సింగ్ చితాభస్మ నిమజ్జనానికి కాంగ్రెస్, గాంధీ కుటుంబానికి చెందిన వారు ఎవరూ హాజరు కాలేదని బీజేపీ విమర్శించింది. బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాల్వియా రాహుల్ గాంధీని విమర్శిస్తూ.. ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. 'మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతితో యావత్ దేశం శోకసంద్రంలో మునిగిపోయింది. మరోవైపు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ వియత్నాం వెళ్లారు. మాజీ ప్రధాని మరణంపై రాహుల్ గాంధీ రాజకీయాలు చేస్తున్నారు. పార్టీ ప్రయోజనాల కోసం ఆయన మరణాన్ని కూడా ఉపయోగించుకున్నారు. గాంధీ కుటుంబం, కాంగ్రెస్ సిక్కులను ద్వేషిస్తున్నాయి. ఇందిరా గాంధీ దర్బార్ సాహిబ్‌ను అవమానించిన తీరును మర్చిపోవద్దు' అని రాసుకొచ్చారు. మరోవైపు బీజేపీ ఆరోపణలపై కాంగ్రెస్ కూడా స్పందించింది. రాహుల్ గాంధీ వ్యక్తిగతంగా విదేశీ పర్యటనకు వెళ్లారని, దీని వల్ల ఎవరికీ ఇబ్బంది లేదని కాంగ్రెస్ పేర్కొంది. ఇది వారి వ్యక్తిగత అంశమని పార్టీ పేర్కొంది. ఈ పార్టీ విభజన రాజకీయాలను ఎప్పుడు విడనాడనుందని కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ పేర్కొన్నారు. అయితే.. కుటుంబ గోప్యతను గౌరవిస్తూ.. మన్మోహన్ సింగ్ అస్తికలు నిమజ్జనం చేసేందుకు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కుటుంబంతో పాటు వెళ్లలేదని పార్టీ మీడియా విభాగం అధిపతి పవన్ ఖేరా ఒక ప్రకటనలో తెలిపారు.

### లైంగిక దాడి ఘటన నేపథ్యంలో

# గవర్నర్‌ను కలిసిన నటుడు విజయ్



**చెన్నై, డిసెంబర్ 30 ( వెలుతురు):**
అన్నా యూనివర్సిటీలో విద్యార్థినిపై లైంగిక దాడి ఘటన తమిళనాడులో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఘటనకు పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. వివిధ పార్టీలు, సంఘాలు అన్నా యూనివర్సిటీ ముందు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఘటనకు వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇవాళ తమిళగ వెట్రి కజగమ్ పార్టీ అధ్యక్షుడు, నటుడు విజయ్ తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని కలిశారు. రాష్ట్రంలోని పరిస్థితుల నేపథ్యంలో లైంగిక దాడి ఘటనపై మాట్లాడేందుకే విజయ్ గవర్నర్‌ను కలిసినట్లు తెలుస్తోంది. అయితే నటుడు విజయ్ ఈ లైంగిక దాడి ఘటనపై ఇప్పటికే స్పందించారు. అన్నా యూనివర్సిటీ ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, చాలా బాధించిందని నటుడు విజయ్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారని, నిందితుడిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తాను ప్రభుత్వాన్ని కోరానని, ఈ ఘటనలో ఇంకా ఎవరి హస్తమున్నా తగిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశానని ఆయన తన పోస్టులో తెలిపారు.

# హైదరాబాద్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం

- అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డి వెల్లడి
- ఆర్‌డిఐలో కీలక సంస్కరణ చేశారన్న పొన్నం



**హైదరాబాద్,డిసెంబర్30( వెలుతురు):**
తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జీవిత చరిత్ర తెలిపేలా స్మారకం ఏర్పాటు చేస్తామని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లోనూ మన్మోహన్ సింగ్ విగ్రహాలు ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. ఇటీవల మరణించిన భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సంతాపం తెలిపేందుకు తెలంగాణ అసెంబ్లీ సోమవారం ప్రత్యేకంగా భేటీ అయ్యింది. మన్మోహన్ సింగ్‌కు భారత రత్న ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతూ ఈ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానంపై మంత్రి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచం మొత్తం మెచ్చిన ఆర్థిక వేత్త మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. ఉన్నత స్థానాల్లో ఉన్నప్పటికీ.. ఆయన ఎప్పుడు నిరాడంబరంగా జీవించేవారని.. పార్లమెంట్‌కు కూడా మన్మోహన్ సింగ్ లంచ్ బాక్స్ తెచ్చుకునేవారని చెప్పారు. దేశంలో నోట్లు రద్దు చేస్తే భారత ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అవుతోందని మన్మోహన్ సింగ్ ఎప్పుడు చెప్పేవారని.. కేంద్ర ప్రభుత్వం 2016లో నోట్లు రద్దు చేసిన తర్వాత మన్మోహన్ సింగ్ చెప్పిందే నిజమైందని.. దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందన్నారు. రెండేళ్ల కిందట 92 ఏళ్ల వయసులోనూ మన్మోహన్ సింగ్ ధర్నా చేశారని .. అప్పుడు తనకు ఆయనను కలిసే అవకాశం వచ్చిందని ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి యాది చేసుకున్నారు. మన్మో హన్ సింగ్ ఆర్బీఐలో అనేక మార్పులు తీసుకొచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అసెంబ్లీలో మన్మోహన్ మృతిపై సంతాప తీర్మానం సందర్భంగా మాట్లాడిన ఆయన... కరీంనగర్ ముద్దుబిడ్డ పీవీ ఆధ్వర్యంలో మన్మోహన్ ఆర్థిక మంత్రి అయ్యారని చెప్పారు. మన్మోహన్ తో కలిసి పనిచేసే అవకాశం తనకు దక్కిందన్నారు పొన్నం. మోడల్ స్కూల్ వ్యవస్థను మన్మోహన్ తీసుకొచ్చరని చెప్పారు. గ్లోబలైజేషన్ తోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు పొన్నం. ఆర్టీఐ చట్టంతో పారదర్శకతకు పెద్దపీట దక్కిందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మన్మోహన్ సింగ్ 90 ఏళ్ల వయసులో వీల్ చైర్ లో వచ్చి రాజ్యసభలో ఓటు వేశారని గుర్తు చేశారు పొన్నం. దేశంలో 72 వేల కోట్ల రైతు రుణాలు మాఫీ చేశారని తెలిపారు. మన్మోహన్ సింగ్ హైదరాబాద్ కు ఓఆర్ఆర్, మెట్రో రైల్ ప్రాజెక్టులు ఇచ్చారని గుర్తు చేశారు పొన్నం. మన్మోహన్ మృతిపై ప్రపంచ దేశాలు స్పందించాయని.. మన్మోహన్ సహకారంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యిందన్నారు.

# రైతుబంధు ఇవ్వాలన్న కనీస సోయి కాంగ్రెస్‌కు లేదు

- రైతు కూలీలకు సాయం చేస్తానని మాట మార్చింద్రు
- రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువు
- ప్రతీ ఐదు గంటలకొక మహిళ కిడ్నాప్ : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత




**హైదరాబాద్, డిసెంబర్ 30 ( వెలుతురు):**
రైతుబంధు ఇవ్వాలన్న సోయి ప్రభుత్వానికి లేదని ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ ప్రజలను కన్నబిడ్డలను చూసుకున్నట్లుగా చూసుకున్నారని తెలిపారు. కానీ, కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని.. రైతుబంధు ఇవ్వాలన్న సోయి ప్రభుత్వానికి లేదని మండిపడ్డారు. రైతు కూలీలకు కూడా సాయం చేస్తామన్న ప్రభుత్వం.. ఇప్పటికీ ఏం చేయలేదన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదని.. రాష్ట్రంలో ప్రతీ మూడు గంటలకు మహిళలపై ఒక అత్యాచారం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతీ ఐదు గంటలకు ఒక మహిళా కిడ్నాప్ అవుతోందని.. మహిళా భద్రత కోసం కేసీఆర్ షీటీమ్స్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు పోలీసులు కాంగ్రెస్ నేతలు చుట్టూ తిరగడం తప్పా.. ఏం చేయడం లేదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో పోలీసులు పీపుల్స్ ఫ్రెండ్లీగా ఉండేదని.. ఇప్పుడు కాంగ్రెస్ ఫ్రెండ్లీ పోలీసింగ్ జరుగుతో౦దని విమర్శిం చారు. రాష్ట్రంలో మహిళలకు కనీస భద్రత లేకపోవడం దారుణమని.. సీఎం రేవంత్ రెడ్డి మహిళా భద్రతపై ప్రత్యేకంగా సమీక్షించాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యం, రాజ్యాంగమంటూ తిరుగుతుం టే.. రేవంత్ రెడ్డి మాత్రం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తు న్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ వచ్చిన తర్వాత ఎప్పుడూ లేనట్లు రెండు పెద్ద ఎన్ కౌంటర్లు జరిగాయని.. తుపాకీ మోతలు ఉండవద్దన్న లక్ష్యంతో పరిపాలన చేసిన వ్యక్తి కేసీఆర్ అని.. ఇవాళ రేవంత్ రెడ్డి శాంతి భద్రతలకు భగ్నం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరంపై దుష్ప్రచారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు మాత్రం విడుదల చేసిందని.. రైతులను నరకయాతన పెట్టడానికి భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిన ప్రభుత్వం రీసర్వే చేసే ముందు భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భూముల రీసర్వే పేరిట ఒకరి పేరు మీద ఉన్న భూమిని మరొకరి పేరు మీద రాయన్న నమ్మకం ప్రజలకు, రైతులకు లేదని.. కాంగ్రెస్ పై ప్రజలు నమ్మకం కోల్పోయారన్నారు. ప్రజలు బీఆర్ఎస్ పార్టీ వైపు చూస్తున్నారని.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలన్నారు. రాబోయే రోజులు బీఆర్ఎస్‌వేనని.. నిజామాబాద్ జిల్లా అనాథగా మారిందని.. జిల్లా నుంచి కనీసం ఒక మంత్రి కూడా లేరని.. ఎంపీ ఉన్నా లేనట్లే.. ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలకు పవర్ లేదన్నారు. ఓడిపోయిన కాంగ్రెస్ నాయకులే అధికారిక కార్యక్రమాలకు హాజరవుతు న్నారన్నారు. నిజామాబాద్‌కు ఆరు నెలల నుంచి పోలీసు కమిషనర్ లేకపోవడం దారుణమన్నారు. ఏడాదికాలంలో ఒక్క రూపాయి కూడా మున్సిపాలిటీలకు ఇవ్వలేదని.. కాంగ్రెస్ ఏడాది పాలనలో ఒక కొత్త పని చేపట్టలేదన్నారు. ఎస్సారెస్పీ నుంచి నిజామాబాద్ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు ఇవ్వలేదన్నారు. మేడిగడ్డ విషయంలో కేసీఆర్‌ను బద్నాం చేయాలన్న పిచ్చి ప్రయత్నంతో ఎస్సారెస్పీని ఎండబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ ప్రాజెక్టుల గురించి ప్రభుత్వాన్ని నిజామాబాద్ జిల్లా ఎమ్మెల్యేలు ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. షబ్బీర్ అలీకి నిజామాబాద్‌పై ఆలోచన లేదని, పట్టిలేదన్నారు. నిజామాబాద్ జిల్లాలో ఇష్టానుసారంగా ఇసుక దందా జరుగుతోందని.. ఇప్పుడు మైనింగ్ శాఖ ఆదాయం తగ్గిందన్నారు. కాంగ్రెస్ నాయకుల ఆదాయం పెరిగిందని.. ఇసుకు దోపిడీని అడ్డుకుంటామన్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో కలిపి 3 లక్షల 79 మంది బీఆర్ఎస్ పార్టీ రుణమాఫీ చేసిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కేవలం 2 లక్షల మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేసింద ని.. నిజామాబాద్ జిల్లాలో ఇంకా లక్షా 2 వేల మందికి, కామారెడ్డి జిల్లాలో 75 వేల మందికి రుణమాఫీ కాలేదన్నారు. తెలంగాణ యూనివర్సిటీకి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని.. తక్షణమే నిధులు విడుదల చేసి%ూ% వర్సిటీ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలని హితవు పలికారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణపై కమిటీలతో కాలయాపన చేస్తున్న ప్రభుత్వం.. హైదరాబాద్‌లో హైడ్రా పెట్టినట్టు నిజామాబాద్‌లో నిద్రా పెడుతామని పీసీసీ అధ్యక్షుడు చెప్పడం దారుణమన్నారు. బుల్డోజర్‌తో ప్రజల ఆస్తులు కూలగొడుతామని హెచ్చరిస్తున్నారని.. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని ప్రజల ఇళ్లపైకి బుల్డోజర్లను తీసుకెళ్తే మేము ఊరుకోబోమని హెచ్చరించారు.

# గోటితోపోయే దానిని గొడ్డలిదాకా తెచ్చారు

- సంధ్య థియేటర్ ఘటనపై పవన్ వ్యాఖ్య

**గుటూరు,డిసెంబర్30( వెలుతురు):**
గోటితో పోయే దాన్ని గొడ్డలి వరకూ తెచ్చారని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన, సినీనటుడు అల్లు అర్జున్ అరెస్ట్‌పై పవన్‌కల్యాణ్ స్పందించారు. మంగళగిరిలో మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి గొప్ప నాయకుడుని, కిందిస్థాయి నుంచి ఎదిగారని కితాబునిచ్చారు. వైకాపా విధానాల తరహాలో అక్కడ వ్యవహరించలేదు. ఆ రాష్ట్రంలో బెనిఫిట్‌షోలకు అవకాశమిచ్చారు. టికెట్ ధర పెంపునకూ వెసులుబాటు కల్పించారు. ఆయన సహకారంతోనే సినిమాల కలెక్షన్లు పెరిగాయి. 'సలార్', 'పుష్ప2'వంటి సినిమాలకు భారీ వసూళ్లు వచ్చాయి. 'పుష్ప2' సినిమాకు సీఎం రేవంత్ పూర్తిగా సహకరించారు. టికెట్ రేట్ల పెంపునకు అవకాశం ఇవ్వడం కూడా చిత్ర పరిశ్రమను ప్రోత్సహించడమే అవుతుందని అన్నారు. అల్లు అర్జున్ విషయంలో తెర ముందు, వెనుక ఏం జరిగిందో నాకు పూర్తిగా తెలియదు. చట్టం అందరికీ సమానం. ఇలాంటి ఘటనల్లో పోలీసులను తప్పుపట్టను. భద్రత గురించే వారు ఆలోచిస్తారు. థియేటర్ స్టాఫ్ కూడా అల్లు అర్జున్‌కు ముందు చెప్పి ఉండాల్సింది. పోనీ, సీట్లో ఆయన కూర్చొన్నాక అయినా, చెప్పి తీసుకెళ్లాల్సిందని అన్నారు. అల్లు అర్జున్ తరఫున ఎవరో ఒకరు బాధిత కుటుంబం వద్దకు ముందే వెళ్లి ఉంటే బాగుండేది. ఈ ఘటనలో రేవతి చనిపోవడం నన్ను కలచి వేసింది. గోటితో పోయే దాన్ని గొడ్డలి వరకూ తెచ్చారు. మేమంతా అండగా ఉన్నామని ముందే చెప్పి ఉండాల్సింది. తమ ప్రమేయం లేకుండా తప్పు జరిగి పోయిందని విచారం వ్యక్తం చేయాల్సింది. ఈ విషయంలో ఎక్కడో మానవతా దృక్పథం లోపించింది. అందరూ రేవతి ఇంటికి వెళ్లి భరోసా ఇచ్చి ఉండాల్సింది. పరామర్శించకపోవడం వల్లే ప్రజల్లో ఆగ్రహం వచ్చింది. తన వల్లే ఒకరు చనిపోయారనే వేదన అర్జున్‌లో ఉంది' 'సినిమా అంటే టీమ్.. అందరి భాగస్వామ్యం. అల్లు అర్జున్ ఒక్కడినే దోషిగా మార్చడం కూడా కరెక్ట్‌కాదు. తొక్కిసలాట ఘటన తర్వాత చోటు చేసుకున్న పరిణామాలపై సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి స్పందించారు. కొన్నిసార్లు పరిస్థితులను బట్టి నిర్ణయాలు ఉంటాయి. చిరంజీవి కూడా గతంలో అభిమానులతో కలిసి సినిమాలు చూసేందుకు వెళ్లేవారు. కాకపోతే ఆయన ముసుగు వేసుకుని ఒక్కరే థియేటర్‌కు వెళ్లేవారు' 'సినిమా పరిశ్రమలో మార్పు రావాల్సిన అవసరం ఉంది. పరిశ్రమలోని వారందరూ కూర్చొని మాట్లాడాలి. రాష్ట్రంలో పాపికొండలు వంటి చక్కటి లొకేషన్లు ఉన్నాయి. విజయనగరం అటవీ ప్రాంతంలోనూ అందమైన ప్రదేశాలున్నాయి. ఈ ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు అవసరం. ఇండస్ట్రీలో క్వాలిటీ ఆఫ్ ఫిల్మ్ మేకింగ్ ఉండాలి. స్టోరీ టెల్లింగ్ స్కూల్స్ రావాలి. అప్పుడే మంచి సినిమాలు సాధ్యం' అని పవన్‌కల్యాణ్ అన్నారు.

## విద్యార్థులపై లాఠీఛార్జి అమానుషం

- చలికాలంలో జల ఫిరంగులు ప్రయోగిస్తారా
- బీహార్ ఘటనపై మండిపడ్డ ప్రియాంక

**న్యూఢిల్లీ,డిసెంబర్30( వెలుతురు):**
బీహార్‌లో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీఛార్జి చేయడాన్ని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ తీవ్రంగా ఖండించారు. డబుల్ ఇంజిన్ పాలనలో యువతపై డబుల్ దౌర్జన్యాలు చేస్తున్నారన్నారు. ఈ చలిలో విద్యార్థులపై జలఫిరంగులు ప్రయోగించడం, లాఠీఛార్జి చేయడం అమానుషమని ఆవేదన వ్యక్తంచేశారు. బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇటీవల నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ ఆదివారం వేలాదిమంది అభ్యర్థులు పట్నాలోని గాంధీ మైదాన్ వద్ద నిరసనకు దిగిన విషయం తెలిసిందే. వారిని అడ్డుకోవడానికి పోలీసులు జల ఫిరంగులు ప్రయోగించి.. బిహార్‌లో మూడు రోజుల వ్యవధిలో ప్రభుత్వం రెండుసార్లు విద్యార్థులను చిత్రహింసలకు గురిచేసిందని మండిపడ్డారు. పరీక్షల్లో అవినీతి, రిగ్గింగ్‌లు, పేపర్ లీక్‌లను అరికట్టడం తమ బాధ్యత అనే విషయం మరిచిపోయిందన్నారు. తమకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడుతుంటే సహించలేక వారిని అణచివేయడానికి ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వియాదవ్ మాట్లాడుతూ.. అభ్యర్థులపై పోలీసుల చర్య చాలా బాధాకరమని అన్నారు. 'బీపీఎస్సీ అభ్యర్థులపై పోలీసుల చర్య చాలా దారుణం. చాలామందికి తీవ్ర గాయాలయ్యాయి. బయటకు వచ్చిన వీడియోలను చూస్తుంటే వారెంత బాధను అనుభవించారో అర్థమవుతోంది' అని ఆవేదన వ్యక్తంచేశారు. ఇది నిరంకుశ ప్రభుత్వ నియంతృత్వానికి ఉదాహరణ అన్నారు. ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ ఈ సంఘటనను నిరంకుశ ప్రభుత్వ నియంతృత్వానికి ఉదాహరణగా అభివర్ణించారు. అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతున్న యువతతో పోలీసులు క్రూరంగా ప్రవర్తించడం ప్రభుత్వ నియంతృత్వాన్ని మరోసారి ప్రజలకు తెలియజేసిందని అన్నారు. విద్యార్థిగా ఎన్నో ఉద్యమాలు చేసి.. సీఎం స్థాయికి ఎదిగిన నీతీశ్ కుమార్ ప్రభుత్వం నుంచి ఈ ప్రవర్తనను తానెప్పుడూ ఊహించలేదని అన్నారు. విద్యార్థులతో అధికారులు చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని కోరారు. బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ల్లో అవకతవకల విషయంలో ఆదివారం వేలాదిమంది అభ్యర్థులు పట్నాలోని గాంధీ మైదాన్ వద్ద నిరసనకు దిగారు. జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ విద్యార్థులకు పూర్తి మద్దతును ప్రకటించారు. పరీక్షను రద్దు చేసి.. కొత్తగా మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. అభ్యర్థులను పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. దీంతో కిశోర్‌తోపాటు పలువురు విద్యార్థులపైనా పోలీసులు కేసులు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నారు.

## కుంభమేళాకు ప్రత్యేక రైలు ప్యాకేజీలు

**హైదరాబాద్,డిసెంబర్30( వెలుతురు):**
తెలుగు రాష్ట్రాల నుంచి కుంభమేళాకు వెళ్లాలనుకునే వారకి దక్షిణమధ్యరైల్వే గుడ్ న్యూస్ తెలిపింది. ఇప్పటికే ప్రయాగ్ రాజ్ లో ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. గంగా.. యమునా.. సరస్వతి నదులు కలిసే ప్రదేశంలో స్నానం చేస్తే జన్మ .. జన్మల పాపాల నుంచి విముక్తి లభిస్తుందని హిందువులు నమ్ముతుంటారు. తెలుగు రాష్ట్రాల నుంచి కుంభమేళాకు వెళ్లే భక్తులకు ఐఆర్‌టిసి ప్రత్యేక ప్యాకేజీని ప్రవేశపెట్టింది.కుంభమేళా టూర్ ప్యాకేజీలో 8 రోజుల ( 7 రాత్రులు) పర్యటనలో మూడు పుణ్య క్షేత్రాలను సందర్శించుకోవచ్చు. సికింద్రాబాద్ నుంచి బయలు దేరే ఈరైలు తెలుగు రాష్ట్రాల మీదుగా కాశీ.. అయోధ్య.. ప్రయాగ్ రాజ్ వెళ్తుంది. జనవరి 19 తేదీన సికింద్రాబాద్ లో ఈ ట్రైన్ ప్రారంభమవుతుంది. ఈ ట్రైన్ లో మొత్తం 576 సీట్లు ఉండగా వాటిలో స్లీపర్ 320.. థర్డ్ ఏసీ 206.. సెకండ్ ఏసీ 50 ఉన్నాయి. సికింద్రాబాద్, భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం స్టేషన్లలో బోర్డింగ్.. డీబోర్డింగ్ కు అవకాశం ఉంటుంది.

### ఫార్ములా కేసులో అత్యుత్సాహం ఎందుకో

## ఇడి నోటీసు అందిందన్న కెటిఆర్




**హైదరాబాద్,డిసెంబర్30( వెలుతురు):**
ఈడీ ద్వారా నోటీస్ వచ్చింది..దానిలో ఏమి అనుమానం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రేపు కోర్టు లో చెబుతాం.. ఏ కేసులో దూకుడుగా లేని ఈడీ? ఈ కేసులో మాత్రం అత్యుత్సాహం చూపిస్తుందని కేటీఆర్ మండిపడ్డారు. నేను ఎఫ్ఐఆర్ ను సవాల్ చేస్తున్నాను.. కోర్టు ఏమి చెబుతోంది.. కోర్టు చెబితే ఈడీ, ఏసీబీ ఇక ఏది కూడా ఉండదు కదా అన్నారు. మన్మోహన్ సింగ్ కోసం ప్రత్యేక సమావేశం పెట్టారు..పీవీ ని కూడా గౌరవించాలన్నారు. పీవీ కి కూడా న్యాయం జరిగే దాకా కొట్లాడతామన్నారు. 2025 సంవత్సరం లో కమిటీ లు ఉంటాయి, సంస్థాగత నిర్మాణం ఉంటుందన్నారు. సభ్యత నమోదు ఉంటుందన్నారు. అధ్యక్షుడు ఎన్నిక కూడా ఉంటుందని కేటీఆర్ అన్నారు. బహిరంగ సభ పై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రక్షణ కవచం లాగా ఇక్కడ బీజేపీ ఎంపీ లు, కేంద్ర మంత్రులు ఉన్నారని తెలిపారు. అందుకే అమృత్ టెండర్ లపై కేంద్రం నోరు విప్పట్లేదన్నారు. పనికి మాలిన కేస్ లు పెడుతున్నారని మండిపడ్డారు కేటీఆర్. అక్రమ కేస్ లు పెట్టి బెదిరించాలని చూస్తున్నారని అన్నారు. నాపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు.. మంత్రి గా నిర్ణయం తీసుకున్నాను అని మొదటి రోజు చెప్పానని ..ఇప్పుడు కూడా అదే మాటకు చెప్తున్నానని తెలిపారు. ప్రొసీజర్ లో తప్పులు ఉంటే ఎన్నికల కమిషన్ ని అడగండి అన్నారు. రేపు కోర్ట్ ముందుకు వస్తుంది.. అందుకే నేను ఎక్కువగా మాట్లాడను అన్నారు. దీనిలో అవినీతి జరగలేదు అని వాళ్లకు కూడా తెలుసని కేటీఆర్ అన్నారు. మొన్న సీఎం చిట్ చాట్ లో కూడా అవినీతి ఎక్కడ జరిగింది అంటే.. చెప్పలేక పోయారని కేటీఆర్ గుర్తుచేశారు.

## న్యూఇయర్ వేడుకలకు శృతిమించితే కఠిన చర్యలు

- జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు



**తిరుపతి, డిసెంబర్ 30 ( వెలుతురు):**
గత ఆరునెలల్లో తిరుపతి జిల్లాలో క్రైం రేటు బాగా తగ్గిందని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. సోమవారం ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ.. పటిష్టమైన పకడ్బందీ భద్రతా ఏర్పాట్లతో నేరనియంత్రణ చేలగలిగామన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు వివరిస్తూ పూర్తి స్థాయి అవగాహన కల్పించామన్నారు. యువతలో మార్పు తీసుకువచ్చామన్నారు. సైబర్ నేరాలు పెరిగాయని.. కానీ సైబర్ నేరాలకు పాల్పడిన నేరస్తులను అరెస్టులు చేసి బాధితులకు న్యాయం చేశామన్నారు. సైబర్ క్రైం వారోత్సవాలను కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో నిర్వహించామని చెప్పారు. తిరుమల పర్యటనకు వచ్చిన వీఐపీలందరికీ పటిష్టమైన భద్రత కల్పించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అప్రమత్తంగా వ్యవహరించామన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహించడంతో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయన్నారు. అత్యాధునిక టెక్నాలజీని అందిపుచ్చుకుని సంచలనాత్మక కేసులను త్వరితగతిన చేధించానమన్నారు. శేషాచలం అటవీ ప్రాంతంలో ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకున్నామని... పీడీ యాక్ట్‌లు పెట్టడంతో స్మగ్లర్లు వెనక్కి తగ్గారన్నారు. హోంస్టేలపై ప్రత్యేక నిఘా పెంచామని... అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా అడ్డుకట్ట వేశామన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఆరునెలల్లో ఏడు శాతం కేసులు తగ్గాయని ఎస్పీ వెల్లడించారు. నూతన సంవత్సర వేడుకలను జాగ్రత్తగా జరుపుకోవాలని సూచించారు. శృతిమించి వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంలో డీజేలకు అనుమతులు లేవన్నారు. ఫ్లైఓవర్‌ను 31వ తేదీ రాత్రి 11గంటలకు మూసేస్తామన్నారు. అశ్లీల నృత్యాలకు అనుమతులు లేవన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు చేస్తామని తెలిపారు. మద్యం సేవించి వాహనాలను నడిపితే కేసులు పెడతామన్నారు. ఆధ్యాత్మిక పవిత్రతకు భంగం కలిగిస్తే కేసులు పెడతామని ఎస్పీ సుబ్బారాయుడు స్పష్టం చేశారు.

# గేమ్ ఛేంజర్ కానున్న బనకచర్ల

- బనకచర్లతో తెలుగుతల్లికి జలహారతి
- గోదావరి నీటిని వినియోగించుకునేలా ప్లాన్
- నదుల అనుసంధానంతో వృధానీటికి అడ్డుకట్ట
- రాయలసీమకు నీటిని అందిస్తే డెల్టాతో పోటీ
- ప్రాజెక్టులపై చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- జగన్‌కు క్రెడిబిలిటీ లేదని విమర్శలు



**అమరావతి,డిసెంబర్30( వెలుతురు):**
గోదావరి – బనకచర్ల ప్రాజెక్టు రాష్ట్రానికి గేమ్ ఛేంజర్ అవుతుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. బనకచర్లకు నీటిని తీసుకెళ్లగలిగితే నదుల అనుసంధానం పూర్తయినట్లేనని, ఈ ప్రాజెక్టుతో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన రిజర్వాయర్ల అనుసంధానం కూడా పూర్తవుతుందని చెప్పారు. నీటిలభ్యతను బట్టి కర్నూలు జిల్లా బనకచర్ల రెగ్యులేటర్‌కు రోజుకు కనీసం 2 టీఎంసీలు తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటాం. గోదావరి – బనకచర్ల ప్రాజెక్టు రాష్ట్రానికి 'గేమ్ ఛేంజర్' అవుతుంది. బనకచర్లకు నీటిని తీసుకెళ్లగలిగితే నదుల అనుసంధానం పూర్తయినట్లేనని వివరించారు. ఈ ప్రాజెక్టుతో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన రిజర్వాయర్ల అనుసంధానం కూడా పూర్తవుతుంది. రాష్ట్రంలో అదనపు ఆయకట్టు అందుబాటులోకి వస్తుంది. గోదావరి – బనకచర్ల పూర్తయితే తెలుగుతల్లికి జలహారతి ఇచ్చినట్లే. తెలుగు రాష్ట్రాల్లో 90శాతం ప్రాజెక్టులు తెదేపా హయాంలో చేపట్టినవేనని చంద్రబాబు తెలిపారు. దాదాపు అన్ని ప్రాజెక్టులు తెదేపా అధికారంలో ఉన్నప్పుడే చేపట్టామన్నారు. రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సమక్షంలో తెలుగు గంగ ప్రాజెక్టుపై ఒప్పందం జరిగిందని గుర్తు చేశారు. అప్పట్లో శ్రీశైలం నుంచి కెనాల్ ద్వారా తెలుగుగంగకు నీళ్లు ఇవ్వడానికి ఎన్టీఆర్ సిద్ధమని చెప్పారన్నారు. అలా రాయలసీమకు తెలుగుగంగ నీళ్లు తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు.'వెలిగొండ, తోటపల్లి ప్రాజెక్టులు నేనే ప్రారంభించాను. ఉత్తరాంధ్ర జిల్లాల్లో నీటి కొరత, వర్ష పాతం ఎక్కువ. రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కరవు వల్ల సాగు దెబ్బతింటోంది. నీళ్లు ఇవ్వగలిగితే రాయలసీమను రత్నాలసీమగా చేయవచ్చు. గతంలో అనంతపురంలో అతి తక్కువ తలసరి ఆదాయం ఉండేది. ఉద్యాన పంటలతో ఆ జిల్లాలో తలసరి ఆదాయం 4-5 శాతానికి చేరింది. పట్టిసీమ చేపట్టిన తర్వాత సరైన సమయానికి పంటలు చేతికి అందే పరిస్థితి వచ్చింది. కృష్ణాలో నీళ్లు తగ్గాయి. గోదావరిలో నీటి ప్రవాహం ఉంది. కృష్ణా నది నుంచి 2,989 టీఎంసీల వరద ప్రవాహం సముద్రంలోకి వెళ్తోంది. నదుల అనుసంధానంతో కరవు, వరద పరిస్థితులు ఎదుర్కోవచ్చు. కృష్ణా తూర్పు, పశ్చిమ డెల్టాలకు నీళ్లు ఇవ్వాల్సి ఉంది. గోదావరి నుంచి కృష్ణాకు కనీసం 200 టీఎంసీలు తీసుకురావాలన్నారు. ఈ ఏడాది 4,114 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలోకి వెళ్లాయి. రాష్ట్రంలో రిజర్వాయర్ల సామర్థ్యం 983 టీఎంసీలకు చేరింది. ప్రస్తుతం రిజర్వాయర్లలో 729 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. జనవరి 1 నాటికి రిజర్వాయర్లలో 74 శాతం నీళ్లు ఉండటం రికార్డు. ఖరీఫ్ పంటలకు ముందస్తుగా నీరు ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. వరదలు, తుపానుల కంటే ముందుగా పంట చేతికి వచ్చే వీలుంది' అని చంద్రబాబు తెలిపారు.మూడు దశల్లో బనకచర్ల ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ప్రణాళికలు చేపట్టాం. పోలవరం నుంచి కృష్ణా నదికి నీరు మళ్లించడం మొదటి దశ. రెండో దశలో బొల్లాపల్లి జలాశయం నిర్మించి నీళ్లు తరలిస్తాం. మూడోదశలో బొల్లాపల్లి నుంచి బనకచర్లకు నీటిని మళ్లిస్తాం. రాయలసీమకు బనకచర్ల గేట్‌వే కానుంది. ఈ ప్రాజెక్టుతో సీమ జిల్లాలతోపాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు లబ్ది చేకూరుతుంది. రూ.80 వేల కోట్లతో ప్రాజెక్టును పూర్తి చేస్తే రాష్ట్రానికి ఎంతో ఆదాయం వస్తుంది. డబ్బుంటే 3 ఏళ్లలో గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు పూర్తి చేయొచ్చు. ఇది దేశంలోనే అతి పెద్ద సాగునీటి మౌలిక వసతి అవుతుంది. ప్రధాని మోదీకి ఈ ప్రాజెక్టు నివేదిక పంపిస్తున్నాం. ప్రాజెక్టుపై ఇప్పటికే కేంద్ర ఆర్థికమంత్రితో మాట్లాడాం. కేంద్రమే ఈ ప్రాజెక్టు వ్యయాన్ని భరించలేదు. హైబ్రిడ్ మోడల్‌లో నిధుల సమీకరణకు ఆలోచిస్తున్నామని అన్నారు. గోదావరి-బనకచర్లతో 80 లక్షల మందికి తాగునీరు అందుతుంది. 7.5 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు వస్తుంది. ఈ ప్రాజెక్టు నిర్మించేందుకు 48వేల ఎకరాల భూసేకరణ అవసరం. ఇది చరిత్రను తిరగరాయబోయే ప్రాజెక్టు. చాలా సీరియస్‌గా తీసుకున్నాం. గోదావరి- బనకచర్లతో భావితరాలకు నీటి సమస్య ఉండదు. ఈ ప్రాజెక్టుపై ప్రజల్లో కూడా చర్చ జరగాలి. ప్రైవేటు సంస్థలు చేపడితే ప్రభుత్వం చెల్లింపులు చేసే విధానాన్ని రాజస్థాన్‌లో అమలు చేశారు. రోడ్ల మాదిరిగా ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ ప్రైవేటు సంస్థలు చేపట్టాలి. వయబిలిటి గ్యాప్ ఫండ్ వరకు ప్రభుత్వం ఇస్తుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ పూర్తి చేసి 2-3 నెలల్లో టెండర్లు పిలుస్తాం అన్నారు. ప్రపంచం మొత్తం ఇప్పుడు గ్రీన్ ఎనర్జీ వైపు ప్రయాణిస్తోంది. మనమూ ఆ దిశగా ప్రయాణం చేయాల్సి ఉంది' అని చంద్రబాబు పేర్కొన్నారు.వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికు క్రెడిబులిటీ లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. ఐదేళ్లలో ఏం జరిగింది...ఇప్పుడు ఏం జరిగింది అని ప్రజలు చూస్తున్నారన్నారు. జగన్ ఎప్పుడు ఏం చేస్తారనేది అతనికే తెలియదని ఎద్దేవా చేశారు. క్రెడిబిలిటీ లేని నాయకులు, హిడెన్ ఏజెండాతో మాట్లాడతారని సెటైర్లు గుప్పించారు. వాస్తవాలు లేకుండా జగన్ మాట్లాడతారని మండిపడ్డారు. అబద్దాలతో రాజకీయం చేశారని.. ఇప్పుడు అలాకాదని అన్నారు. రాష్ట్ర ప్రజలకు సీఎం చంద్రబాబు నాయుడు 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సచివాలయంలో సాగునీటి ప్రాజెక్ట్‌లపై సీఎం చంద్రబాబు పవర్ ప్రజెంటెషన్ ఇచ్చారు. మీడియా, ఫైనాన్స్, వ్యవస్థలు, వ్యక్తులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని చెప్పారు. వాటర్ సెక్యూరిటీకి ఎంతో ప్రాధాన్యం ఇచ్చామని సీఎం చంద్రబాబు తెలిపారు. గండికోట, సోమశిల విస్తరణ, కండలేరు వంటి ప్రాజెక్టులు ముందుకు తీసుకువెళ్లామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 7 మండలాలు తెలంగాణలో ఉన్న వాటిని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి చెప్పి వాటిని ఏపీలో విలీనం చేశామని గుర్తుచేశారు. రాయలసీమకు నీరు వస్తే డెల్టాతో పోటీపడుతుంది. కృష్ణానదిలో పై నుంచి నీరురావడం లేదు, పట్టిసీమ వచ్చాక సరైన సమయంలో పంట వేయగలుగుతున్నాం. గోదావరి, కృష్ణాలో నీళ్లుతగ్గినా గోదావరిలో నీరు వస్తోంది. రాష్ట్రంలో కరవును సమర్ధంగా ఎదుర్కొంటే తప్ప అభివృద్ధి సాధ్యం కాదన్నారు. సమర్ధంగా నదులు అనుసంధానం చేసి రిజర్వాయర్‌లు కట్టుకుంటే నీటి సమస్య పరిష్కారమవుతుంది. ఏపీకి కరవు, తుఫాను వల్ల ఇబ్బందులు ఉన్నాయి. వంశధార-నాగావళి- గోదావరి-కృష్ణ వరకూ కలిపే అవకాశం ఉంటుంది. తుంగభద్ర- శ్రీశైలం - నాగార్జునసాగర్ - ప్రకాశం బ్యారేజి, చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ వస్తే నాగార్జున సాగర్ లెఫ్ట్ మెయిన్ కెనాల్ పూర్తి అవుతుందని సీఎం చంద్రబాబు తెలిపారు. 'నాగార్జన సాగర్ నుంచి వెలుగొండ ఆయకట్టును కవర్ చేసి బనకచర్ల నుంచి నల్లమల టన్నల్ ద్వారా నీరు తీసుకెళ్లవచ్చు. దీనికి నదులు, రిజర్వాయర్‌లు అనుసంధానం చేయొచ్చు.ఈ ప్రాజెక్టు వల్ల 80 లక్షల మందికి తాగునీరు, 7.5 లక్షల ఎకరాలు కొత్త ఆయకట్టు వస్తుంది. ఏపీ అంతా అనుసంధానం అవుతుంది. అందుకే ఈ ప్రాజెక్టును తెలుగుతల్లికి జలహారతి అంటున్నాం. గోదావరి నుంచి కృష్ణ నాగార్జున సాగర్ రైట్ మెయిన్ కెనాల్ బోల్లాపల్లి అక్కడి నుంచి బనకచర్ల పోలవరం డ్యాం నుంచి ప్రకాశం బ్యారేజ్ రైట్ మెయిన్ కెనాల్, తాటిపూడి లిఫ్ట్ ఇరిగేషన్ వరుకు తీసుకెళ్తాం. 4వేల నుంచి 10 వేల క్యూసెక్కులు పేరలల్ కెనాల్‌గా ఇస్తాం అది కాస్ట్ ఎఫెక్టివ్‌తో ఉంటుంది. ఇది చేస్తే కృష్ణా తూర్పు, పశ్చిమ డెల్టాలతో అనుసంధానమై 2 టీఎంసీలు తీసుకెళ్లగలుగుతాం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.'తెలుగు తల్లికి జలహారతి ప్రాజెక్టు రూపకల్పన చేశాం. విజన్ 2047 డాక్యుమెంట్‌లో బాగంగా వాటర్ ప్రాజెక్టు ప్రొవిజన్ ఉంచాం. ఇది దాదాపు ప్రస్తుతానికి రూ.80.112 కోట్లు వ్యయం అవుతుంది. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే రాష్ట్రానికి గేమ్ చేంజర్ లాంటిది. సాగునీరు...తాగునీరు..రాయలసీమ ప్రాంతాలకు పరిశ్రమలకు నీరు అందుతుంది. పవర్ పాయింట్ ద్వారా ప్రాజెక్ట్ గురించి సీఎం చంద్రబాబు వివరించారు.ఈప్రాజెక్టులో లిఫ్ట్‌లు, టన్నల్, గ్రావిటీ ద్వారా నీటిని తరలిస్తాం. 3 టీఎంసీల నీటిని పోలవరం నుంచి తీసుకుని ఒక టీఎంసీల వాడి రెండు టీఎంసీలు రాయలసీమకు పుష్ చేస్తాం. ఈ ప్రాజెక్టు చేయగలిగితే ఇండియాలోనే గొప్ప ఇరిగేషన్ ఇన్‌ఫ్రాస్టక్చర్ వస్తుంది. రాయలసీమతో పాటు అన్నిప్రాంతాలు అభివృద్ధి జరుగుతుంది' అని సీఎం చంద్రబాబు తెలిపారు. సముద్రంలో కలిసే మొత్తం గోదావరిలో 10శాతం నీటిని మాత్రమే తీసుకుంటున్నాం. ఇది చరిత్ర తిరగ రాయబోయే ప్రాజెక్టు అందుకే దీనికి తెలుగుతల్లికి జలహరతి అన్నాం. ఇదిచేయడం ద్వారా రాబోయే తరాలకు నీటి సమస్య లేకుండా చేయొచ్చన్నారు. నాలుగు వేల మెగావాట్లు మనం వాడితే పంప్ ఎనర్జీ ద్వారా పీక్ టైంలో విద్యుత్ వస్తుంది. విద్యుత్ విషయంలో యూనిట్ కాస్టును తగ్గించే ప్రయత్నం చేస్తున్నాం. అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

## న్యూ ఇయర్ వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

- సైబరాబాద్ పరిధిలో ప్లై ఓవర్ల మూసివేత
- డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు యధాతథం
- అర్ధరాత్రి వరకు మెట్రో రైల్ సర్వీసులు

**హైదరాబాద్,డిసెంబర్30( వెలుతురు):**
ఆంగ్ల నూతన సంవత్సరాది మరికొన్ని గంటల్లో రానుంది. ఈ క్రమంలో ప్రపంచమంతా వేడుకలకు సిద్ధం అవుతుంది. న్యూఇయర్ వేడుకల నేపథ్యంలో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు ఆంక్షలు విధించారు. డిసెంబరు 31 రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఐటీ కారిడార్‌లో ప్లై వర్లను మూసివేయనున్నట్లు పోలీసులు తెలిపారు. ఓఆర్‌ఆర్‌పై భారీ వాహనాలు, ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాహనాలను మాత్రమే అనుమతిస్తామన్నారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో స్పెషల్ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. సిగ్నల్ జంపింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతారని చెప్పారు. మద్యం సేవించిన వారికి పబ్‌లు, బార్ల యాజమానులు ప్రైవేటు వాహనాలు, డ్రైవర్లను అందుబాటులో ఉంచాలని పోలీసులు సూచించారు. న్యూఇయర్ వేడుకల దృష్ట్యా డిసెంబరు 31న రాత్రి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించ నున్నట్లు తెలంగాణ ఫోర్ వీలర్స్ సంఘం ప్రకటించింది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పించనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. 500 కార్లు, 250 క్యాబ్‌లు అందుబాటులో ఉంటాయని అసోసియేషన్ తెలిపింది. ప్రజలు మద్యం మత్తులో



వాహనాలు నడపొద్దని, రోడ్డు ప్రమాదాలు జరగకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. నూతన సంవత్సర వేడుకలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ మెట్రో రైళ్లు అర్ధరాత్రి వరకు సేవలందించనున్నాయి. డిసెంబర్ 31 సెలబ్రేషన్స్ సందర్భంగా రాత్రి 12.30 వరకు నడవనున్నాయి. ప్రయాణికుల సౌకర్యార్థం అర్ధరాత్రి 12.30కి చివరి రైలు స్టేషన్ నుండి బయలుదేరి 1.15 వరకు డెస్టినేషన్ స్టేషన్లో చేరుకోనున్నట్టు మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ప్రకటించారు. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ సందర్భంగా అర్ధరాత్రి వేడుకలు ఉండటంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు విస్తృతంగా జరిగే అవకాశం ఉండటంతో సేఫ్ గా ఇంటికి చేరుకునేందుకు మెట్రో ఎంతగానో ఉపయోగపడనుంది. ఈ క్రమంలో.. ప్రయాణికులు మెట్రో రైల్‌లో సేవ్ జర్నీ చేయాలని మెట్రో ఎండీ సూచించారు. మెట్రో రైల్ సేవలను ప్రత్యేక అకేషన్ పండుగలు టైంలో అర్ధరాత్రి వరకు మెట్రో సేవలను పొడిగిస్తున్నట్టు తెలిపారు. మద్యం తాగి మెట్రోలో తోటి ప్రయాణికులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రయాణికులంతా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మెట్రో ఎండీ సూచించారు.

## లాఠీచార్జి జరిగినప్పుడు మీరెక్కడ ఉన్నారు..?

- ప్రశాంత్‌కిషోర్‌ను నిలదీసిన అభ్యర్థులు

**పాట్నా, డిసెంబర్ 30 ( వెలుతురు):**
బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్సీ) పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్న అభ్యర్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడంతో రాజకీయ దుమారం చెలరేగింది. పాట్నాలోని గార్దానీబాగ్‌లో ఆదివారం సమావేశానికి పిలుపునిచ్చిన రాజకీయ వ్యూహకర్త నుంచి రాజకీయవేత్తగా మారిన ప్రశాంత్ కిషోర్‌పై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. లాఠీచార్జి తర్వాత పరామర్శకు వచ్చిన ఆయనతో వారు వాగ్వాదానికి దిగారు. ఆ సమయంలో అక్కడి నుంచి వెళ్లిపోవడాన్ని నిలదీశారు. 'మీకు దుప్పట్లు ఇచ్చాను. నన్నే విమర్శిస్తున్నారు' అన్న ప్రశాంత్ కిషోర్‌పై అభ్యర్థులు మండిపట్టారు. 'మీరు మాకు దుప్పట్లు ఇచ్చారు. ఆ తర్వాత మీ వైఖరిని చూపించారు' అని విమర్శించారు. పోలీసుల లాఠీఛార్జి సమయంలో ప్రశాంత్ కిషోర్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. 'ప్రశాంత్ కిషోర్ గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. ఆర్జేడీ కూడా ఆయన తీరును విమర్శించింది. కాగా, నిరసనకు తరలివచ్చిన అభ్యర్థులు వెళ్లిపోవాలని సూచించిన తర్వాతే తాను అక్కడి నుంచి వెళ్లినట్లు జన్ సూరజ్ పార్టీ వ్యవస్థాపకుడైన ప్రశాంత్ కిషోర్ వివరించారు. తాను వెళ్లిన 45 నిమిషాల తర్వాత వారిపై లాఠీచార్జి జరిగిందని తెలిపారు. పోలీసుల చర్యను ఆయన ఖండించారు. పాట్నా పోలీసులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీని కోసం కోర్టుతోపాటు మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తానని తెలిపారు. మరోవైపు బీపీఎస్సీ పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్న అభ్యర్థుల సమస్య పరిష్కారానికి ప్రతినిధుల సమావేశంలో తీర్మానం చేయాలని ప్రశాంత్ కిషోర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జనవరి 2 నుంచి అభ్యర్థుల నిరసనలో తాను కూడా పాల్గొంటానని ఆయన హెచ్చరించారు.



# బన్నీ అరెస్టును సమర్థించిన పవన్ కళ్యాణ్


## రేవంత్‌రెడ్డి స్థానంలో ఎవరు ఉన్న అలానే చేస్తారు

పుష్ప 2 విడుదల సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై తొలిసారి స్పందించారు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. ఆయన మాట్లాడుతూ.. గోటితో పోయేదాన్ని గొడ్డలి దాకా తెచ్చారు. థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందిన అనంతరం ఆమె ఇంటికి వెళ్లి పరమర్శించాల్సింది. ఈ విషయంలో మానవతా దృక్పథం లోపించనట్లైంది. ఈ ఘటన జరిగిన తర్వాత అల్లు అర్జున్ సంతాపం తెలపకున్న.. చిత్రబృందం అయిన సంతాపం తెలపాల్సింది. సీఎం రేవంత్ రెడ్డి పేరు అల్లు అర్జున్ మర్చిపోవడంతో అతడిని అరెస్ట్ చేశారు అనడం సరికాదు. బన్నీ స్థానంలో రేవంత్ ఉన్న అలాగే అరెస్ట్ చేస్తారు. చట్టం ఎవరికీ చుట్టం కాదని.. ఈ విషయాన్ని గుర్తు చేసుకోవాలంటూ పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించారు.

# అల్లు అర్జున్ బెయిల్‌పై 3కు వాయిదా



సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసులో సినీనటుడు అల్లు అర్జున్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై నాంపల్లి కోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఈ పిటిషన్‌పై అల్లు అర్జున్‌కి బెయిల్ ఇవ్వొద్దంటూ చిక్కడపల్లి పోలీసులు కౌంటర్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఈ రెండు పిటిషన్‌లపై నేడు విచారణ జరిగింది. అల్లు అర్జున్ తరపు లాయర్‌లు బెయిల్ మంజూరు చేయాలంటూ తమ వాదనలు ధర్మాసనంకు వినిపించారు. అయితే ఇరు పక్షల వాదానలు విన్న నాంపల్లి కోర్టు.. తీర్పును జనవరి 3కు వాయిదా వేసింది. పుష్ప2 సినిమా బెనిఫిట్ షో సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొకిసలాట ఘటనలో పోలీసులు ఇటీవల అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అయితే అదే రోజు హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. నాలుగు వారాలపాటు ఈ బెయిల్‌ను మంజూరుచేసిన కోర్టు రూ.50 వేల వ్యక్తిగత బాండ్లు చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్‌కు సమర్పించాలని ఆదేశించింది. మరోవైపు నాంపల్లి కోర్టు అతడికి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. తాజాగా ఈ రిమాండ్ ముగియడంతో అదే రోజు ఆయన వర్చువల్‌గా కోర్టుకు హాజరయ్యారు. అప్పుడే అల్లు అర్జున్ తరఫు న్యాయవాదులు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఈ పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా పడింది. అయితే నాంపల్లి కోర్టు నేడు విచారణ చేపట్టి.. తీర్పును జనవరి 03కి వాయిదా వేసింది.




# వైవిధ్యభరితమైన పాత్రలో వస్తున్న అనుష్క 'ఘాటీ'

కెరీర్ బిగినింగ్‌లో గ్లామర్ పాత్రల్లో ఓ వెలుగు వెలిగింది అనుష్క. అయితే.. 'అరుంధతి' తర్వాత ఆమె నుంచి రెగ్యులర్ గ్లామర్ పాత్రలు కాకుండా, అభినయానికి ఆస్కారమున్న పాత్రల్నే ఆడియన్స్ ఆశించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో ఆమె చేసిన వేదం, బాహుబలి ఫ్రాంచైజీ, రుద్రమదేవి, సైజ్ జీరో, భాగమతి, నిశ్శబ్ధం, మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి సినిమాలు ఆమెను నటిగా గౌరవప్రదమైన స్థానంలో కూర్చోబెట్టాయి. ఆ వరుసలో ఆమె చేస్తున్న మరో వైవిధ్యమైన సినిమానే 'ఘాటీ'. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ఉత్తరాంధ్ర గంజాయి తోటల నేపథ్యంలో సాగే విభిన్న కథాచిత్రమని తెలుస్తున్నది. ఇందులో అనుష్క పాత్ర ఊహలకు అతీతంగా ఉంటుందని సమాచారం. ఇటీవల విడుదలైన టీజర్‌లో.. అనుష్క బస్‌లో ఓ వ్యక్తిని మర్డర్ చేసే సన్నివేశం సినిమాపై అంచనాలు పెంచేసింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ 80 శాతం పూర్తయింది. ట్కక్లైమాక్స్ షూట్ మాత్రమే మిగిలివుంది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా నడుస్తున్నది. జనవరి చివరివారం నుంచి ట్కక్లైమాక్స్ షూట్ ఉంటుందని తెలుస్తున్నది. ఏప్రిల్ 18న చిత్రాన్ని విడుదల చేయనున్నారు. సాయిమాధవ్ బుర్రా ఈ సినిమాకు సంభాషణలు అందిస్తున్న విషయం తెలిసిందే.





# ఆమెతో పనిచేస్తే మాయలో పడిపోవాల్సిందే..!

## - దర్శకుడు వాసన్‌బాల

'అలియాభట్ ఓ మాయ.. ఒక్కసారి ఆమెతో పనిచేస్తే ఆ మాయలో ఎవరైనా పడిపోవాల్సిందే. ఆమె ఆరా మనల్ని కూడా కమ్మేస్తుంది.' అంటున్నారు దర్శకుడు వాసన్‌బాల. ఇటీవలే అలియాతో ఆయన 'జిగ్రా' సినిమా తెరకెక్కించారు. ఫలితం ఆశించిన స్థాయిలో లేకపోయినా.. అలియాతో పనిచేశానన్న తృప్తి మాత్రం 'జిగ్రా' వల్ల లభించిందని ఆయన అన్నారు. ' 'జిగ్రా' సీరియస్ సబ్జెక్ట్. ఆ కథలో కామెడీ లేదు. కానీ సెట్ అంతా ఎప్పుడు కామెడీగా ఉండేది. కారణం అలియాభట్. తను నవ్వుతూ అందర్నీ నవ్విస్తూ ఓ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని క్రియేట్ చేయడం అలియా స్పెషాలిటీ. ఆమెతో ఒక్కసారి పనిచేశాక.. మళ్లీ ఇంకొకరితో పనిచేయడం చాలా కష్టం. ఎందుకంటే తనే గుర్తుకొస్తుంటుంది..' అంటూ మాట్లాడారు వాసన్‌బాలా. దీనిబట్టి అలియా మాయ ఏ రేంజ్‌లో ఉంటుందో అర్థంచేసుకోవచ్చు.



# నెంబర్‌వన్ స్థానంలో నిలిచిన కల్కి 2898 ఏడీ చిత్రం

ప్రముఖ ఎంటర్‌టైన్మెంట్ పోర్టల్ ఇంటర్నెట్ మూవీ డేటా బేస్ ప్రతి సంవత్సరం దేశంలోని సినిమాల క్రేజ్ గురించి సర్వే నిర్వహించి.. మోస్ట్ పాపులర్ విభాగంలో టాప్ పొజిషన్‌లో ఉన్న సినిమాల జాబితాలను విడుదల చేస్తుందన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ ఏడాది మోస్ట్ పాపులర్‌గా నిలిచిన సినిమాల జాబితాను ఐఎండీబీ విడుదల చేసింది. ఈ జాబితాలో ప్రభాస్ నటించిన కల్కి 2898 ఏడీ చిత్రం అగ్ర స్థానంలో ఉండగా.. బాలీవుడ్ బ్లాక్ బస్టర్ అందుకున్న 'స్త్రీ 2' రెండో స్థానంలో నిలిచింది. ఇక టాప్ టెన్‌లో ఉన్న సినిమాలు ఒకసారి చూసుకుంటే.! ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన బ్లాక్ బస్టర్ 'కల్కి 2898 ఏడీ. ది గ్రేట్ లెజెండ్స్ అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, హీరోయిన్ దీపిక పదుకొనే వంటి గొప్ప యాక్టర్స్ నటించిన ఈ చిత్రం జూన్ 27 న ప్రపంచవ్యాప్తంగా విడుదలై బ్లాక్ బస్టర్ అందుకొవడమే కాకుండా.. రూ.1300 కోట్ల వసూళ్లను రాబట్టింది. ఈ చిత్రం 2024 ఐఎండీబీ మోస్ట్ పాపులర్ సినిమా విభాగంలో టాప్ పోజిషన్‌లో నిలిచింది.

# పవన్ కళ్యాణ్‌ను కలిసిన దిల్‌రాజ్

## గేమ్ ఛేంజర్ ప్రీ రిలీజ్‌కు పవన్‌కు ఆహ్వానం



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తేజ్, దిగ్గజ దర్శకుడు శంకం కాంబినేషన్‌లో వస్తున్న తాజా చిత్రం గేమ్ ఛేంజర్. ఈ సినిమాను అగ్ర నిర్మాత దిల్ రాజు నిర్మిస్తుండగా.. థమన్ సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. రామ్ చరణ్ శంకర్ దిల్ రాజు కాంబినేషన్‌లో ఈ సినిమా వస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా.. ప్రీ రిలీజ్ వేడుకను ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించబోతున్న విషయం తెలిసిందే. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను టీం ఇన్‌వైట్ చేయనున్నట్లు గత కొన్ని రోజులుగా వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే ఇదే విషయంపై నిర్మాత దిల్ రాజు నేడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో మంగళగిరి జనసేన కార్యాలయంలో భేటీ అయ్యాడు. దిల్ రాజు గేమ్ ఛేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి చీఫ్ గెస్ట్‌గా పవన్ రావాలని దిల్ రాజు కోరడంతో జనసేనాని ఒకే చెప్పినట్లు తెలుస్తుంది. ఇక ఈ ప్రీ రిలీజ్ వేడుకను జనవరి 04న రాజమండ్రిలో నిర్వహించబోతున్నట్లు సమాచారం.

# ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలిపిన నాగచైతన్య దంపతులు



ప్రధాని నరేంద్ర మోడీ మన్ కి బాత్‌లో భాగంగా.. దివంగత నటుడు అక్కినేని నాగేశ్వరరావుపై ప్రశంసలు కురిపించిన విషయం తెలిసిందే. మన్ కీ బాత్ 117వ ఎపిసోడ్‌లో అక్కినేని నాగేశ్వరరావు గురించి ప్రధాని మోడీ మాట్లాడుతూ.. అక్కినేని తన కృషితో తెలుగు సినిమాను శిఖరాగ్రాన నిలబెట్టారని ఆయన కొనియాడారు. భారతీయ సంస్కృతి, వారసత్వ విలువలు ఆయన సినిమాల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తాయని మోదీ మన్ కీ బాత్‌లో గుర్తుచేసుకున్నారు. ఏన్ఆర్‌పై మోదీ మాట్లాడటంతో తెలుగువారంతా ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఇదిలావుంటే.. మోడీ చేసిన వ్యాఖ్యలపై అక్కినేని నాగచైతన్య, శోభితా దుళిపాళ దంపతులు స్పందించారు. ప్రధాని మోడీకి కృతజ్ఞతలు చెబుతూ.. సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు. అక్కినేని నాగేశ్వరరావు కళా నైపుణ్యాన్ని, తెలుగు సినిమా పరిశ్రమ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని మీరు అభినందించడం ఎంతో ఆనందంగా ఉంది. మీ నుంచి ప్రశంసలు పొందడం మా అదృష్టం. మీకు హృదయపూర్వక ధన్యవాదాలు అంటూ నాగ చైతన్య, శోభిత రాసుకోచ్చారు.

# మదర్ డెయిరీకి శరాఘాతం

- విజయ డెయిరీ నెయ్యి వాడకానికి ఆదేశం
- ప్రభుత్వ నిర్ణయంతో నష్టాల్లోకి వెళ్లనున్న మదర్

**యాదగిరిగుట్ట,డిసెంబర్30(వెలుతురు):** రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో లడ్డూలు, ఇతర ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యిని ఇకపై విజయ డెయిరీ నుంచి కొనుగోలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. జనవరి 1 నుండి విజయ నెయ్యిని అన్ని ఆలయాలు వినియోగించనున్నాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ మదర్ డైయిరీకి ఏటా కోట్ల రూపాయల్లో ఆదాయం కోల్పోనుంది. మదర్ డైయిరీకి ప్రధాన ఆదాయ వనరుగా యాదగిరిగుట్ట దేవస్థానానికి నెయ్యి విక్రయానికి బ్రేక్ పడుతోంది. మదర్ డైయిరీకి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంతో నాలుగు దశాబ్దాల అనుబంధం ఉంది. ఇప్పటికే నష్టాల ఊబిలో కూరుకుపోయిన మదర్ డైయిరీకి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం శరాఘాతంగా మారనుంది. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రం తెలంగాణ తిరుపతిగా విరాజిల్లుతోంది. ఆలయ పునర్నిర్మాణం తర్వాత స్వామివారి ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువైంది. స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వస్తున్నారు. సాధారణ రోజుల్లో స్వామివారిని 30 వేల మంది భక్తులు దర్శించు కుంటున్నారు. శని ఆదివారాల్లో 50వేల మంది భక్తుల స్వామి వారిని దర్శించు కుంటున్నారు. తిరుపతి లడ్డు తర్వాత రుచి శుచిలో యాదగిరిగుట్ట స్వామి లడ్డును భక్తులు అమితంగా ఇష్టపడతారు. స్వామివారిని దర్శించుకున్న ప్రతి భక్తుడు మహా ప్రసాదంగా భావించే యాదాద్రి లడ్డును కొనుగోలు చేస్తున్నారు. యాదగిరిగుట్ట ఆలయంలో ప్రతిరోజు 22వేల లడ్డూలను తయారు చేస్తున్నారు. ఈ లడ్డు తయారీకి ప్రభుత్వ రంగ సంస్థ మదర్ డైయిరీ నెయ్యిని వినియోగిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ లో తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వివాదం తీవ్ర దుమారం రేపింది. ఈ నేపథ్యంలో తెలంగాణ సర్కార్ అప్రమత్తమై రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో విజయ డైయిరీ



నెయ్యిని కొనుగోలు చేయాలని ఆదేశించింది. దీంతో యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి జనవరి 1నుంచి విజయ డెయిరీ నెయ్యి సరఫరా కానుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో మదర్ డైయిరీ ఏటా కోట్ల రూపాయల్లో ఆదాయం కోల్పోనుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదగిరిగుట్ట, చెర్వుగట్టుతో పాటు రాష్ట్రంలోని కీసర, వేములకొండ తదితర ఆలయాలకు కొన్నేళ్లుగా మదర్ డెయిరీ నెయ్యి సరఫరా చేస్తోంది. తద్వారా మదర్ డెయిరీకి ఏటా రూ.36 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. ఇందులో ఒక్క యాదగిరిగుట్ట దేవస్థానం నెలకు 30 టన్నుల నెయ్యిని మదర్ డెయిరీ నుంచి కొనుగోలు చేస్తున్నారు. 35 ఏళ్లుగా మదర్ డైరీ నెయ్యిని వినియోగిస్తున్నామని, ఇందుకు గాను దేవస్థానం ఏటా రూ.18 కోట్ల వరకు చెల్లిస్తున్నామని ఆలయ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి ఒకటో తేదీ నుండి విజయ డైయిరీ నెయ్యిని వినియోగిస్తామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే నష్టాల్లో ఉన్న మదర్ డైయిరీ.. ప్రభుత్వ నిర్ణయంతో మరింత చతికిలపడే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి నల్లగొండ- రంగారెడ్డి జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న నార్ముల్ మదర్ డైయిరీలో అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన రైతులే ఉన్నారు. జిల్లాలో 24 చిల్లింగ్ సెంటర్లు ఉండగా, 435 సొసైటీల ద్వారా సుమారు 45 వేల మంది రైతులు రోజూ సగటున లక్ష లీటర్ల పాలు పోస్తున్నారు. మదర్ డైయిరీకి వేల లీటర్ల పాలు పోసి ఉపాధి పొందుతున్నారు. జిల్లాలో వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమ గడిచిన 40 ఏళ్లుగా కొనసాగుతోంది. ప్రైవేట్ డైయిరీలు పుట్టగొడుగుల్లా పుట్టుకువచ్చినా రైతులు మదర్ డైయిరీని కాపాడుకుంటూ వస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంలో యాదగిరిగుట్ట, చెరువు గుట్టు దేవాలయాలను మినహాయించాలని రైతులు కోరుతున్నారు. యాదగిరిగుట్ట దేవస్థానానికి ప్రతి నెలా 30 టన్నుల నెయ్యి మదర్ డైయిరీ సరఫరా చేస్తుంది. ఇది డెయిరీకి అతిపెద్ద ఆదాయ వనరుగా ఉంది. లడ్డూ ప్రసాద తయారీలో వినియోగిస్తున్న మదర్ డైయిరీ నెయ్యి స్వచ్ఛమైనదేనని, ఎలాంటి కల్తీ లేదని స్టేట్ ఫుడ్ లేబొరేటరీ రిపోర్ట్ ఇచ్చింది. కాగా యాదగిరిగుట్టకు గత 40 ఏళ్లుగా మదర్ డెయిరీనే నెయ్యి సరఫరా చేస్తోంది. ఈ డెయిరీ కాంట్రాక్ట్ మార్చి 2025 వరకు ఉంది. ఈ నేపథ్యంలో గుట్టకు మదర్ డెయిరీ నెయ్యినే సరఫరా చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. మదర్ డైయిరీలో యాదాద్రి జిల్లా రైతులే అత్యధికంగా ఉన్నారని, రైతుల ప్రయోజనం కాపాడేందుకు తాము ప్రయత్నిస్తున్నామని నేతలు చెబుతున్నారు. ప్రభుత్వ నిర్ణయం నుంచి యాదగిరిగుట్టను మినహాయించేలా ప్రయత్నిస్తామని నేతలు చెబుతున్నారు.

## గురుకులాలంటే ఎందుకింత నిర్లక్ష్యం.? : కేటీఆర్

**హైదరాబాద్, డిసెంబర్ 30 (వెలుతురు):**



కాంగ్రెస్ ప్రభుత్వానికి గురుకులాలంటే ఎందుకింత నిర్లక్ష్యమో అర్థం కావడం లేదని, బీఆర్ఎస్ పాలనలో గురుకులు ఒక వెలుగు వెలిగితే ఇప్పుడు అంధకారంలో మగ్గుతున్నాయని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. పదేండ్లలో ఎవరెస్ట్ శిఖరమంత ఎత్తు ఎదిగిన గురుకులాల గౌరవం.. ఏడాదిలో ఎందుకు పడిపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. గురుకులాలను ఉద్దేశపూర్వకంగా పక్కనపెట్టే ప్రయత్నం చేస్తున్నారా అని మండిపడ్డారు. ఇది కక్ష, శిక్ష్యా లేక నిర్లక్ష్యమా అని ఎక్స్ వేదికగా కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీశారు. మండలానికి ఒక్క గురుకుల పాఠశాలకు మాత్రమే పరిమితం చేసే కుట్ర దాగి ఉందా అని సందేహం వ్యక్తం చేశారు. అందుకే ఉద్దేశపూర్వకంగా విద్యార్థుల్లో, విద్యార్థుల తల్లిదండ్రులలో అభద్రతా భావం పెంచుతున్నారా అన్నారు. ఏడాదిలో 50 మందికి పైగా విద్యార్థులు మరణించినా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని దుయ్యబట్టారు. ప్రతిష్ఠాత్మకంగా సీఎం నుంచి మంత్రుల వరకు కామన్ డైట్ అంటూ అట్టహాసంగా ప్రారంభించింది ఆరంభ శూరత్వమేనా అంటూ విమర్శించారు. కేసీఆర్ పాలనలో దేశానికి ఆదర్శం, నేడు అంతులేని నిర్లక్ష్యమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు గురుకులాల నుండి పారిపోయే పరిస్థితికి కారణమెవ్వరని ప్రశ్నించారు.

## సీఎం యోగి ఆదిత్యనాథ్ నివాసం కింద శివలింగం - అఖిలేఖ్ యాదవ్

- అఖిలేష్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు

**లక్నో, డిసెంబర్ 30 (వెలుతురు):**



ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం యోగి ఆదిత్యనాథ్ అధికార నివాసం కింద శివలింగం ఉందని అన్నారు. ఈ నేపథ్యంలో అక్కడ కూడా తవ్వకాలు జరుపాలని ఆయన డిమాండ్ చేశారు. కొన్ని రోజుల కిందట సంభాల్‌లో మొఘల్ కాలం నాటి మసీదు సర్వే నేపథ్యంలో అల్లర్లు జరిగాయి. ఈ ఘర్షణలో పలువురు మరణించగా పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఈ సంఘటన తర్వాత సంభాల్‌లో పలు చోట్ల తవ్వకాలతోపాటు ఇళ్ల కూల్చివేతలు కొనసాగుతున్నాయి. కాగా, అఖిలేష్ యాదవ్ సోమవారం దీని గురించి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం తన వైఫల్యాలు కప్పిపుచ్చడానికి, ప్రజా సమస్యల నుంచి దృష్టిని మరల్చడానికి పలు ప్రాంతాల్లో తవ్వకాలు జరుపుతోందని ఆయన విమర్శించారు. అమాయకుల ఇళ్లను బుల్డోజర్లతో అక్రమంగా కూల్చివేస్తున్నారని ఆరోపించారు. 'సీఎం అధికార నివాసం కింద కూడా శివుడి రూపాన్ని సూచించే స్థూపాకార శివలింగం ఉందని మేం భావిస్తున్నాం. అక్కడ కూడా తవ్వకాలు జరుపాలి' అని అన్నారు. మరోవైపు అఖిలేష్ యాదవ్ వ్యాఖ్యలను బీజేపీ ఖండించింది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం శివలింగం గురించి ఇలా మాట్లాడటం సిగ్గుచేటని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శించారు.

## ప్రజలను ఆకట్టుకునేందుకు కేజ్రీవాల్ విశ్వ ప్రయత్నాలు

- అర్చకులకు రూ. 18 వేల వేతనం ఇస్తామని ప్రకటన



**ఢిల్లీ, డిసెంబర్ 30 (వెలుతురు):** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికలు సమీపిస్తుండటంతో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ ప్రజలను ఆకట్టుకునేందుకు కీలక హామీలు ఇస్తోంది. ఈ నేపథ్యంలో ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సోమవారం కీలక ప్రకటన చేశారు. ఆలయాలు, గురుద్వారాల్లో పనిచేసే పూజారులు, గ్రంథీలకు కేజ్రీ వరాల జల్లు కురిపించారు. తాము అధికారంలోకి వస్తే.. వారికి నెలకు రూ.18 వేలు గౌరవ వేతనం అందజేస్తామని ప్రకటించారు. సోమవారం కేజ్రీవాల్ విలేకరులతో మాట్లాడుతూ.. 'పురోహితులు, గ్రంథీలు మన ఆచారాలను భవిష్యత్తు తరాలకు అందజేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. సమాజానికి వారు నిస్వార్థంగా సేవ చేస్తున్నారు. దురదృష్టవశాత్తు వారి ఆర్థిక శ్రేయస్సును ఎవరూ పట్టించుకోవడం లేదు. మేం అధికారంలోకి వస్తే వారికి నెలకు రూ.18 వేలు గౌరవ వేతనం అందిస్తాం' అని కేజ్రీవాల్ అన్నారు. ఈ పథకానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ రేపటి నుంచే ప్రారంభం అవుతుందని కేజ్రీ వెల్లడించారు. హనుమాన్ ఆలయంలో తానే స్వయంగా ఈ ప్రక్రియను ప్రారంభిస్తానని తెలిపారు. ఈ ప్రక్రియకు అడ్డుపడొద్దని ఈ సందర్భంగా బీజేపీని కేజ్రీ అభ్యర్థించారు. 'రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అడ్డంకులు సృష్టించవద్దని నేను బీజేపీని అభ్యర్థిస్తున్నాను. దీన్ని అడ్డుకోవడం పాపం చేసినట్లే అవుతుంది' అని వ్యాఖ్యానించారు.

## దేశ ఆర్థిక వ్యవస్థకు దశ,దిశ చూపిన దార్శనికుడు

- మన్మోహన్‌కు నివాళి కార్యక్రమంలో హరీష్ రావు
- స్కిల్ వర్సిటీకి పివి పేరు పెట్టాలని డిమాండ్

**హైదరాబాద్,డిసెంబర్30(వెలుతురు):** దేశ ఆర్థిక వ్యవస్థకు దశ, దిశ చూపిన వ్యక్తి మన్మోహన్ సింగ్ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఆయనపై పీవీ నరసింహా రావు పెట్టుకున్న నమ్మకాన్ని ఒమ్ము చేయలేదని చెప్పారు. లైసెన్స్ రాజ్, పర్మిషన్ రాజ్, కోటా రాజ్ విధానాలకు మన్మోహన్ స్వస్తి పలికారని తెలిపారు. అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమైంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సభ నివాళులు అర్పించింది. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. యూపీఏ హయాంలో ఎన్నో కుంభకోణాలు జరిగినట్లు వార్తలొచ్చాయి. కానీ ప్రధానిగా ఉన్న మన్మోహన్ సింగ్‌పై ఒక్క అవినీతి ఆరోపణ రాలేదని గుర్తుచేశారు. మన్మోహన్ సింగ్ జీవితం దేశ సేవలో ధన్యమైందని చెప్పారు. ఆయన సేవలను గుర్తుంచుకునేలా ప్రభుత్వాలు ఏం చేసినా బీఆర్ఎస్ పార్టీ మద్దతు ఇస్తుందని వెల్లడించారు. పీవీ ఖ్యాతిని చాటేలా బీఆర్ఎస్ ప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టిందని, స్కిల్ వర్సిటీకి నరసింహారావు పేరు పెట్టాలని ప్రతిపాదించారు. భారత రత్నకు మన్మోహన్ సింగ్ 100 శాతం అర్హులేనని చెప్పారు. ఆయనకు కేంద్ర ప్రభుత్వం భారత రత్న ఇవ్వాలని బీఆర్ఎస్ కోరుతున్నదని తెలిపారు. గతంలో పీవీకి భారత రత్న ఇవ్వాలని బీఆర్ఎస్ తీర్మానించిందని, దానికి అనుగుణంగా కేంద్రం దేశ అత్యున్నత పౌర పురస్కారం ఇచ్చిందని గుర్తుచేశారు. గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను బాగుచేసేందుకు పీవీ-మన్మోహన్ ద్వయం కృషి చేసిందని వెల్లడించారు. 1996లో కాంగ్రెస్ ఓటమికి ఆర్థిక సంస్కరణలూ కారణమని ఓ కమిటీ నివేదిక ఇచ్చిందని, దానిని చూసిన మన్మోహన్ సింగ్ కంటతడి పెట్టారని పేర్కొన్నారు. మన్మోహన్ భౌతికంగా లేకున్నా ఆయన చేసిన సేవలు ఎప్పటికీ ఉంటాయన్నారు. విదేశాల్లోనూ ఆయనకు



ఉన్నత ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. వాటికంటే దేశమే ముఖ్యమని చాటిన గొప్ప వ్యక్తి మన్మోహన్ అని చెప్పారు. ఆయన ఎప్పుడూ పదవుల కోసం చూడలేదని, పదవులే ఆయనను వెతుక్కుంటూ వచ్చాయన్నారు. మన్మోహన్ సంతాప తీర్మానాన్ని మండలిలోనూ పెట్టి ఉంటే బాగుండేదని చెప్పారు.

## మన్మోహన్‌సింగ్ అస్తికలను యమునా నదిలో కలిపిన కుటుంబ సభ్యులు



**ఢిల్లీ, డిసెంబర్ 30 (వెలుతురు):** మాజీ ప్రధానమంత్రి, ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ మరణించిన విషయం తెలిసిందే. ఈనెల 26న ఢిల్లీలోని ఎయిమ్స్‌లో తుదిశ్వాస విడిచారు. ఢిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో శనివారం ఆయన అంత్యక్రియలు జరిగాయి. కేంద్రం అధికార లాంఛనాలతో ఆయనకు తుది వీడ్కోలు పలికింది. మన్మోహన్ పెద్ద కూతురు ఉపిందర్ సింగ్ తన తండ్రికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో తాజాగా మన్మోహన్ అస్తికలను కుటుంబ సభ్యులు యమునా నదిలో కలిపారు. మజ్ను కా తిలా గురుద్వారా సమీపంలోని అష్ట్ ఘాట్ వద్ద సిక్కు సంప్రదాయాలను అనుసరించి ఆదివారం ఆయన అస్తికలను నదిలో నిమజ్జనం చేశారు. మన్మోహన్ సింగ్ సతీమణి, ముగ్గురు కుమార్తెలు, ఇతర కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మన్మోహన్ సింగ్‌కు ఢిల్లీలో స్మారకాన్ని నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనువైన స్థలాన్ని త్వరలోనే నిర్ణయిస్తామని పేర్కొన్నది. కాగా, స్మారక నిర్మాణం జరగనున్న స్థలంలోనే అంత్యక్రియలు జరపాలని అంతకుముందు కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. మన్మోహన్ అంత్యక్రియలు, స్మారకానికి స్థలాన్ని నిర్ణయించకుండా బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే దేశ తొలి సిక్కు ప్రధానమంత్రిని అవమానిస్తున్నదని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది.

## 2024 డిసెంబర్ విమానయానాలకు చీకటి నెల

- వివిధ ప్రాంతాల్లో ఏడు ఘోర ప్రమాదాలు
- ఏకంగా 240 మంది దుర్మరణం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 30 (వెలుతురు):** 2024 ముగింపునకు చేరింది మరికొన్ని గంటల్లో కొత్త ఏడాదికి స్వాగతం పలికేందుకు ప్రపంచం మొత్తం సిద్ధమవుతోంది. అయితే, ఏడాది చివరి నెల డిసెంబర్ విమానయాన చరిత్రలో 'చీకటి నెల'గా నిలిచింది. ఎందుకంటే డిసెంబర్ నెలలో ఏకంగా ఏడు ఘోరమైన విమాన ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. మొత్తం ఏడు ప్రధాన ఘటనల్లో ఏకంగా 240 మంది మరణించడం కలచివేస్తోంది. ఈ ఒక్క నెలలో జరిగిన విమాన ప్రమాదాలు విమానయాన భద్రతపై పలు ప్రశ్నల్ని లేవనెతుతున్నాయి. దక్షిణ కొరియాలో ఆదివారం ఘోర విమాన ప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. దాదాపు 179 మంది ప్రయాణికులు సజీవంగా దహనమయ్యారు. ల్యాండింగ్ అవుతున్న సమయంలో గేర్ పనిచేయకపోవడంతో విమానం వేగంగా రన్‌వేపై దూసుకువెళ్లి ఫెన్సింగ్ గోడను ఢీకొంది. వెంటనే విమానంలో మంటలు చెలరేగి అందులోని ఇద్దరు సిబ్బంది మినహా మొత్తం 179 మంది సజీవదహనం చెందారు. దక్షిణ కొరియా విమానయాన చరిత్రలోనే ఇది అత్యంత ఘోర ప్రమాదంగా భావిస్తున్నారు. డిసెంబర్ 25న అజర్‌బైజాన్ విమానం కూలిన ప్రమాదంలో 38 మంది ప్రాణాలు



కోల్పోయారు. అజర్‌బైజాన్ రాజధాని బాకు నుంచి రష్యాలోని గ్రోజ్నీకి బయల్దేరిన విమానాన్ని పొగమంచు కారణంగా కజకిస్థాన్‌లోని అక్టౌ విమానాశ్రయానికి మరలించారు. విమానం దానికి దగ్గర్లో ల్యాండ్ అవుతున్నప్పుడు పక్షి ఢీకొనడంతో కుప్ప కూలి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో విమానంలో 37 మంది అజర్‌బైజాన్ వాసులు, 16 మంది రష్యన్లు, ఆరుగురు కజకిస్థానీలు, ముగ్గురు కిర్గిస్థానీ పౌరులు ఉన్నారు. ఈ ఘటనలో 38 మంది దుర్మరణం పాలయ్యారు. 27 మంది గాయపడ్డారు.

### డిసెంబర్ 22న మూడు ప్రమాదాలు.. 19 మంది మృతి

డిసెంబర్ 22న బ్రెజిల్‌లో సంభవించిన విమాన ప్రమాదంలో పది మంది ప్రాణాలు కోల్పోయారు. విదేశీ ప్రయాణికులతో వెళుతున్న ఓ బుల్లి విమానం ఆదివారం దక్షిణ బ్రెజిల్ టూరిస్ట్ సిటీ గ్రామాడోలోని దుకాణాల్లోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో విమానంలో పది మంది ఉండగా.. వారంతా ప్రాణాలు కోల్పోయారు. క్రిస్మస్ పండుగకు కొద్ది రోజుల ముందు ఈ ఘటన జరిగింది. అందరూ పండుగ కోసం ముస్తాబవుతున్న నేపథ్యంలో ఈ ఘటన జరగడం స్థానికుల్లో విషాదాన్ని నింపింది. ఇక అదే రోజుటర్కీలో కూడా ఇలాంటి ప్రమాదమే సంభవించింది. వైద్యులతో బయల్దేరిన అంబులెన్స్ హెలికాప్టర్ ఘోర ప్రమాదానికి గురైంది. రోగిని తీసుకొచ్చేందుకు టేకాఫ్ అయిన హెలికాప్టర్ హాస్పిటల్ భవనాన్ని ఢీకొట్టి, కుప్పకూలింది. అందులో ఉన్న ఇద్దరు పైలట్లు, ఒక డాక్టర్, ఒక ఆరోగ్య సంరక్షకుడు చనిపోయారు. టర్కీ ఆగ్నేయప్రాంతంలోని ముగ్లా నగరంలో డిసెంబర్ 22 ఆదివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. డిసెంబర్ 22న పాపువా న్యూ గునియాలో నార్త్ కోస్ట్ ఏవియేషన్ నిర్వహిస్తున్న చిన్న విమానం కూలి అందులో ఉన్న 5 మంది ప్రాణాలు కోల్పోయారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com